7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 341 | బుధవారం | 12-11-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

కారు బాంబు పేలుడులో 12 మంది మృతి

02

# ఢిల్లీ పేలుడు కేసు ఎన్ఐఎ చేతికి

ఉగ్రచర్యగా పరిగణిస్తున్న కేంద్ర ప్రభుత్వం

13కు చేరిన మృతుల సంఖ్య

నేరస్థులను వేటాడి పట్టుకోవాలని హోంమంత్రి అమిత్ షా ఆదేశం

ఉన్నతాధికారులతో రెండుదఫాలు సమీక్ష



**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు మంగళవారం నాడు హోం మంత్రిత్వ శాఖ మంగళవారం అప్పగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ 13 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ పేలుడు ఘటనను కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద చర్యగా పరిగణిస్తున్నట్లు తెలుస్తుంది. సాధారణంగా ఉగ్రవాద కేసులను మాత్రమే ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుందని 'పిటిఐ' సంస్థ తన కథనంలో పేర్కొంది. ఎన్ఐఎకు ఈ కేసును అప్పగించడం ద్వారా కేంద్రం పేలుడు ఘటన వెనుక ఉగ్రసంబంధాలు ఉన్నట్లు భావిస్తున్నట్లు అర్థమవుతోంది. పేలుడు తర్వాత దేశ రాజధాని ఢిల్లీ, దేశంలోని ఇతర ప్రాంతాలలో భద్రతా పరిస్థితిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్షించిన కొద్ది గంటల తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

**వేటాడి పట్టుకుంటాం :** ఢిల్లీ పేలుడు వెనుక ఉన్న ప్రతి ఒక్క నేరస్థుడిని వేటాడి పట్టుకోవాలని అధికారులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశించారు. పేలుడు చర్యలో భాగస్వామి అయిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంస్థల సంపూర్ణ ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన మంగళవారం రెండు సార్లు భద్రతా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుద ఉదయం, ఆ తరువాత మధ్యాహ్నం ఈ సమావేశాలను జరిపారు. మొదటి సమావేశంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో తరువాయి 2లో





# అందెశ్రీకి అంతిమ వీడ్కోలు

- ఘట్‌కేసర్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు, సాహితీ ప్రియులు
- అంతిమయాత్రలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు
- పాడేమోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జయ జయహే తెలంగాణ గీతాన్ని పాఠ్యాంశంలో చేరుస్తాం


**అందెశ్రీ పేరుతో స్మృతి వనం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటన**

ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్ మల్కాజ్‌గిరి

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. ఎంతోకాలంగా అత్యంత సన్నిహితంగా మెలిగిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో భారమైన హృదయంతో ముఖ్యమంత్రి అంతిమయాత్రలో పాల్గొని అశ్రునివాళి అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి అందెశ్రీ పాడె మోశారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు అక్షరయోధుడు అందెశ్రీకి కడసారి వీడ్కోలు పలికారు. మొదట లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సి నగర్ వరకు అంతిమ యాత్ర కొనసాగింది. కళాకారుల నాట్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య కొనసాగిన అంతిమ యాత్రలో పలు తరువాయి 12లో

# కారు నడిపింది పుల్వామా వైద్యుడు

- అనుమానితుడిగా భావిస్తున్న దర్యాప్తు సంస్థలు
- పేలుడులో మరణించిన డాక్టర్ ఉమర్ నబీ
- నిర్ధారణ కోసం తల్లి డిఎన్ఎ నమూనా సేకరణ
- ఢిల్లీలో హై అలర్ట్, కశ్మీర్‌లోనూ గాలిస్తున్న భద్రతాదళాలు
- ఘటనపై ఉపా కింద కేసు నమోదు



**న్యూఢిల్లీ / శ్రీనగర్ :** ఎర్రకోట సమీపంలో సోమవారం పేలుడు సంభవించిన కారును నడుపుతున్న వ్యక్తిని పుల్వామాకు చెందిన వైద్యుడు డాక్టర్ ఉమర్ నబీ అని మంగళవారం నాడు ఎన్ఐఎ, పోలీసులు అనుమానిస్తున్నారు. పేలుడులో ఆయన మరణించినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మరణించారు. జమ్మూ కాశ్మీర్ పోలీసులు డాక్టర్ ఉమర్ నబీ తల్లి నుండి మంగళవారం నాడు డిఎన్ఎ నమూనాను సేకరించారు. ఫరీదాబాద్‌లో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న ఉగ్రకుట్రతో ఆయనకు సంబంధాలున్నాయని భావిస్తున్నారు. 'పిటిఐ' వార్తా సంస్థ కథనం ప్రకారం 'పేలుడు జరిగిన ప్రదేశంలో లభించిన అవయవాల భాగాలతో సరిపోల్చేందుకు మేము డిఎన్ఎ నమూనాను తీసుకున్నాము'ని శ్రీనగర్‌లో ఒక అధికారి తెలిపారు. పేలిన తరువాయి 2లో

అమిత్ షా రాజీనామా చేయాలి : కాంగ్రెస్ 05

# బెట్టింగ్ యాప్ కేసు



సిట్ విచారణలో విజయ్‌దేవరకొండ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ మంగళవారం లక్డీకాపూల్‌లోని సిఐడి సిట్ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో సిట్ అధికారులు విజయ్‌ను మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రశ్నించారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విజయ్ దేవరకొండ సహా పలువురు ప్రముఖులకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. ఇదివరకే పలువురిని విచారించిన సిట్ అధికారులు, తాజాగా విజయ్‌ను ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్‌ల నుంచి తీసుకున్న పారితోషికం, కమీషన్లపై సిట్ అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. విచారణకు హాజరు కావాలని విజయ్ దేవరకొండతో పాటు నటుడు ప్రకాశ్ రాజ్‌కు కూడా సిఐడి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రకాశ్‌రాజ్‌ను త్వరలో విచారించే అవకాశాలు ఉన్నాయి.

## నిందితులను వదిలేది లేదు

ప్రధాని మోదీ



ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లో కూడా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. భూటాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ, ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఈ రోజు నేను చాలా బరువెక్కిన హృదయంతో ఇక్కడికి వచ్చా. సోమవారం తరువాయి 2లో

## పారదర్శకంగా సమగ్ర దర్యాప్తు

సిపిఐ డిమాండ్



ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన పట్ల సిపిఐ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేసింది. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. ఈ సంఘటనపై సమగ్రమైన, పారదర్శకమైన, నిర్ణీత వ్యవధితో కూడిన దర్యాప్తు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. క్షతగాత్రులకు సాధ్యమైనంత మెరుగైన వైద్య చికిత్సను ప్రభుత్వం అందించాలని, శాంతి , ప్రజల రక్షణను పరిరక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# బిహార్ రెండో విడతలోనూ భారీ ఓటింగ్

- 68.79 శాతం నమోదు
- పోలింగ్ కేంద్రాలవద్ద బారులు తీరిన ఓటర్లు
- చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం



**పాట్నా:** బిహార్ అసెంబ్లీకి తుది విడత (రెండో విడత) పోలింగ్ ప్రక్రియలో ఎన్నడూలేనంత అత్యధికంగా 68.79 శాతం పోలింగ్ జరిగింది. ఈ విడత పోలింగ్‌లో నితీశ్ కుమార్ మంత్రివర్గంలోని ఎనిమిది మంది మంత్రులతో సహా మొత్తం 1,302 మంది అభ్యర్థుల భవిష్యత్తు ఓటింగ్ యంత్రాలలో నిక్షిప్తమైంది. ఈనెల 6వ తేదీ తొలి విడత జరిగిన 65.09 శాతం పోలింగ్ కంటే రెండో విడతలో మొత్తం 3.70 కోట్ల మంది అర్హులైన ఓటర్లు 122 తరువాయి 2లో

**ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్‌డిఎకు ఆధిక్యం**

| | సర్వే సంస్థ | ఎన్డీయే | ఎంజీబీ | జేఎస్పీ | ఇతరులు |
|---|---|---|---|---|---|
| 1 | పీపుల్స్ పల్స్ | 133-159 | 75-101 | 0-5 | 2-8 |
| 2 | మ్యాట్రిజ్ | 147-167 | 70-90 | 0-2 | 2-8 |
| 3 | పీపుల్స్ ఇన్‌సైట్ | 133-148 | 87-102 | 0-2 | 3-6 |
| 4 | దైనిక్ భాస్కర్ | 145- 160 | 73-91 | 0-3 | 5-7 |
| 5 | జేవీసీ పోల్స్ | 135-150 | 88-103 | 0-1 | 5-7 |
| 6 | పీ-మార్క్ | 142-162 | 80-98 | 1-4 | 0-3 |
| 7 | చాణక్య స్ట్రాటజీస్ | 130-138 | 100-108 | 0 | 3-5 |
| 8 | డీవీ రిసెర్చ్ | 137-152 | 83-98 | 2-4 | 1-8 |
| 9 | టీఐఎఫ్ రిసెర్చ్ | 146- 163 | 76-95 | 0 | 3-6 |

# జూబ్లీహిల్స్@48 శాతం

- ఉప ఎన్నిక ఫలితాలపై రాజకీయపక్షాలు, ప్రజల్లో ఉత్కంఠ
- కొన్నిచోట్ల చెదురుమదురు ఘటనలు
- యూసుఫ్‌గూడలో బిఆర్ఎస్ నేతల ఆందోళన
- పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్
- స్థానికేతరులపై ఎన్నికల సంఘం సీరియస్



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉపఎన్నిక పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. అటు రాజకీయ పక్షాల్లో ఇటు రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఉత్కంఠతకు తెరతీసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగిసింది. ఇక ఈనెల 14న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అందరిలో ఆసక్తి పెరిగిపోయింది. అయితే ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. అయితే సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్‌లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తరువాయి 2లో

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ**

పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

| ఏజెన్సీ | కాంగ్రెస్ (ఓట్లశాతం) | బిఆర్ఎస్ (ఓట్లశాతం) | బిజెపి (ఓట్లశాతం) |
|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజీస్ | 46 శాతం | 43 శాతం | 6 శాతం |
| హెచ్ఎంఆర్ | 48.3 శాతం | 43.18 శాతం | 5.84 శాతం |
| స్మార్ట్ పోల్ సర్వే | 48.2 శాతం | 42.1 శాతం | 7.6 శాతం |
| పబ్లిక్ పల్స్ | 48.5 శాతం | 41.8 శాతం | 6.5 శాతం |



# బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భీకర ఎదురుకాల్పులు
- ఆరుగురు మావోయిస్టులు మృతి
- లొంగిపోయినవారు రాజకీయ ద్రోహులు : నక్సల్స్ లేఖ

**రాయ్‌పూర్/ఖమ్మం :** ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లో మంగళవారం మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్పి జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాల బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొందని.. ఈ సమయంలో అక్కడ దాక్కున్న మావోయిస్టులు కాల్పులు జరిపారని.. భద్రతా దళాలు దీటుగా బదులిచ్చాయని ఎస్పి పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి కాల్పులు జరుగుతున్నట్లుగా ఆయన వివరించారు. డీఆర్‌జీ బీజాపూర్, దంతేవాడ, ఎస్‌టిఎఫ్ సంయుక్త బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారన్నారు. సెర్చ్ ఆపరేషన్ సమయంలో సంఘటనా స్థలంలో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇన్సాస్, స్టెన్‌గన్, 303 రైఫిల్స్‌తో పాటు ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలను, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పీ మాట్లాడుతూ డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, బస్తర్ ఫైటర్స్, సిఆర్‌పిఎఫ్, సిఎఎఫ్ దళాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపినట్లు ఐజి పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో తరువాయి 12లో

# మొంథా తక్షణ సాయం రూ.12.99 కోట్లు

- పలు జిల్లాల్లో దెబ్బతిన్న ఇళ్లకు రూ.15వేల చొప్పున సాయం
- నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్

మొంథా తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలలో నష్టపోయిన కుటుంబాలకు రూ.12.99 కోట్ల తక్షణ సాయం అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న ఇళ్ళకు రూ.15,000 చొప్పున సాయం అందిస్తూ తరువాయి 12లో



# హైదరాబాద్ మహానగరంలో చిక్కులు లేని ప్రయాణం

- సమగ్ర ప్రణాళికల రూపకల్పనకు సర్కార్ ఆదేశం
- 2050 సంవత్సరాలకు అవసరమయ్యే ప్రణాళికలపై ప్రభుత్వం దృష్టి
- హెచ్ఎండిఎకు బాధ్యతల అప్పగింత


ప్రజాపక్షం/హైదరాబాద్

భవిష్యత్‌లో హైదరాబాద్‌లో చిక్కులులేని ప్రయాణ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్ 2050 వరకు అవసరయ్యే సదుపాయాలు ఇప్పటి నుంచి ప్రారంభించాలని సర్కార్ నిర్ణయించింది. రాబోయే 2050 సంవత్సరాలకు అవసరమయ్యే ప్రణాళికలపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ బాధ్యతలను ప్రభుత్వం హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఎ)కు అప్పగించింది. హైదరాబాద్ మహానగరం పరిధిలో సుస్థిర రవాణా కోసం వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించే పనిలో పడ్డారు. హెచ్ఎండిఎ ఇతర ప్రభుత్వ సంస్థలతో సమన్వయంతో ఈ సమగ్ర రవాణా ప్రణాళికను రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హెచ్ఎండిఎ ద్వారా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం (హెచ్ఎంఎ) కోసం సమగ్ర మొబిలిటీ ప్రణాళిక (కాంప్రేసివ్ మొబిలిటీ ప్లాన్ సిఎంపి) తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## కెనడా రచయిత డేవిడ్ సలేకు బుకర్ ప్రైజు



**లండన్:** కెనడాలో జన్మించిన హంగేరీ–బ్రిటన్ రచయిత డేవిడ్ సలే (51)కు 2025 బుకర్ బహుమతి లభించింది. ఆయన రాసిన ఆరో నవల 'ఫ్లెష్'కు ఈ బహుమతి లభించింది. లండన్‌లోని ఓల్డ్ బిల్లింగ్స్‌గేట్‌లో కన్నుల పండువగా జరిగిన కార్యక్రమంలో బుకర్ ప్రైజు విజేతను ప్రకటించారు. ఆయనకు 50,000 పౌండ్ల నగదు బహుమతితోపాటు గత ఏడాది బుకర్ విజేత సమంథా హార్వే నుండి ట్రోఫీ కూడా లభించింది. రచయిత సలే 1974లో కెనడాలోని మోంట్రియల్‌లో జన్మించారు. బ్రిటన్‌లో పెరిగారు. ఆయన తండ్రి హంగేరియన్. వారి కుటుంబం అతడి బాల్యంలోనే బీరూట్‌కు చేరింది. లెబనాన్‌లో అంతర్యుద్ధం కారణంగా అనివార్యంగా ఆ దేశాన్ని విడిచి బ్రిటన్ చేరుకుంది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సలే పట్టా పొందారు. బిబిసి కోసం ఆయన అసంఖ్యామైన నాటకాలు రాశారు. 2018లో ఆయన చిన్న కథల 'టర్బులెన్స్' ప్రచురితమైంది. భావోద్వేగం, నిర్లిప్తత, కోరికలు, పతనం వంటివన్నీ కలగలసిన ఫ్లెష్‌ను బుకర్ న్యాయమూర్తులు ఎంతగానో ప్రశంసించారు.

## ఇరాక్‌లో పార్లమెంటు ఎన్నికలు
### షియాల సద్రిస్ట్ మూమెంట్ బహిష్కరణ

**బాగ్దాద్:** బహిష్కరణ పిలుపు మధ్య ఇరాక్ పార్లమెంటుకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. ఐతే షియా తెగకు చెందిన మత గురువు ముఖ్తాదా అల్ సాదర్ నాయకత్వానగల ప్రజాదరణ పొందిన సద్రిస్ట్ మూమెంట్ ఈ ఎన్నికల ప్రక్రియను బహిష్కరించింది. ఇరాకీ సుప్రీం జుడీషియల్ కౌన్సిల్ అధిపతి వెబ్‌సైటులో ఒక ప్రకటన చేస్తూ, వాస్తవానికి దేశంలో నవంబరు 24న ఎన్నికలు జరగాల్సి ఉందని, కానీ మంగళవారం జరుగుతున్నాయని వివరించింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ఫలితాలు కూడా న్యాయస్థానంలో పరీక్షకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2021 పార్లమెంటు ఎన్నికల్లో అల్ సాదర్ ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రత్యర్థి షియా గ్రూపులతో జరిపిన సంప్రదింపుల్లో ప్రతిష్టంభన వల్ల ఆయన విఫలమయ్యారు. సద్దాం హుస్సేన్ పాలనతో అమెరికా దాడిని ఎదుర్కోవడమేకాకుండా ఇరాన్‌తో పదేళ్ళ యుద్ధాన్ని చవిచూసి అతలాకుతలమైన ఇరాక్‌దేశం ఇప్పుడిప్పుడే కుదుటపడి సాధారణస్థితికి చేరుకుంటున్న దశలో పార్లమెంటుకు కీలక ఓటింగ్ ప్రక్రియ జరిగింది. గడచిన రెండు సంవత్సరాలుగా పశ్చిమ ఆసియాలో అనేక పరిణామాలు సంభవించాయి. గాజా యుద్ధం, లెబనాన్‌లో యుద్ధ దాడులు, దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులుతోపాటు గడచిన జూన్ నెలలో ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం, సిరియా అధ్యక్షుడు బషర్ అస్సాద్ గత ఏడాది డిసెంబరులో పదవీచ్యుతుడై దేశం నుండి పారిపోవడం వంటి కీలకమైన పరిణామాల సంభవించిన తరుణంలో ఇరాక్ పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నాయి. పైగా అటు ఇరాన్, ఇటు అమెరికా దేశాలు ఈ ఎన్నికలను చాలా నిశితంగా గమనిస్తున్నాయి. మొత్తం 3.20 కోట్ల మంది అర్హులైన ఓటర్లలో కేవలం 2.14 కోట్లమంది మాత్రమే తమ సమాచారాన్ని ఎన్నికల సంఘం వద్ద పునరుద్ధరించుకుని పోలింగ్‌లో పాల్గొనేందుకు సన్నద్ధమయ్యారు. 2021లో పార్లమెంటుకు జరిగిన ఎన్నికల కంటే ఈసారి తక్కువమంది ఓటర్లు పేర్లు పునరుద్ధరించుకున్నారు. ఐదేళ్ళక్రితం ఎన్నికల్లో 2.40 కోట్లమంది పోలింగ్‌లో పాల్గొన్నారు.

## నైజీరియాలో 200 మంది మృతి



**అబుజా:** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియా ఈశాన్యప్రాంతంలో ప్రత్యర్థి జీహాదీ గ్రూపులమధ్య జరిగిన ఘర్షణల్లో 200 మంది మరణించారు. నవంబరు తొమ్మిదో తేదీన ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఛాడ్ తీరంలో ఉన్న దోగోన్ చికూలో బోకో హారమ్, దాని ప్రత్యర్థి ఉగ్రవాద గ్రూపు ఇస్వాప్ ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు మధ్య ఈ ఘర్షణలు చెలరేగాయి. ఈ పోరాటంలో 200 మంది ఇస్వాప్ ఉగ్రవాదులు హతులైనట్లు నైజీరియా సైన్యానికి సహాయం చేసే జీహాదీ వ్యతిరేక సంస్థ సభ్యుడు బాబాకురా కోలా చెప్పారు. ఈ పరస్పర హింసాకాండలో నలుగురు బోకోహారం ఉగ్రవాదులు మరణించారు. ఇస్లామిక్ స్టేట్‌గ్రూపునకు ఎంతో విధేయంగా ఉండే ఇస్వాప్ 2016లో బోకోహారమ్ గ్రూపు విడిపోయింది. ఆ తర్వాత నుండీ ఇస్వాప్,బోకోహారమ్ జీహదీ గ్రూపులమధ్యా తీవ్ర హింసాత్మక ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ తాజా ఘర్షణ వాటిల్లో అత్యంత తీవ్రమైనది. నైజీరియా,నిగర్,ఛాడ్, కామెరూన్‌లలో విస్తరించి ఉన్న ఒక పెద్ద మంచినీటి సరస్సును ఆశ్రయించుకుని ఈ ఉగ్రవాద గ్రూపులు పనిచేస్తున్నాయి.

# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి
**కారు బాంబు పేలుడులో 12 మంది మృతి**

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ రాజధాని నగరం ఇస్లామాబాద్‌లో మంగళవారం మధ్యాహ్నం 12.39 గంటలకు ఆత్మాహుతి కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో 12 మంది మరణించారు. మరో 36 మంది గాయపడ్డారు. వీరిలో 18 మందికి చికిత్సలు చేసి ఇళ్ళకు పంపేశారు. 12 మృతదేహాలను సహాయ బృందాలు శిథిలాల నుండి వెలికితీసి పాకిస్తాన్ వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ ఆసుపత్రికి తరలించినట్లు హోం మంత్రి మోహసిన్ నక్వీ మీడియాకు చెప్పారు. ఢిల్లీలో భారీ కారు బాంబు విస్ఫోటనం జరిగిన 24 గంటల వ్యవధిలో ఈ సంఘటన జరిగింది. ఈ దాడికి తామే కారణమని ఏ ఉగ్రవాద సంస్థా ప్రకటించుకోనప్పటికీ సాధారణంగా టిటిపి (తెహ్రీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్) సంస్థ ఇలాంటి చర్యలకు పాల్పడుతుంది. ఇస్లామాబాద్ డిస్ట్రిక్ట్–సెషన్స్ కోర్టు బిల్డింగ్ జి–11 ఏరియాలో ఈ పేలుడు ఘటన జరిగిందని పోలీసులు అధికారులు పేర్కొన్నారు. రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్, దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీలు దీనిని ఆత్మాహుతి దాడిగా పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారికి సమీప ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆసుపత్రివర్గాలతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి మెరుగైన చికిత్సలు అందించాలని కోరారు. ఆరు కిలోమీటర్ల దూరానికి ఈ బాంబు పేలుడు శబ్దం వినిపించిందని పాకిస్తాన్ అధికార పత్రిక పేర్కొంది. భారత్ రాజధాని ఢిల్లీ ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం అత్యంత శక్తిమంతమైన కారుబాంబు పేలుడు సంభవించి తొమ్మిదిమంది మరణించారు. ఈ పేలుడు ఘటనలో కూడా పేలుడు శబ్దం కొన్ని కి.మీ దూరం వరకు వినిపించిందని మీడియా, ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఇప్పుడు ఇస్లామాబాద్ కోర్టు వెలుపల జరిగిన పేలుడు ఘటనలో కూడా పాకిస్తాన్ పత్రిక అధికారకంగా కథనం వినిపించింది. దీనికి సంబంధించి కృత్రిమ మేధకు సంబంధించిన చిత్రాలు విడుదలయ్యాయి. అదేవిధంగా అధికార పత్రిక ఆన్‌లైన్‌లో ప్రచురించిన కథనాల్లోని వీడియోలో ఎక్కడా మృతదేహాలు కనిపించలేదు. ఈ పేలుడు ఘటనను ఒక హెచ్చరికగా ఆసిఫ్ అలీ జర్దారీ పేర్కొన్నారు. ఐతే ఘటన జరిగిన వెంటనే పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దర్యాప్తు ప్రారంభించినట్లు పత్రిక పేర్కొంది. వీడియోలో చూసినప్పుడు దగ్ధమవుతున్న కార్ల నుండి మంటలు భారీ ఎత్తున పైకి ఎగసి పడటం కనిపించిందని పత్రిక పేర్కొంది. "నా కారు పార్కుచేసి భవనం లోపలికి ప్రవేశించగానే భారీ పేలుడు శబ్దం వినిపించింది, వెనక్కు చూసే సరికి ప్రజలు నలువైపులా పరుగులు తీస్తున్నారు, ఆ ప్రాంతంలో వాహనాలన్నీ ధ్వంసమయ్యాయి" అని ప్రత్యక్షసాక్షి న్యాయవాది రుస్తుమ్ మాలిక్ చెప్పినట్లు డాన్ టీవీ మీడియా పేర్కొంది. "మా దేశం యుద్ధంలో ఉంది, ఉగ్రవాదంతో పోరాడుతోంది, అఫ్ఘానిస్థాన్–పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదంతో మా సైన్యం పోరాటం చేస్తోంది, ఆలోచిస్తే ఎవరికైనా ఇది తెలుస్తుంది, బలూచిస్థాన్ వంటి సుదూర ప్రాంతాలలో కూడా ఈ పోరాటం జరుగుతోంది, ఈ పేలుడు ఘటన ఒక మేలుకొలుపు హెచ్చరిక" అని రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. అదేవిధంగా సింధ్ రాష్ట్ర హోమ్‌మంత్రి జియావుల్ హస్సన్ కూడా ఈ ఆత్మాహుతి బాంబుదాడిని తీవ్రంగా ఖండించారు. "ఆత్మాహుతి బాంబుదాడులకు, ఉగ్రవాదులకు మతం లేదు, వారు మానవత్వానికి శత్రువులు" అని జియావుల్ హస్సన్ అన్నారు. సింధ్ రాష్ట్రంలో హై ఎలర్ట్ ప్రకటించినట్లు చెప్పారు.



### ఉగ్రవాదాన్ని ఆపకపోతే అఫ్ఘానిస్థాన్‌పై చర్యలు తప్పవు

కారు బాంబు దాడికి పాల్పడినవారిని పట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని పాకిస్థాన్ హోమ్ మంత్రి నక్వి చెప్పారు. మృతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సాక్ష్యాధారాలను సేకరిస్తున్నామన్నారు. ఈ సమయంలో ఏదీ చెప్పడానికి తాను సిద్ధంగా లేనని అన్నారు. టిటిపి ఉగ్రవాదులను భారతదేశమే పెంచి పోషిస్తోందని తరచు పాకిస్థాన్ ప్రభుత్వం ఇటీవల ఆరోపణలు చేస్తోంది. ఐతే 'ఈరోజు జరిగిన ఈ ఘటనను మేం అనేక విషయాలతో ముడిపెట్టి చూస్తున్నాం, రాబోయే కొద్ది గంటల్లో చాలా స్పష్టత వస్తుంది, ఈ బాంబు పేలుడులో ఎన్నో సందేశాలు ఉన్నాయి, భారత్ తరచు మా దేశంపై ఆరోపణలు చేసినట్టుగా ఈ క్షణంలో ఏదీ చెప్పడానికి నేను సిద్ధంగా లేను, మేం పూర్తి సాక్ష్యాధారాలతో, వివరాలతో మీడియా ముందుకు వస్తాం" అని మంత్రి నక్వి చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు అంతం పలకాలి, వారు తమ భూభాగం నుండి ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడం ఆపేయాలి, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం, వారిపై ప్రతిచర్యలు తీసుకోవడానికి మాకు పూర్తి శక్తిసామర్థ్యాలు ఉన్నాయి" అని నక్వి అన్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం యుద్ధస్థితిలో ఉందని అన్నారు. పాకిస్థాన్ సైన్యం ప్రతిరోజూ దేశ ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉగ్రవాదులతో పోరాటం చేస్తూ ప్రాణ త్యాగాలు చేస్తోందని అన్నారు. దేశంలో మూడు అంతర్జాతీయ కార్యక్రమాలు జరుగుతున్న తరుణంలో ఈ పేలుగు సంభవించిందన్నారు. ఒకవైపు అంతర్‌పార్లమెంటరీ స్పీకర్ల సదస్సు, మరోవైపు క్రికెట్ మ్యాచ్, ఇంకోవైపు సిక్కు మార్గల్లా సంభాషణలు జరుగుతున్న సమయంలో ఈ పేలుడు జరిగిందన్నారు.

## ఐఎస్ గ్రూపుపై పోరాటానికి అమెరికా కూటమిలో చేరనున్న సిరియా



**వాషింగ్టన్:** ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అమెరికా నాయకత్వాన ఏర్పడిన అంతర్జాతీయ కూటమిలో సిరియా చేరనున్నది. దీనికి బదులుగా సిరియాపై అమెరికా విధించిన ఆంక్షలను 180 రోజులపాటు ఎత్తివేస్తుంది. పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తుంది. మిత్రదేశంగా అక్కున చేర్చుకుని అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తుంది. పశ్చిమ ఆసియాలో అమెరికా విదేశాంగ విధానంలో ఒక కొత్త మార్పుకు ఇదొక సంకేతం. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరాతో సమావేశానంతరం ట్రంప్ పాలనా యంత్రాంగంలో ఉన్నతాధికారి ఒకరు మంగళవారం ఈ విషయం ధృవీకరించారు. విదేశీ ఉగ్రవాదులకు కేంద్రంగా మారిన పశ్చిమ ఆసియా నుండి ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టేందుకు అమెరికా నాయకత్వాన ఒక అంతర్జాతీయ పోరాట కూటమి ఏర్పడింది. ఈ కూటమిలో 89 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఇప్పుడు సిరియా 90వ దేశంగా సభ్యత్వం తీసుకోవడానికి సిద్ధమైంది. అహ్మద్ అల్ షరా చరిత్రాత్మకమైన అమెరికా పర్యటనకు ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మాండమైన ప్రచారం లభించింది. సిరియా చరిత్రలో దాదాపు 80 సంవత్సరాల తర్వాత ఒక దేశాధ్యక్షుడు నేరుగా అమెరికాలో అధికారిక పర్యటన చేసి అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం జరపడంతో సిరియాలో ప్రజలు పండుగ చేసుకున్నారు. తమ మధ్య సమావేశం చాలా బాగా జరిగిందని ట్రంప్ అన్నారు. సిరియాపై ఉన్న ఆంక్షలను ఆయన ఎత్తివేశారు. ఈ సందర్భంగా అల్ షరా చాలా నిరాడంబరంగా పత్రికల కళ్ళకు కనబడకుండా వేరే మార్గంలో వైట్‌హౌస్‌లోకి ప్రవేశించి ట్రంప్‌తో కొద్ది గంటలు సమావేశం జరిపారు. అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, సిరియా ఒక విజయవంతమైన దేశంగా వృద్ధి చెందాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ నాయకుడు అల్ షరా దీనిని సాధించగలరన్న విశ్వాసం తనకు ఉందన్నారు. అల్ షరా, ట్రంప్ ఇద్దరూ మొదటిసారి ఆరునెలల క్రితం సౌదీఅరేబియాలో కలుసుకున్నారు. ఆ తర్వాత ఇన్నాళ్ళకు అల్‌షరా అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో సమావేశం తర్వాత అల్ షరా ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఒక నవశకం ప్రారంభించడంలో భాగంగా తాను అమెరికా పర్యటన చేస్తున్నట్లు చెప్పారు. అమెరికాకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. అన్ని రకాలుగా తమకు కావాల్సిన మద్దతు ఇస్తామని ట్రంప్ చెప్పారన్నారు. ఇటీవలికాలం వరకూ సిరియాకు వ్యతిరేకంగా అమెరికా ఆంక్షలు అమలు చేసింది. ఒకప్పుడు ఉగ్రవాదిగా ముద్ర వేసుకున్న అల్ షరా ఇటీవలికాలంలో ఆ ముద్రను చెరిపేసుకుని ట్రంప్‌కు చేరువయ్యారు. దీంతో పశ్చిమ ఆసియాలో అమెరికా కొత్త మిత్రదేశాన్ని సంపాదించుకున్నట్లయింది.

## భారీ ఓటింగ్
(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలలో భారీ ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గాలలో అనేకచోట్ల పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు బారులు తీరారు. ముస్లింలు అత్యధికంగా ఉండే ఏకైక కిషన్‌గంజ్ జిల్లాలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం ఐదు గంటలకు ముగిసే వరకూ భారీగా 76.26 శాతం మేరకు నమోదైంది. ఇక నవడా నియోజకవర్గంలో అతి తక్కువగా 57.31 శాతం పోలింగ్ జరిగింది. కిషన్‌గంజ్ పొరుగున కతిహార్‌లో 75.23 శాతం, పూర్ణియాలో 73.79 శాతం, సుపౌల్‌లో 70.69 శాతం, అరారియాలో 67.79 శాతం పోలింగ్ నమోదైంది. తుది విడత ఎన్నికల్లో చాలా జిల్లాలు నేపాల్ సరిహద్దుల్లో ఉన్నాయి. వీటిల్లో ఎక్కువ కోసి–సీమాంచల్ ఈశాన్య ప్రాంతంలో ఉన్నాయి. మైనారిటీ వర్గాలు అత్యధికంగా ఈ ప్రాంతాలలో ఉన్నారు. అదేవిధంగా దక్షిణ బిహార్ జిల్లాలలో అంటే జముయి లో అత్యధికంగా 67.81శాతం, గయలో 67.50 శాతం, కైమూర్‌లో 67.22 పోలింగ్ జరిగింది. రాష్ట్రంలో అధికారం మాదంటే మాదే అని ఎన్‌డిఎ–ఇండియా కూటమి శిబిరాలు ప్రకటించుకుంటున్న తరుణంలో, ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగిన నితీశ్ కుమార్‌పాలపై ఓటర్లు ఈ పోలింగ్ ద్వారా నిజమైన తీర్పు ఇచ్చినట్లు కనిపిస్తోందని పిటిఐ వార్తా సంస్థ వ్యాఖ్యానించింది. రాష్ట్ర శాసనమండలి సభ్యుడుగా ఉన్న నితీశ్ కుమార్ ఈసారి కూడా ఎన్నికల్లో పోటీ చేయలేదు. నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకత ఎదుర్కోకుండా కాపాడేందుకు సుపరిపాలన పేరుతో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి అధికార జెడి(యు)కు మద్దతుగా నిలబడింది. ఐతే 15 ఏళ్ళు బిహార్‌ను పాలించిన నితీశ్ కుమార్‌పై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఉందని, ఎన్‌డిఎ కూటమి ఈసారి ఆయనను ముఖ్యమంత్రి పదవిలో ఉండనివ్వదని, అధికార కూటమి గెలిచే అవకాశం లేదని 'ఇండియా' కూటమి ధృఢ నిశ్చయంతో ఉంది. బిహార్‌లో ఏకపక్షంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టి ఎన్‌డిఎ కూటమి అప్రదిష్టపాలైంది. 'ఇండియా' కూటమి ప్రధానంగా ముస్లింలు అత్యధికంగా ఉండే జిల్లాలపై నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించి ప్రజా సమీకరణ కార్యక్రమాలు నిర్వహించింది. ఓటర్లను ఆకట్టుకుంది. ఈ తుది విడత పోలింగ్ జరిగిన నియోజకవర్గాలే కాంగ్రెస్‌పార్టీకి ఇండియా కూటమికి అత్యంత కీలకమైనవి, ప్రతిష్టాత్మకమైనవి. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత ఎంఎల్‌ఎ రాజేశ్ కుమార్ రామ్ కుటుంబ నియోజకవర్గం నుండి మళ్ళీ పోటీ చేశారు. మరో సిట్టింగ్ ఎంఎల్‌ఎ షకీ అహ్మద్ ఖాన్ కద్వా నుండి పోటీ చేశారు.

మొదటి విడత నవంబరు ఆరో తేదీన 121 నియోజకవర్గాలలో 3.75 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, 65.09 శాతం పోలింగ్ నమోదైంది. ఇక జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ ఈ ఎన్నికల్లో కీలకపాత్ర వహించనున్నారు. ఆయన పాత్రవల్లే రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరిగిందనే అభిప్రాయం నెలకుని ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఉదయమే ఒక ప్రకటన చేస్తూ ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. "ఈరోజు తుది విడత ఎన్నికలుజరుగుతున్నాయి, ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ ప్రక్రియలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నా, సరికొత్త ఓటింగ్ రికార్డును రాష్ట్రంలో నెలకొల్పాలి, ప్రత్యేకించి యువ ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకోవాలి, మొదటిసారి ఓటు వేసేవారు తప్పనిసరిగా ఓటు హక్కు ఉపయోగించుకోవాలి,ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలి" అని ప్రధానమంత్రి ఎక్స్ వేదికగా పిలుపు ఇచ్చారు. "ఓటింగ్ కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, అదొక బాధ్యత" అని నితీశ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన బిహార్‌కు తొమ్మిదిసార్లు సిఎంగా ప్రమాణస్వీకారం చేశారు.

**ఓటేసిన ప్రముఖులు**

జెడి(యు) తాత్కాలిక అధ్యక్షుడు సంజయ్ ఝా, కేంద్రమంత్రి జితిన్ రామ్ మాంఝి దగ్గర నుండి జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ వరకూ అనేకమంది ప్రముఖులు, నాయకులు తమ తమ నియోజకవర్గాలలో మంగళవారం ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ రామ్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి నితీశ్ మిశ్రా, పూర్ణియా ఎంపి పప్పూ యాదవ్, బిజెపి జముయి అభ్యర్థి శ్రేయాషి సింగ్, స్వతంత్ర అభ్యర్థి, ప్రముఖ భోజ్‌పురి గాయకుడు పవన్ సింగ్ సతీమణి జ్యోతి సింగ్ తదితరులు ఓట్లు వేశారు. బిజెపి నాయకుడు షానవాజ్ హుస్సేన్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అజీత్ శర్మ ఈ రెండో విడత పోలింగ్‌లోనే ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. ఇండియా కూటమికి అనుకూలంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఓట్లు వేశారని రాజేశ్ రామ్ అన్నారు. మరోవైపు జెడి(యు) నాయకుడు ఝా మాట్లాడుతూ, ఎన్‌డిఎ కూటమి ఈసారి రికార్డుస్థాయి మెజారిటీ సాధిస్తుందని అన్నారు.

## పుల్వామా వైద్యుడు
(మొదటి పేజీ తరువాయి)

కారులోని సిసిటివి ఫుటేజ్‌లో 'ముసుగు ధరించిన వ్యక్తి' కారు నడుపుతున్నట్లు కనిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 'ముసుగు ధరించిన వ్యక్తి గురించి మరింత తెలుసుకోవడానికి ఎర్రకోట, పరిసర మార్గాల నుండి సిపిటివి ఫుటేజ్‌లను పరిశీలించడానికి పలు బృందాలను మోహరించినట్లు' ఒక పోలీసు అధికారి తెలిపారు.'పేలుడు జరగడానికి ముందు వాహనం మూడు గంటల పాటు సమీపంలోని పార్కింగ్ స్థలంలో నిలిపి ఉంచినట్లు మాకు తెలిసింది. వివిధ పార్కింగ్ స్థలాల ఫుటేజ్‌లను కూడా పర్యవేక్షిస్తున్నారు' అని ఆ వర్గాలు తెలిపాయి.ఉమర్ ఒక్కడే కారులో ఉన్నట్లు వారు తెలిపారు. పేలుడు , ఉగ్రవాద కుట్రపై దర్యాప్తు కొనసాగుతోందని, దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందిన తారిక్ అనే వ్యక్తి ఉమర్‌కు ఐ–20 కారును ఇచ్చాడని, ఆయనను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు

**ఇద్దరు మృతుల గుర్తింపు :** మృతులను ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాకు చెందిన అశోక్ కుమార్ (34), ఢిల్లీకి చెందిన అమర్ కటారియా (35) గా గుర్తించారు. మిగిలిన మృతదేహాలను ఇంకా గుర్తించలేదు. వారి వయస్సు 28 నుండి 58 సంవత్సరాల మధ్య ఉంటుంది. కారు ముక్కలైన అవశేషాల నుండి ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన 20 మందిలో 12 మంది ఢిల్లీ వాసులు, ఎనిమిది మంది ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు చెందినవారు.

**ఉపా కింద కేసు నమోదు :** ఢిల్లీ పోలీసులు, ఎన్‌ఐఎ, నిఘా సంస్థల బృందాలు ఢిల్లీ, కాశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. కాశ్మీర్‌లో జరిగిన దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నలుగురిలో, ఢిల్లీ పేలుడులో, అంతర్రాష్ట్ర ఉగ్రవాద కుట్రలో వారి పాత్రకు సంబంధించి ఇద్దరిని ఉమ్మడి విచారణ కోసం తరలించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా), పేలుడు పదార్థాల చట్టం కింద, ఉగ్రవాద దాడిలో శిక్ష, కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఢిల్లీలోని అనేక ప్రదేశాలలో కూడా దాడులు నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ హై అలర్ట్‌లో ఉంది. విమానాశ్రయం, రైల్వే స్టేషన్‌లు, బస్ టెర్మినళ్ల వద్ద గట్టి పోలీసులు నిఘా పెట్టారు.

పేలుడు తర్వాత, దేశ రాజధాని అంతటా భద్రతను ముమ్మరం చేశారు. అన్ని సరిహద్దు పాయింట్ల వద్ద వాహన తనిఖీలను కూడా ముమ్మరం చేశారు. ఢిల్లీలోకి ప్రవేశించే ప్రైవేట్ లేదా వాణిజ్య వాహనాలు సహా అన్ని వాహనాలను భద్రతా చర్యలలో భాగంగా క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.అనుమానితులను గుర్తించడానికి దర్యాగంజ్ , పహాడ్‌గంజ్ ప్రాంతాలలోని హోటళ్ళు, అతిథి గృహాలలో రాత్రి పూట సోదాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఎర్రకోట మెట్రో స్టేషన్ మూసివేసి, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు, మళ్లింపుల గురించి ఒక సూచనను జారీ చేశారు. ప్రయాణికులు ఉదయం 6 గంటల నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ మార్గాల వైపు వెళ్ళొద్దని, ఇబ్బంది లేని ప్రయాణం కోసం ప్రత్యామ్నాయ రహదారులను ఉపయోగించాలని సూచించారు.

కాగా, పేలుడుకు ఫరీదాబాద్‌లో ఉగ్ర కుట్రలో భాగంగా ముగ్గురు వైద్యులు సహా అరెస్టయిన 8 మందితో ఉమర్‌కు సంబంధం ఉన్నట్లు చెబుతున్నారు. ఉమర్ చిన్నప్పటి నుంచీ అంతర్ముఖుడని, చదువులు, పనిపై దృష్టి పెట్టాడని ఆయన వదిన ముజామిల్ చెప్పారు. 'ఆయన ఫరీదాబాద్‌లోని ఒక కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఫోన్ చేసి తాను పరీక్షలతో బిజీగా ఉన్నానని, మూడు రోజుల తర్వాత ఇంటికి తిరిగి వస్తానని చెప్పాడు. చిన్నప్పటి నుంచీ చాలా ప్రశాంతమైన వ్యక్తి' అని ఆమె చెప్పారు. రెండు నెలల క్రితం చివరిసారిగా కాశ్మీర్‌కు వచ్చాడని, ఉమర్ ఒంటరివాడని, ఎక్కువ మంది స్నేహితులు లేరని ఆమె తెలిపినట్లు 'పిటిఐ' కథనం పేర్కొంది. ఎర్రకోట వద్ద సోమవారం ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర నెమ్మదిగా కదులుతున్న కారును తునాతునకలు చేసిన పేలుడులో అమ్మోనియం నైట్రేట్, ఇంధన నూనె డిటోనేటర్లను ఉపయోగించి ఉండవచ్చని ప్రాథమిక పరిశోధనలు సూచిస్తున్నాయి.

## జూబ్లీహిల్స్@48 శాతం
(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. మొత్తం 407 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 4,01,365 మంది ఓటర్లలో 48.47 శాతం ఓటు హక్కు వినియోగించారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 48.82 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలించారు. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. వీరి భవితవ్యం ఈనెల 14 ఓట్ల లెక్కింపుతో తేలనుంది. చివరి గంటల్లో పోలింగ్ శాతం పెరగవచ్చని అధికారులు అంచనా వేశారు. ఉదయం నెమ్మదిగా ప్రారంభమైన ఓటింగ్ మధ్యాహ్నానికల్లా కాస్త వేగం పుంజుకుంది. మధ్యాహ్నం 1 గంటకు 31.94 శాతం పోలింగ్ నమోదవగా, 3 గంటలకు 40.2 శాతానికి పెరిగింది. అనంతరం సాయంత్రం నాటికి 47.17 శాతానికి చేరుకుంది. బోరబండ 328 పోలింగ్ స్టేషన్‌లో ఈవిఎం మొరాయించడంతో కొత్త మెషిన్ ఏర్పాటు చేశారు. షేక్‌పేట్‌తో సహా మొత్తం 6 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించినా, తమ టెక్నికల్ టీమ్ వాటిని యుద్ధప్రాతిపదికన సరిచేసి, పోలింగ్‌ను తిరిగి ప్రారంభించిందని తెలిపారు. అలాగే రహమాత్ నగర్ పోలింగ్ బూత్ 165, 166ల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరిపారు. అయితే ఈ ఎన్నికల్లో మొదటిసారిగా ఈవిఎంలలో అభ్యర్థుల కలర్ ఫోటోలు, డ్రోన్‌లతో సెక్యూరిటీ మానిటరింగ్, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద మొబైల్ డిపాజిట్ సెంటర్లు, ఓటర్ అసిస్టెన్స్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అలాగే పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడిగించడం విశేషం. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బోరబండలో బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటు హక్కు వినియోగించారు. షేక్‌పేట్ డివిజన్‌లో ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కుటుంబ సమేతంగా ఓటేశారు. బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి శ్రీనగర్ కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ కుటుంబ సమేతంగా మధుర్ నగర్‌లో ఓటు వేశారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి కుటుంబంతో కలిసి యూసుఫ్‌గూడలో ఓటు వేశారు.

**నూతనోత్సాహంతో యువత ఆసక్తి**

నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతి, యువకులు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్సహకంగా నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ స్టేషన్‌లకు వచ్చి, ఓపికగా క్యూలైన్‌లలో నిలబడి ఓటు వేసేందుకు ఆసక్తి చూపించారు. యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావడంతో ఎన్నికల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. తాము ముందస్తుగా కళాశాలు, కాలనీల్లో నిర్వహించిన ప్రచారం ఫలితమిచ్చిందని తెలిపారు. ప్రధానంగా యువత అభివృద్ధికే జై కొట్టినట్లు వాతావరణం గోచరించింది.

**యూసుఫ్‌గూడలో హైటెన్షన్ : బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అరెస్ట్**

జూబ్లీహిల్స్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ ప్రశాంతంగా ముగిసినప్పటికీ చివరిలో బిఆర్‌ఎస్ నేతలు ఆందోళనకు దిగటం ఉద్రిక్తతకు దారితీసింది. యూసుఫ్‌గూడలో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఆమెకు తోడు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కూడా ధర్నాకు దిగటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు ఎందుకు ధర్నా చేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెండు పార్టీలకు మధ్య తోపులాటలు జరిగాయి. పరిస్థితి చేజారుతుండటంతో పోలీసులు కార్యర్తలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా సహకరించాలని చెప్పినా వినకపోవడంతో మాగంటి సునీతతో పాటు పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. షేక్‌పేట్ డివిజన్‌లోని అపెక్స్ హైస్కూల్ బూత్ నెంబర్లు 4 నుండి 8 వరకు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. అలాగే యూసుఫ్‌గూడ సవేర ఫంక్షన్ హాల్ వద్ద కూడా బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది.

**ఎన్నికల సంఘం చర్యలు**

స్థానికేతర నేతలు నియోజకవర్గంలో తిరుగుతున్నారంటూ ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతలు పరస్పరం ఒకరిఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఎన్నికల సంఘం ఇరు పక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ శంకర్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే బిఆర్‌ఎస్ కార్పొరేటర్‌లపై సైతం పోలీసులు కేసులు నమోదు చేశారు. యూసుఫ్‌గూడలో బిఆర్‌ఎస్ సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికేతరులైన సామల హేమపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.

## నిందితులను వదిలేది లేదు
(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం ఢిల్లీలో జరిగిన భయానక ఘటన ప్రతి భారతీయుడిని విషాదంలో ముంచేసింది. బాధిత కుటుంబాల దుఃఖాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకుంటున్నాను. దేశం మొత్తం ఈ కష్ట సమయంలో వారి పక్కనే ఉంది. సోమవారం రాత్రంతా దర్యాప్తు సంస్థలతో సంప్రదింపులో ఉన్నా. పలు దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడిస్తారు. కుట్రదారులను వదిలిపెట్టం. అమాయకుల ప్రాణాలు తీసిన వారందరికీ తగిన శిక్ష తప్పదు' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

సమగ్ర విచారణ జరగుతోంది : రాజ్‌నాథ్ సింగ్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఈ పేలుడు ఘటనపై స్పందించారు. దేశంలోని ప్రముఖ విచారణ సంస్థలు త్వరితంగా, సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నాయని తెలిపారు. 'ఢిల్లీలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నా. ఈ తీవ్రమైన విషాద సమయంలో దేవుడు వారికి ధైర్యం ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. దేశంలోని ప్రముఖ విచారణ సంస్థలు ఈ ఘటనపై త్వరితంగా, సమగ్రంగా విచారణ చేపట్టాయి. దాని ఫలితాలను త్వరలో వెల్లడిస్తాం. ఈ ఘోర ఘటనకు బాధ్యులైన వారిని శిక్షించడంలో ఎలాంటి సడలింపు ఉండదు. దేశ ప్రజలకు నేను భరోసా ఇస్తున్నా' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## ఎన్ఐఎ చేతికి
(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టర్ తపన్ దేకా, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా, ఎన్ఐఎ డిజి సదానంద్ వసంత్ దాటే హాజరయ్యారు. జమ్మూ కశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పేలుడు అనంతరం పరిస్థితులపై అధికారులు సమగ్ర వివరాలను అందించారు. దిఅత్యున్నత దర్యాప్తు సంస్థలు పేలుడు ఘటనను దర్యాప్తు చేస్తున్నాయని,అవి సంఘటనను లోతుగా పరిశీలిస్తాయని హోం మంత్రి చెప్పారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నెమ్మదిగా కదులుతున్న కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది మరణించారు. అనేక వాహనాలు దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## తాగునీటి సమస్య రాకుండా చర్యలు

**అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో రానున్న రోజులలో త్రాగు నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ సచివాలయంలో మంగళవారం హైదరాబాద్ వాటర్ వరక్స్ విభాగం (హెచ్ఎండబ్ల్యూస్ఎస్‌బి) పని తీరుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంజీర, సింగూరు, గోదావరి ఫేస్2, ఫేస్3 పనులపై సమీక్ష చేశారు. భూసేకరణ, పైప్ లైన్ల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రోడ్లు, భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిర్దేశించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హైదరాబాద్ వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హెచ్ఎండిఎ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పిసిసిఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, మిషన్ భగీరథ ఇఎన్‌సి కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐది కీలక పాత్ర

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** భారత కమ్యూనిస్టు పార్టీ వచ్చే డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో దేశవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించుకుంటుందని, ఈ నేపధ్యంలో రాష్ట్రంలో శతజయంతి ఉత్సవాలను ఈ నెల 15 నుంచి 21 వరకు ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు జరిగే రాష్ట్ర ప్రచార జాతాను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటీష్ పాలకుల నుంచి విముక్తి చేయడానికి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, సమసమాజ నిర్మాణం కోసం, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. ప్రజల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఎంతో మంది కమ్యూనిస్టు యోధులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత దేశ ప్రజల సంక్షేమం కోసం, భూ సంస్కరణల కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన పార్టీ సిపిఐ అన్నారు. వందేళ్ల ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం సిపిఐ నిర్వహించిన పోరాటాలను, విజయాలను, త్యాగాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 15 నుంచి 21 వరకు జోడే ఘాట్ నుంచి భద్రాచలం వరకు రాష్ట్ర ప్రచార జాతా నిర్వహిస్తున్నామని, ఆ జాతాను విజయవంతం చేయడం కోసం ఆయా జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

## సోషలిజం వ్యవస్థ స్థాపన దిశగా యువత ముందుకు..

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆర్థిక న్యాయం ఆధారిత సోషలిస్టు వ్యవస్థలోనే ప్రజల భవిష్యత్తు ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. సమాజంలో అసమానతలు, కుల వివక్ష, పేద, ధనిక మధ్య ఉన్న అంతరాలను తొలగించేందుకు ఏకైక మార్గం సోషలిజమేనని స్పష్టం చేశారు. యూరప్‌లో కమ్యూనిస్టుల గాలి వీస్తుందని, నేపాల్‌లో అన్ని వామపక్ష పార్టీలు ఐక్యతగా ముందుకు రావడం 'రానున్నది సోషలిస్ట్ వ్యవస్థ' అనేందుకు ఇదే నిదర్శనమన్నారు. జనసేవా దళ్ కన్వీనర్ పంజాల రమేష్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో మంగళవారం 'జనసేవా దళ్' రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ సోషలిజం వ్యవస్థను స్థాపించే దిశగా యువత ముందుకు రావాలని, శ్రీశ్రీ చెప్పినట్టు కొంతమంది యువత నవయుగ దూతలు అనే మాటలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. 'సిపిఐ వందేళ్ల' ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు 'నునుగు మీసాల యవ్వనంలో దేశ స్వతంత్ర్యం కోసం ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్ స్ఫూర్తితో' ఏర్పడిన యువజన, విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యంలో పదిహేను వేల మంది యువ కమ్యూనిస్టులతో భారీ జనసేవా దళ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. భారతదేశం గత కొన్నేళ్లుగా కార్పొరేట్ శక్తుల ఆధీనంలోకి వెళ్తోందన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే, ఉత్పత్తి సాధనాలు ప్రజల చేతుల్లోకి రావాలన్నదే నిజమైన సోషలిజం అని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను అమలు చేయడంతో పాటు ఆర్థిక సదుపాయాలను సమానంగా ఉండడం అవసరమని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఎం.బాలనరసింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, కార్యదర్శి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల లబ్ధిదారులకు రూ.202.93 కోట్లు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఈ వారానికి సంబంధించిన రూ.202. 93 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇండ్ల నిర్మాణ పనుల దశల ఆధారంగా బిల్లులను ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే మంగళవారం (నవంబర్ 11వ తేదీ నాటికి) పురోగతి సాధించిన మేరకు 18,247 మంది లబ్ధిదారులకు బిల్లులను విడుదల చేసినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతం మంగళవారం వెల్లడించారు. ఈ వారం లబ్ధిదారులకు చేసిన చెల్లింపుల్లో బేస్‌మెంట్ లెవల్ నిర్మాణాలు 4,615, రూఫ్ లెవల్‌లో (గోడలు పూర్తయిన) 8, 517, స్లాబ్ వేసిన 5,115 ఇండ్లు ఉన్నాయని ఆయన వివరించారు.

### 'ఇందిరమ్మ ఇండ్లకు' రూ.2900 కోట్ల చెల్లింపు..

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇప్పటివరకు మొత్తం రూ. 2900.35 కోట్లను చెల్లించారు. ఇందులో బేస్‌మెంట్ లెవల్ (బిఎల్) దాటిన ఇండ్లకు రూ.1610.79 కోట్లు, రూఫ్ లెవల్ (ఆర్ఎల్) రూ.716.91 కోట్లు, రూఫ్ క్యాస్టెడ్ (స్లాబ్ పూర్తయిన ఆర్‌సి) ఇండ్లకు రూ.572.65 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 2,33,069 ఇండ్ల పనులు ప్రారంభించగా, ఇందులో బేస్‌మెంట్ (బిఎల్) స్థాయిలో 90,613, గోడల నిర్మాణం పూర్తయినవి (ఆర్ ఎల్) 41,212 ఇండ్లు, స్లాబ్ పూర్తి (ఆర్‌సి) 37,400 ఇండ్లు ఉన్నాయని ఎం.డి వి.పి.గౌతం తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6

(చట్టం -30/2013 లోని సెక్షన్ 11 (1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)
మరియు
(ఆక్ట్ నెం. 21 ఆఫ్ 2017 తెలంగాణ ప్రభుత్వం గెజిట్ పబ్లికేషన్ నెం. 22 తేది 17-05-2017 ప్రకారం)

ప్రాథమిక నోటిఫికేషన్

G1/3910/2025 తేది: 30.10.2025
ఫైల్ నెం. F/4495/2025, తేది: 21.10.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్గొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, చింతపల్లి మండలం, పోలేపల్లి రాంనగర్ గ్రామములోని విస్తీర్ణం ఎ. **54.23 గుంటల** సీలింగ్ భూమి ప్రజా ప్రయోజనార్థం నిమిత్తం అనగా డిండి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లోని శివన్నగూడెం బాలెన్సింగ్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురైన మర్రిగూడ మండలములోని వెంకేపల్లి మరియు వెంకేపల్లి తండా గ్రామాల పునరావాస మరియు పునరుద్ధరణ కొరకు భూసేకరణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.యస్. నం.39 ఇరిగేషన్ & కాడ్ (ఎల్.ఎ, ఆర్&ఆర్/ఎ2) డిపార్ట్‌మెంట్ తేది: 30.06.2017 జారి చేసినారు. అట్టి జి.ఓ. నందు డిండి ఎత్తిపోతల ప్రాజెక్ట్ సెక్షన్ 10ఎ చట్టం నెంబర్ 21/2017, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని చాప్టర్-II మరియు చాప్టర్-III నుండి మినహాయించబడినది.

కావున పునరావాస మరియు పునర్నిర్మాణం కొరకు పోలేపల్లి రాంనగర్ గ్రామము, చింతపల్లి మండలం, నల్లగొండ జిల్లాలో విస్తీర్ణం **ఎ. 54.23 గుం.ల** భూమి ఈ క్రింది చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది.

మండలం : చింతపల్లి గ్రామము : పోలేపల్లి రాంనగర్

| క్ర. సం. | సర్వే నెం. భూమి స్వభావము హక్కు స్వభావము | విస్తీర్ణం (ఎ.గుం.) | భూమిని కోల్పోయే రైతు పేరు, తండ్రి / భర్త పేరు | భూమి పై చెట్లు / పైపు లైను / బావి/ బోరు/ ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 256 మెట్ట/ సీలింగ్ భూమి ఎ.54.23 గుం.లు | 2.00 | గనమోని మల్లయ్య తండ్రి కీ.శే రామచంద్రయ్య | |
| 2 | | | గనమోని పెద్దసోమయ్య తండ్రి కీ.శే రామచంద్రయ్య | |
| 3 | | | గనమోని చిన్నసోమయ్య తండ్రి కీ.శే రామచంద్రయ్య | |
| 4 | | 3.15 | కానమోని చిన్న ముత్యాలు తండ్రి పెద్ద నర్సింహ్మా | 4 - వేప చెట్లు |
| 5 | | 2.22 | కానమోని పద్మ భర్త మదార్ | 6- తాటి చెట్లు |
| 6 | | | కానమోని శేఖర్ తండ్రి బుడ్డ వెంకయ్య | 1- తుమ్మ చెట్టు |
| 7 | | 2.37 | కానమోని రాములు తండ్రి నర్సింహ్మా | 8- తాటి చెట్లు, 3- వేప చెట్లు |
| 8 | | 5.30 | నక్కనగోని రాములు తండ్రి కీ. శే బుచ్చయ్య | 16- వేప చెట్లు, 2- తాటి చెట్లు |
| 9 | | | నక్కనగొని మల్లయ్య తండ్రి జంగయ్య | |
| 10 | | 3.25 | గంగాల పద్మమ్మ భర్త చెన్నయ్య | 15- వేప చెట్లు, 1- తాటి చెట్టు |
| 11 | | 3.22 | కానమోని మల్లమ్మ భర్త బుచ్చయ్య | |
| 12 | | 9.03 | కానమోని యాదమ్మ భర్త కృష్ణయ్య | 3- తాటి చెట్లు, 3- వేప చెట్లు |
| 13 | | | కానమోని సత్తయ్య తండ్రి మల్లయ్య | |
| 14 | | | కానమోని పాండయ్య తండ్రి మల్లయ్య | |
| 15 | | 2.09 | కానమోని యాదయ్య తండ్రి లక్ష్మ య్య | 4-టేకు, 19-మామిడి, 2-నిమ్మ, 8- తాటి, 2-జామ చెట్లు, 1-బోర్, 1-మోటార్ & పైప్‌లైన్. |
| 16 | | 7.00 | కానమోని నర్సింహ్మా తండ్రి లక్ష్మ య్య | 2-చింత, 4- తాటి, 4- వేప చెట్లు |
| 17 | | | కానమోని భారతమ్మ భర్త నర్సింహ్మా | |
| 18 | | 4.18 | కానమోని పద్మ భర్త గోపాల్ | 4- వేప చెట్లు |
| 19 | | | కానమోని గోపాల్ తండ్రి లక్ష్మ య్య | 2- తాటి చెట్లు |
| 20 | | 4.04 | పడకంటి యాదయ్య తండ్రి జంగయ్య | |
| 21 | | 3.06 | కానమోని యాదమ్మ భర్త యాదయ్య | 3- తాటి చెట్లు, 5- వేప చెట్లు |
| 22 | | 0.32 | గంగాపురం వెంకటయ్య తండ్రి సత్తయ్య | |
| | మొత్తము | 54.23 | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమంలోని సెక్షన్ (11) 1 ప్రకారం సంబంధిత భూయజమానులకు సరియైన భూనష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ మరియు భూసేకరణ అధికారి మరియు రాజస్వమండలాధికారి, దేవరకొండ గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు రాజస్వమండలాధికారి, దేవరకొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ (12) ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబందించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్-15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా రాజస్వమండలాధికారి/ భూసేకరణ అధికారి, దేవరకొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- రాజస్వమండలాధికారి/, భూసేకరణ అధికారి, దేవరకొండ.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టర్, నల్లగొండ.

DIPR RO NO. 816/LA/PP/Advt/Pub/2025-26


## దళిత వర్గాల అభివృద్ధికే సబ్ ప్లాన్ నిధులు

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సబ్‌ప్లాన్ నిధులను దళిత వర్గాల అభివృద్ధికే వినియోగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్య, వైద్యం ఆరోగ్యం, ఉపాధి కోసం నిధులను ఉపయోగించాలన్నారు. దళిత వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలతో పాటు ఆరోగ్యం పట్ల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికల రూపొందించి, అందుకు తగిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం కె.యేసురత్నం అధ్యక్షతన హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 2013 సంవత్సరంలో సబ్‌ప్లాన్ చట్టం వచ్చిందన్నారు. సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధి కోసం కేటాయించకుండా, ఇతర పథకాలకు దారి మళ్లించవద్దని ప్రభుత్వానికి సూచించారు. ప్రతి దళిత కుటుంబానికి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వాలు ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. గత పదేళ్లుగా ప్రభుత్వాల నుంచి ఎస్‌సి నిరుద్యోగ యువతకు రావాల్సిన స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు. నిరంతరం చైతన్యవంతంతో కూడిన ప్రజా చైతన్య ఉద్యమాల ద్వారానే అన్ని వర్గాల్లోని ప్రజలకు సమాన అవకాశాలు సాధ్యమని కూనంనేని పిలుపునిచ్చారు. సిపిఐకి అనుబంధంగా ఉన్న దళిత హక్కుల పోరాట సమితి దిన దినం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని ఆయన కొనియాడారు. లాల్ నీల్ ప్రజా చైతన్యం ద్వారానే సామాజిక విప్లవాలు వస్తాయన్నారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, నాయకులు వై.ఉ్రషీ, జేరుపోతుల కుమార్, ఆరుట్ల రాజ్ కుమార్, బి.లక్ష్మీపతి, మంద సుదర్శన్, డి.రాములు, బాబు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల కుంభకోణం.. 22 మంది అరెస్టు

**వరంగల్ డిసిపి అంకిత్ కుమార్ వెల్లడి**



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో 278 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిని 12 మంది నకిలీ రైతుల పేర్లతో కాజేస్తున్న 22 మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.1.07 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఉన్నారని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. ప్రస్తుత కేసులో ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ రబీ సీజన్ సమయంలో బండ లలితతో పరిచయం ఏర్పరచుకొని, ఆమెతో పాటు ట్యాబ్ ఆపరేటర్ చరణ్ సింగ్ సహకారంతో నకిలీ పంట వివరాలు నమోదు చేసి, ప్రభుత్వ నిధులను అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు (బండ లలిత, చరణ్ సింగ్) ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున కమీషన్, బెజ్జంకి శ్రీనివాస్ ఒక్కో క్వింటాకు రూ.500 బోనస్, రూ.50 మిల్లింగ్ చార్జీ రూపంలో లాభం పొందేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మొత్తం 8,049 క్వింటాళ్లపై రూ.2.10 కోట్లు విలువైన నిధులు అక్రమంగా పొందినట్లు తేలింది. ఇందులో భాగంగా బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులు, బంధువులు 12 మందిని నకిలీ రైతులుగా చూపించి, శాయంపేట మండల పరిధిలోని 278 ఎకరాల ప్రభుత్వ పోడు భూమిలో వరి పంట పండించినట్లు తప్పుడు వివరాలు సమర్పించాడు. టోకెన్ బుక్స్ నకిలీగా వ్రాసి, మండల ఏఈఓ, ఏఓ లాగిన్ ఐడీల ద్వారా నకిలీ ఎంట్రీలు చేశాడు. దాంతో ప్రభుత్వ కార్పొరేషన్ నిధి నుండి ఈ నకిలీ రైతుల 12 మంది అకౌంట్లలో రూ.1.86 కోట్లు, అదనంగా బండ లలిత, చరణ్ సింగ్, బండ రజినీకర్ రెడ్డి అకౌంట్లలో రూ.24 లక్షలు జమ అయ్యాయి. మొత్తం 15 మంది పేర్లపై 314 ఎకరాలకు, 9,100 క్వింటాళ్లకుగాను రూ.2.10 కోట్లు మోసపూరితంగా పొందినట్లు నిర్ధారణ అయింది.

**నిందితుల లాభం...**

బండ లలిత, చరణ్ సింగ్ ఒక్కో క్వింటాకు రూ.120 చొప్పున మొత్తం రూ.10.92 లక్షలు బెజ్జంకి శ్రీనివాస్ బోనస్ రూ.500 చొప్పున రూ.45 లక్షలు, మిల్లింగ్ చార్జ్ రూ.50 చొప్పున రూ.4.5 లక్షలు, తర్వాత బెజ్జంకి శ్రీనివాస్ రూ.1.32 కోట్లు డ్రా చేసి, అందులో భాగంగా రూ.32 లక్షలు (రిజిస్ట్రేషన్ ఖర్చులతో కలిపి) వెచ్చించి కమలాపూర్ మండలం, పంగిడిపల్లి గ్రామం, సర్వే నం.25/ఎఫ్‌లో ఒక ఎకరం భూమి తన కుమారులు బెజ్జంకి పున్నం చారి, బెజ్జంకి శివకుమార్ పేర్లపై కొనుగోలు చేశాడు. రూ.8 లక్షలు వెచ్చించి టాటా నెక్సాన్ (టీఎస్ 08 జేఆర్ 2471) కారు కొనుగోలు చేశాడు. రూ.1.06 కోట్లు ఖర్చు చేసి గత సీజన్, ప్రస్తుత సీజన్ షార్టేజ్ ధాన్యం కొనుగోలు చేశాడు. లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ సుదాటి రాజేశ్వర్ రావు రూ.4 లక్షలు సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్‌కు తిరిగి చెల్లించాడు. దర్యాప్తు సమయంలో రూ.54 లక్షలు నిందితుల బ్యాంక్ అకౌంట్లలో ఫ్రీజ్ చేశారు. అదనంగా రూ.9.50 లక్షల నగదు, రూ.8 లక్షల విలువైన టాటా నెక్సాన్ కారు, ఆర్సీ, రూ.32 లక్షల విలువైన భూమి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో మొత్తం రూ.1,07,84,134 విలువైన ఆస్తులు, నగదు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు.

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు.. మత్స్యశాఖ క్రియాశీలకంగా మారేలా ప్రణాళికలు

**మంత్రి వాకిటి శ్రీహరి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో హెచ్ఐసిసి నోవాటెల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వరల్డ్ ఆక్వా కల్చర్ ఇండియా 2025 కాన్ఫరెన్స్‌కు వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా మత్స్యశాఖపై రూపొందించిన పాటను మంత్రి సమక్షంలో విడుదల చేశారు. ప్రధానంగా ఈ కాన్ఫరెన్స్‌లో మత్స్య సంపద, మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధిపై ప్రధాన చర్చ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నుండి ఇప్పటి వరకు మత్స్య శాఖను ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వలేదని, మొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం నాకు మంత్రిగా అవకాశం ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొదటి క్యాబినెట్‌లోనే మత్స్య శాఖకు దాదాపుగా 123 కోట్ల బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. మత్స్యకారులందరి తరుపున సిఎం రేవంత్ రెడ్డికి మరో సారి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలో ఉన్న దాదాపుగా 26వేల నీటి వనరుల్లో చేప పిల్లల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వీటిల్లో 84 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. పారదర్శకతకు కేర్ ఆఫ్ అడ్రెస్‌గా రిజర్వాయర్లలో అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో చిన్న చెరువుల్లో ఎంఆర్ఓ ఆధ్వర్యంలో చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. అంతేకాకుండా చేపపిల్లల పంపిణీ సంబధించిన వివరాలు తెలియజేస్తూ చెరువు వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఎన్ఎఫ్‌డిబి సిఇఓ బెహారా, జాయింట్ సెక్రటరీ నీతు కుమారి, జాయ్ కృష్ణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐకార్, పివిఎన్ఆర్ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞానప్రకాష్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు రాష్ట్రవ్యాప్తంగా 'బిసి ధర్మ పోరాట దీక్ష'లు

**బిసిల ధర్మ పోరాట దీక్ష పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్ గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా నియోజకవర్గ మండల కేంద్రాలలో వేలాదిమందితో 'బిసిల ధర్మ పోరాట దీక్ష'లు చేపట్టాలని బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసి, బిసి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంపైన రాజకీయ యుద్ధం చేసేందుకు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. హైదరాబాద్, కాచిగూడలోని 'అభినంద్ గ్రాండ్ హోటల్' బిసి జెఎసి చీఫ్ కో ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారితో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ తరహా బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ఈనెల 13న ధర్మ పోరాట దీక్షలు, 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, 18న ఎంపిలతో బిసిల ములాకత్, 23న అఖిలపక్ష సమావేశాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. డిసెంబర్ మొదటి వారంలో పార్లమెంటు దిగ్బంధం, డిసెంబర్ మూడో వారంలో రాష్ట్రవ్యాప్తంగా బిసిల బస్సు యాత్ర, జనవరి చివరి వారంలో 'వేల వృత్తులు కోట్ల గొంతులు' అనే నినాదంతో లక్షలాది మందితో హైదరాబాదులో బహిరంగ సభ నిర్వహించి, బిసి ఉద్యమ సునామీని సృష్టిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు, బిసి రిజర్వేషన్ల సాధన కోసం సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బిసి రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలతో సమన్వయం చేసుకుని పార్లమెంటును స్తంభింపచేయాలని, కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వం బిసిల తరపున రాజకీయ పోరాటాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే నెలలో జరిగే పార్లమెంట్ సమావేశంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లును యథావిధిగా అమలు చేయాలని, లేదంటే తెలంగాణ రాష్ట్రంలో జీవితాంతం బిజెపి రాజకీయ అధికారానికి దూరంగా ఉండాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం అధ్యక్షులు ఎం.వీరస్వామి, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మనిమంజరిసాగర్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ గౌడ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు నందగోపాల్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లాల నరసింహ, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, ముదిరాజ్ ఐక్య వేదిక కన్వీనర్ గొడుగు మల్లికార్జున్, మన బీసీ మహా సభ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
టెండర్ నోటీస్ నెం.04/2025-26
యాదాద్రి భువనగిరి సర్కిల్‌లోని వివిధ సివిల్ పనులకు అర్హులైన విక్రేతల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. **గమనిక:** టెండర్ యొక్క వివరణాత్మక సమాచారాన్ని టిజిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్ అనగా **https://tgsouthernpower.org/Tenders/General Tenders** లో పొందవచ్చు. **ఆఖరి తేదీ:** 19.11.2025న మధ్యాహ్నం 3.00గం.ల వరకు. ఫోన్: 8712471769.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, టిజిఎస్‌పిడిసిఎల్, యాదాద్రి భువనగిరి.
DIPR R.O. No. : 10463-PP/CL/ADVT/1/2025-26, Date: 11-11-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
కుత్బుల్లాపూర్ సర్కిల్-25
NIT No. 23/DB/EE/Quthbullapur Circle/GHMC/2025-26 తేది: 11.11.2025
**పని పేరు:** బిటి రోడ్లు, సిసి రోడ్లు మరియు తుఫాను నీటి కాలువల నిర్వహణ & సిసి రోడ్డు వేయడం. **అంచనా విలువ:** రూ.29.50లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 12.11.2025న ఉ.11:00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 19.11.2025న ఉ.11.00గం.ల వరకు. **టెండరు ఆహ్వానించు అధికార వివరాలు మరియు మొబైల్ నెం.:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701365503, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 7337557259. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ సర్కిల్-25, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10470-PP/CL/ADVT/1/2025-26, Date: 11-11-2025

hmda Growing Global
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణజయంతి కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038.
బహిరంగ ప్రకటన
దీని ద్వారా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క చట్టం నెం.8) లోని సెక్షన్ 15లోని సెక్షన్ సబ్ సెక్షన్ (3) ద్వారా ఇవ్వబడిన అధికారాన్ని వినియోగించుకుంటూ ప్రతిపాదిత రోడ్డు విస్తరణ, మిస్సింగ్ లింక్ రోడ్డుపై సాధారణ ప్రజల నుండి అభ్యంతరాలు మరియు సూచనలను కోరుతోంది.

| క్ర.సం. | ప్రతిపాదిత రోడ్డు వివరాలు |
|---|---|
| 1 | ప్రతిపాదిత ఆర్‌డిపి ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్ ప్లాన్ హిమాయత్‌నగర్ & బుద్వేల్ జోన్ సెగ్మెంట్స్ పరిధిలోకి వస్తుంది. G.O.Ms. No.288 తేదీ 03-04-2008 మరియు MDP-2031 యొక్క మొయినాబాద్-రాజేంద్రనగర్ మాస్టర్ ప్లాన్ G.O.Ms.No. 33 MA&UD (I1) డిపార్ట్‌మెంట్ తేదీ 24-01-2013 మరియు రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం, మంచిరేవుల గ్రామం పరిధి 294, 293, 232, 231, 230, 229, 228 సర్వే నెంబర్ల గుండా మరియు రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం బైరాగిగూడ పరిధి 51 మరియు 76 సర్వే నెంబర్ల గుండా వెళ్తోంది. |

తెలుపబడిన ఈ ప్రతిపాదనపై ఏ వ్యక్తి లేదా సంస్థ నుండి అయినా వారి నుంచి అభ్యంతరాలు / సూచనలను పరిగణనలోనికి తీసుకుంటారు. వారు ఈ నోటీస్ ప్రచురించబడిన తేదీ నుండి 15 రోజులలోపు M.C, HMDAకి అభ్యంతరాలు లేదా సూచనలను లిఖితపూర్వకంగా సమర్పించవచ్చు.
మీ విశ్వాసపాత్రుడు
సం/- మెట్రోపాలిటన్ కమిషనర్
DIPR R.O. No. : 10501-PP/CL/ADVT/1/2025-26, Date: 11-11-2025

## 13న బిసిల ధర్మపోరాట దీక్ష



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనే లక్ష్యంగా ఈనెల 13న జరిగే బీసీల ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణం లోని అంబేద్కర్ భవన్లో జరిగిన బీసీ జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటూ బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లా బీసీ జేఏసీ నూతన చైర్మన్ గా చక్రహరి రామరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కుల్కచర్ల శ్రీనివాస్,వరికుప్పల మధు,పాలకూరి కిరణ్,బండిగారి భరత్ పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా లబ్ధి చేకూరుతుందని, పేద ప్రజలు ఎవరైనా చికిత్స పొందిన ఆరు నెలల్లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న పేదవాళ్లకు అండగా నిలుస్తుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ శాఖ కార్యదర్శి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.




## సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సు జాతను జయప్రదం చేయండి

### జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బస్సు జాతను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వచ్చేనెల 26న ఖమ్మం నగరంలో పెద్ద ఎత్తున నిర్వహించే అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలు భారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు అనేక అవస్థలు పడుతున్నారని ఒకవైపు తుఫానులతో అల్లాడిపోతున్నారని మరోవైపు కొనుగోలులో జాప్యం జరుగుతున్నందున అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తేమశాతం 20 వచ్చినప్పటికీ ఏ గ్రేడ్ ధాన్యంగా ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో రోడ్లు గుంతలుగా మారిపోయి ప్రమాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కప్రాయి పల్లి గ్రామంలో చిప్పల చెరువు కు తూము నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి గోడళ్ళ భూషణ్ గౌడ్, నరసింహ కృష్ణమూర్తి, శ్రీశైలం, శివ, బాల నరసింహ, సాయి రెడ్డి తదితర సిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం అందించండి

### రైతుసంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు నేటి వరకు ప్రభుత్వం పరిహారం అందించలేదని వెంటనే నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు , జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్యలు అన్నారు. మంగళవారం వారు సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. తుఫాన్ వల్ల వందల ఎకరాలు నేలమట్టై రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటివరకు వ్యవసాయాధికారులు ఏ గ్రామాలనికి వెళ్లి పరిశీలన చేయలేదన్నారు. ఒకవైపు కోత మిషన్లు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా మిల్లర్లు కొర్రీలు పెట్టి రైతుల ధాన్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా సబ్ కలెక్టర్ స్పందించి వ్యవసాయాదికారులను గ్రామాలకు పంపించి ఎక్కడ పంట నష్టం వాటిల్లిందో పరిశీలన చేయాలని ఆదేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, ఎం.ఆశీర్వాదం, ఉపేందర్, బాలకృష్ణ, సతీష్, వెంకటయ్య, మట్టయ్య, నాగునాయ క్, రవీందర్, శివలింగం, రాములు, యాదగిరి, విశ్వనాద్, రైతులు పాల్గొన్నారు.


## జాతీయ రహదారిపై తప్పిన మరో పెను ప్రమాదం



**ప్రజాపక్షం/చిట్యాల:** జాతీయ రహదారి65పై చిట్యాల మండలం పిట్టంపల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు..చూస్తుండగానే కాలిబూడిదైన బస్సు మంటపు రావడాన్ని గమనించి హుటాహుటిన కిందకు దూకిన ప్రయాణికులు..హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తుండగా ఘటన...బస్సు నాగాలాండ్ రిజిస్ట్రేషన్ కు చెందిన విహారి ట్రావెల్స్ బస్సుగా గుర్తింపు.నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పిట్టంపల్లి స్టేజి వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మరో ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైంది. హైదరాబాదు నుండి విజయవాడ వైపు సుమారు 30 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న బస్సులోని ఇంజన్ లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి బస్సులో మంటలు చెలరేగాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణీకులను బస్సు నుండి దిగడానికి అప్రమత్తం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.లేకుంటే ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగేది.నిమిషాల్లోనే మంటలు వ్యాపించి బస్సుపూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొర్రీలు పెడితే చర్యలు తీసుకుంటాం

### సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులు తీసుకొచ్చిన అన్ని రకాల ధాన్యాన్ని మిల్లర్లు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా తగిన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడలోని సూర్య రైస్ మిల్లుతోపాటు పలు రైస్ మిల్లులను ఆయన అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకునానరు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగతా రైతులు పడిన ఇబ్బందులను గమనించి అలాంటి ఇబ్బందులు తిరిగి పునరావృతం కాకుండా ఉండేందుకు తగు ప్రణాళికను రూపొందించుకోని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. మిర్యాలగూడలో గల మిల్లులను వాట్సాప్ ద్వారా అనుసంధానం చేసి ఏ మిల్లులో అయితే రద్దీ తక్కువగా ఉంటుందో ఆ మిల్లులకు ధాన్యం తరలించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎలాంటి ధాన్యం కొనుగోలుకు ఇవ్వలేదని, ఇక్కడి నుంచి ధాన్యం తెలంగాణాలోకి రానివ్వకుండా తమ పరిధిలోని వాడపల్లి, నాగార్జునసాగర్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, మిల్లర్స్ వెంకటరమణ చౌదరి, తహసీల్దార్ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

### విద్యార్థులకు పోషకాహారం నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు విధి నిర్వహణ

### మధ్యాహ్న భోజన తనిఖీలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులకు పోషకాహారం నాణ్యమైన విద్య నందించి 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ఉపాధ్యాయులు విద్యాధికారులు విధి నిర్వహణలో నిమగ్నమై పని చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన భూదాన్ పోచంపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి మెరుగైన ఫలితాలు రావడానికి పాటించవలసిన టెక్నిక్స్ బోధించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, వడ్డిస్తున్న తీరును, ఆహార పదార్థాలను, వంటకాలను పరిశీలించి స్వయంగా ఆయనే విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ప్రతి విద్యార్థిని భోజనం రుచికరంగా ఉంటుందా నాణ్యమైన ఆహారం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్‌గా తనిఖీ కోసం వచ్చినప్పటికీ సాధారణ విద్యార్థిగా విద్యార్థుల్లో ఒకరిగా వరుసలో నిలబడి ఆయన కూడా స్వయంగా ప్లేట్ పట్టుకొని భోజనం పెట్టించుకుని విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తూ ఉపాధ్యాయులు బోధన సరిగ్గా బోధిస్తున్నారా లేదా అని తెలుసుకుంటూ భోజనం చేశారు. ఆయనతో పాటు అధికారులు కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యాధికారులకు ఉపాధ్యాయులకు పాఠశాల మెరుగైన ఫలితాలు రావడం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రణాళిక ప్రకారం చేయవలసిన విధులు వంటివి దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే జిల్లాలో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు చెప్పారు. రూ.30 కోట్లు రైతుల ఖాతాలో జమ అయినట్లు వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు అధైర్యపడి దళారులను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఇంజన్ రెడ్డి, ఎండిఓ భాస్కర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ఏఈ వివిధ శాఖల అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

# జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** సరైన తేమశాతంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ఆయన తిరుమలగిరి మండలం తొండ, కోక్యానాయక్ తండ, ఫణిగిరి లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత ముందు పంపించాలని ఇది వరకే చెప్పడం జరిగిందని, ధాన్యం తడిచినప్పటికి ఇబ్బంది లేకుంటే మిల్లులకు పంపించాలన్నారు. పౌరసరఫరాల అధికారులు మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తీసుకునే విధంగా చర్చించాలన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాలలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిష్టర్లను పరిశీలించారు. ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తూకం సరైన విధంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాము, తిరుమలగిరి తహశీల్దార్ హరిప్రసాద్ కలెక్టర్ వెంట ఉన్నారు.

**భవిష్యత్తుకు 10వ తరగతి మొదటి అడుగు : జిల్లా కలెక్టర్**

భవిష్యత్తుకు పదవ తరగతి మొదటి అడుగు అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పదవ తరగతిలో మంచి మార్కులు, విషయపరిజ్ఞానాన్ని సంపాదిస్తే ఇంటర్‌తోపాటు, అన్నింటిలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం ఆయన తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల స్పెషల్ క్లాస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందరికి పుస్తకాలు వచ్చాయా, సిలబస్ ఎంత వరకు అయిందని, హాస్టల్లో భోజనం బాగుందా, చదువులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. అనంతరం చదువు ప్రాధాన్యత, పదవ తరగతి ప్రాముఖ్యతను ఆయన తెలియజేస్తూ పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చేందుకు బాగా కష్టపడి చదువాలని సూచించారు.

# గంజాయి ముఠా అరెస్ట్

### 1.4 కేజీల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం డిఎస్‌పి రాజశేఖర్‌రాజు వెల్లడి





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలను నిర్మూలనే లక్ష్యంగా గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి నిరంతర నిఘాలో భాగంగా మిర్యాలగూడ శివారులో గల అగ్రిగోల్డ్ వెంచర్‌లో గంజాయి తాగుటకు గంజాయి తెచ్చుకున్నారన్న సమాచారం మేరకు మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్ఐ సైదిరెడ్డికి నమ్మదగిన సమాచారం రాగా మంగళవారం సిబ్బందితో వెంచర్‌ను చేరుకునే సమయానికి తొమ్మిది మంది యువకులు గంజాయిని కలిగి ఉన్న కవర్‌తో ఉండగా పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకోని వివరాలు తెలుసుకోని విచారించి, వారి వద్ద నుంచి ఒక నలుపు పాలిథిన్ కవర్‌లో ఉన్న 1.4కేజీ బరువు ఉన్న గంజాయి ప్యాకెట్లను, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు షేక్ అఫ్రోజ్, ననావత్ అశోక్, మహమ్మద్ నసీరొద్దిన్ బాబా, షేక్ హైమద్, వల్లవాయి నవీన్, మల్లెబోయిన రాకేష్, మారిలు స్నేహితులు. వీరు సాయిరాం ద్వారా గంజాయి తాగడం అలవాటు అయిందని, వీరంతా కలిసి గంజాయి తాగేవాళ్లు, ఎప్పటిలాగానే ఈ ఆరుగురు కలిసి ఒక్కొక్కరు రూ.1200 వేసుకోని రూ.7200తో సాయిరాం దగ్గర సుమారు రూ.1.4 కిలోల గంజాయి ప్యాకెట్లను అద్దంకి నార్కట్‌పల్లి హైవే వద్ద వై జంక్షన్ వద్ద కొనుగోలు చేసి యదావిధిగా అప్పుడు గంజాయి పంచుకోని తాగేవారు. మిర్యాలగూడ పట్టణ శివారులోని అగ్రిగోల్ వెంచర్ లోకి వెళ్లి అందులో పంచుకునే సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నారని అన్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎస్ డీపీవో పర్యవేక్షణలో ఇట్టి కేసు ఛేదించడంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వన్ టౌన్ సీఐ నాగభూషణరావు, ఎస్ఐ సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుల్ నల్లగంతుల శ్రీను, గద్దల హుస్సేన్, వీరబాబు, నర్సింహా, భీమనపల్లి ప్రసాద్, శివాజి, హోంగార్డు సాయి, గిరి, అనిల్ లను జిల్లా ఎస్పీ అభినందించారని తెలిపారు.

## నక్కలగండి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కవిత



**ప్రజాపక్షం/దేవరకొండ:** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం నక్కలగండి ప్రాజెక్టు భూ నిర్వాసితులను కలిసి మాట్లాడేందుకు వారి సమస్యల పరిష్కారం కోసం అండగా ఉండేందుకు మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత నక్కలగండి ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో భూ నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నక్కలగండి ప్రాజెక్టు కోసం 2300 ఎకరాల భూమిని సేకరించారని మరో 700 ఎకరాలు అటవీ భూమి సేకరించాల్సి ఉందని ఇప్పటి వరకు అటవీ భూమిని ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. మీ తరుపున నేను ప్రభుత్వాన్ని అడుగుతానని సిఎం, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి నిర్వాసితుల పక్షాణ మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. దేవరకొండ మండలం కొమ్మేపల్లి గురుకుల పాఠశాలను మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సందర్శించారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా దేవరకొండలో పర్యటించి కొమ్మేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు వర్షంలో అవస్థలు పడిన పరిస్థితిని వార్తల్లో చూసానని అందుకోసమే విద్యార్థుల వద్దకు వచ్చానని అన్నారు. జాగృతి రాష్ట్ర కార్యదర్శి మన అశోక్‌యాదవ్, బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షులు రవీందర్‌నాయక్, మల్లయ్య, అరుణ్, అనిల్ పాల్గొన్నారు.



## సిఐఆర్ ద్వారా 2,340 మొబైల్ ఫోన్స్ రికవరీ : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సిఇఐఆర్ ద్వారా ఇప్పటి వరకు 2340 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు అందించినట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న 102 ఫోన్లను రికవరీ చేసి జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 7వ దఫా మొబైల్ మేళా నిర్వహించి రికవరీ చేసిన మొబైల్స్‌ను బాధితులకు అందించామ న్నారు. దీని కోసం జిల్లా పోలీసు చాలా కృషి చేసిందని, పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సైబర్ వారియర్స్ నిరంతర శ్రమ ఫలితంగానే వారి ఫోన్లను వారికి అప్పగించగల్గుతున్నామని తెలిపారు. విలువైన సమాచారం ఫోన్లలో భద్రపరిచి ఉంటున్నందున జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పోయిన మొబైల్స్‌ను గుర్తించడానికి సిఇఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరిగిందని వివరించారు. పంట కాలం చేతికొచ్చే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పంట డబ్బులు అకౌంట్‌లో వేస్తామంటూ అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు, ఓటిపి వివరాలు అడిగితే ఇవ్వవద్దని తెలిపారు. అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

## యాదాద్రి జిల్లాను మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

### అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో డ్రగ్స్ మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ డీసీపీ లక్ష్మీ నారాయణ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి , అన్ని విద్యాసంస్థల ప్రిన్సిపాల్, వైద్య ఆరోగ్య శాఖ, తదితర సంబంధిత విభాగాలతో కలిసి డ్రగ్స్ నిర్మూలన పై అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండేందుకు వారికి ముందస్తు అవగాహన సదస్సులు నిర్వహించి డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ, అంగన్వాడీ కేంద్రాలు, తదితర సంక్షేమ వసతి గృహాలలో ప్రార్థనా సమయాలలో డ్రగ్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజ, జిల్లా విద్యా శాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని రమణి, ప్రిన్సిపల్స్ సంబంధిత అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక బుక్ చేసుకున్న కస్టమర్లను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇసుకను బ్లాక్ చేసి అధిక ధరకు బ్రోకర్లకు అమ్మిన,బుక్ చేసుకున్న కస్టమర్ లకు ఇబ్బందులకు గురి చేసిన ట్రాక్టర్ డ్రైవర్ల పై కట్టిన చర్యలు తప్పవని ఎడి మైన్స్ అధికారి జాకబ్ హెచ్చరించారు.మంగళవారం పట్టణంలోని దేవరకొండ రోడ్డులోమైనింగ్ అధికారులు,వన్‌టౌన్,ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఇసుక ట్రాక్టర్ల పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారందరితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాకబ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి వారికి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు బుక్ చేసుకున్న కస్టమర్లకు మాత్రమే పే చేసిన అమౌంట్ కు సరఫరా చేయాలని, కస్టమర్లకు ఇసుక బాలేదని, దూరం ఉందని మాయమాటలు చెప్పి అధిక డబ్బులు వసూలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు.


# గురుకులంలో జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం

### పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నందికొండ:** విద్యార్థులు జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి బహుమతులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన అండర్ 14,19 జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు వెంటనే జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఆ తరువా త విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి శాంతికపోతాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో కూడా బహుమతులు సాధించాలని అన్నారు. తన ఆతిథ్యానికి ముగ్దులైన కలెక్టర్ పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తానని తను ఇప్పటివరకు బాలికల పాఠశాలలను మాత్రమే సందర్శించానని ఇక్కడి వాతావరణం చూసిన తర్వాత ఇకనుంచి బాలుర పాఠశాలలను కూడా సందర్శిస్తానని అన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధిస్తే తమ క్యాంప్ ఆఫీసులో విందును ఏర్పాటు చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లు ఇంత అద్భుతంగా ఏర్పాటు చేయడంలో కృషి చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ను, ఉపాధ్యాయ, అధ్యాపక బృందాన్ని, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజశేఖర్ ప్రాంతీయ సమన్వయ అధికారి స్వప్న, పెద్దవూర ఎంఈఓ తరి రాము, డిప్యూటీ తహసిల్దార్ శ్రీదేవి, నందికొండ మున్సిపల్ కమిషనర్ వేణు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్,తుమ్మడం బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ముస్లిం పర్సనల్ లా బోర్డు విచారం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు పట్ల ప్రముఖ ముస్లిం సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. భద్రతా లోపాలను పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక, బహుళకోణాలలో దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరాయి.పేలుడుపై అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తూ, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు బోర్డు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.దేశ రాజధానిలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుపై బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సమగ్ర, నిష్పాక్షిక, బహుళ కోణాలలో దర్యాప్తు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

- కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే డిమాండ్
- అమిత్ షా అత్యంత అసమర్థ హోం మంత్రి
- ఆయనపై చర్యకు మోదీ ఎందుకు భయపడుతున్నారు



**బెంగళూరు :** కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వతంత్ర భారతదేశంలో అత్యం త అసమర్థ హోం మంత్రి అని కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే విమర్శించారు. ఢిల్లీ పేలుడులో పలువురు మరణించిన నేపథ్యంలో నిఘా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బెంగళూరులో మం గళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనలో కేంద్రం జవాబుదారీతనాన్ని ఆయన ప్రశ్నించారు. 'ఇంకా ఎంతమంది చనిపోవాలి' అని అన్నారు. దేశంలో వివిధ ఉగ్రవాద ఘటనలను ఉటంకిస్తూ అమిత్ షాపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్య తీసుకోలేదన్నారు. 'స్వతంత్ర భారతదేశంలో అమిత్ షా అత్యంత అసమర్థ హోం మంత్రి. ఇంకా ఎంతమంది ప్రాణాలు కోల్పోవాలి? ఢిల్లీ, మణిపూర్, పుల్వామా, పెహల్గామ్ ఘటనలపై మన వద్ద సమాధానాలు ఉన్నాయా? హోం మంత్రిగా ఆయన ఎన్నికల వేదికపైకి వెళ్లి బంగ్లాదేశీయులు భారతదేశంలోకి చొరబడుతున్నారని అంటున్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? దీనికి ప్రతిపక్షం బాధ్యత వహిస్తుందా?' అని ప్రియాంక్ ఖర్గే నిలదీశారు. 'జవాబుదారీతనం లేదు. అమిత్‌షాను తరచుగా ఆధునిక సర్దార్ పటేల్ అని పిలుస్తారు. 56 అంగుళాల ఛాతీ గురించి పదేపదే వాదనలు వినిపిస్తున్నాయి. ఆయన రాజీనామా చేసేందుకు ఇంకా ఎంత మంది ప్రాణాలు కోల్పోవాలి?' అని అన్నారు.

**మోదీకి భయమెందుకు?:** అమిత్ షాకు వ్యతిరేకంగా చర్య తీసుకునేందుకు మోదీ ఎందుకు భయపడుతున్నారు? తన గుజరాత్ రహస్యాలు బయటపడతాయని ఆయన ఆందోళన చెందుతున్నారా? అని ప్రియాంక్ ఖర్గే అన్నారు. ఇతర దేశాలలో ఈ పాటికే హోంమంత్రి రాజీనామా చేసి ఉండేవారని, ఇంకా ఎంత మంది చనిపోవాలి? నిఘా వైఫల్యం ఉందని,ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## నిందితులను చట్టం ఎదుట నిలబెట్టాలి

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్

**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో ముడిపడి ఉన్న ఢిల్లీ పొరుగు ప్రాంతం నుండి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం వ్యవస్థీకృత సంబంధాల ప్రమేయాన్ని సూచిస్తుందని పేర్కొంది. దేశ రాజధాని నడిబొడ్డున జరిగిన పేలుడును ఖండిస్తూ, నిందితులను చట్టం ఎదుట నిలబెట్టడం ప్రభుత్వ బాధ్యత అని సిపిఐ(ఎం) నొక్కి చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రెచ్చగొట్టే ఎలాంటి చర్యలకు లొంగకుండా శాంతి, సామరస్యతను పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేసింది. 'ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు, తుపాకులు కనుగొన్నారని, తాజా దాడితో ముడిపడి ఉన్నాయని వస్తున్న వార్తలు కలవరపరుస్తున్నాయని పేర్కొంది.

## ఫరీదాబాద్ నుంచి ఎర్రకోట వరకు... పేలుడుకు ముందు
# 11 గంటలు ఐ –20 కారు ప్రయాణం

సిసి టివి ఫుటేజ్‌లలో కారు మార్గాన్ని గుర్తించిన ఢిల్లీ పోలీసులు





**న్యూఢిల్లీ :** ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన హ్యుందాయ్ ఐ –20 కారు పేలుడుకు ముందు ప్రయానించిన మార్గాన్ని ఢిల్లీ పోలీసులు గుర్తించారు. కారు హర్యానాలోని ఫరీదాబాద్ నుండి దేశ రాజధానికి వరకు కారు సుమారు 11 గం టల పాటు ప్రయాణించిందని పోలీసు వర్గాలు మంగళవారం నాడు తెలిపాయి. కారు సోమవారం తెల్లవారుజామున ఫరీదాబాద్ నుండి బయలుదేరి, ఢిల్లీలోని అనేక ప్రాంతాల గుండా చుట్టూ తిరిగి, సోమవారం సాయంత్రం 6:52 గం టలకు ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో పేలిపోయిందని ఆ వర్గాలు వెల్లడించాయి. 'కారు మొదట ఫరీదాబాద్‌లోని ఆసియన్ హాస్పిటల్ బైట ఉదయం 7:30 గంటలకు కనిపించింది. ఉదయం 8:13 గంటలకు బదర్‌పూర్ టోల్ ప్లాజాను దాటింది. ఇది ఢిల్లీలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది' అని ఒక వర్గాలు తెలిపాయి. ఉదయం 8:20 గంటలకు, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలోని పెట్రోల్ పంప్ గుండా వాహనం వెళుతున్న చిత్రాన్ని సిసిటివి ఫుటేజ్‌లో నిక్షిప్తమయ్యాయి. దర్యాప్తు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం 3:19 గంటలకు కారు ఎర్రకోట కాంప్లెక్స్ పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. అక్కడ దాదాపు మూడు గంటల పాటు అది అలాగే ఉండిపోయింది. 'సాయంత్రం 6:22 గంటలకు, కారు పార్కింగ్ ప్రాంతం నుండి బయలుదేరి ఎర్రకోట వైపు వెళుతున్నట్లు కనిపించింది. పేలుడుకు ముందు 30 నిమిషాల సమయం మా దర్యాప్తులో కీలకమైన అంశం. వాహనం లోపల ఎవరు ఉన్నారో తెలుసుకోవడానికి మేము ప్రయత్నిస్తున్నాము' అని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. వాహనం పార్కింగ్ ప్రాంతం నుండి బయలుదేరిన 24 నిమిషాల తర్వాత, సాయంత్రం 6:52 గంటల ప్రాంతంలో ఒక శక్తివంతమైన పేలుడు కదులుతున్న కారును ఛేధించింది. ఈ పేలుడులో వాహనం ముక్కలైంది. శరీర భాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. సమీపంలోని భవనాల అద్దాలు, మెట్రో స్టేషన్ పగిలిపోయాయి.



## క్షతగాత్రులకు సిపిఐ ఎంపి సందోష్ కుమార్ పరామర్శ

**న్యూఢిల్లీ :** ఎర్రకోట వద్ద పేలుడులో బాధితులను సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు పి. సందోష్ కుమార్ మంగళవారం పరామర్శించారు. సిపిఐ ఢిల్లీ కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్ష్ణేతో కలిసి ఆయన క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఎల్ఎన్‌జెపి ఆసుపత్రిని సందర్శించారు. గాయపడిన వారికి చికిత్స చేస్తున్న వైద్య బృందంతో ఆయన మాట్లాడారు. వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాధితులను తాను కలిసానని, వారికి సరైన వైద్యం అందుతుందని సందోష్ కుమార్ ఆసుపత్రి బైట మీడియాతో తెలిపారు. మరణించిన, గాయపడిన వారి పట్ల, వారి కు టుంబసభ్యుల పట్ల పూర్తి సానుభూతి, సంఘీభావంతో ఉన్నామని తెలిపారు. దేశమంతటా ఒక్కటిగా నిలిచిందని, అసలు ఏమి జరిగిందో ఎవరికీ తెలియదని, ప్రస్తుతానికి గాయపడిన వారికి వైద్యం అందించటం అత్యంత అవసరమని అన్నారు.

## మేము మరణాన్ని దగ్గరగా చూశాం



'రోడ్డుపై జనం పడి ఉన్నారు. కొంతమందికి రక్తం కారుతోంది. మరికొందరు అస్సలు కదలడం లేదు. ప్రతిచోటా రక్తమే. మేము మరణాన్ని దగ్గరగా చూశాం' అని కుడి చేతి గాయానికి కట్టుకట్టుకొని, ఆసుపత్రి మంచంపై పడుకొని ఉన్న రామ్ ప్రతాప్ ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనను వివరించారు. ఆ ఘటనలో బిహార్‌కు చెందిన రోడ్డు పక్కన తినుబండారాలు విక్రయించే ఈ వ్యాపారి కూడా ఉన్నారు. ఎర్రకోట సమీపంలో ఒక చిన్న రోడ్డు పక్కన తినుబండారాల షాపు నడుపుతున్న ప్రతాప్ పేలుడు జరిగే ముందే తన షాపును మూసేందుకు సన్నద్ధమవుతున్నాడు. పేలుడు తన పాలిట పీడకలగా ఎలా మారిందో ఆయన కూడా ఆసుపత్రి బెడ్ మీద పడుకొని వివరించాడు. 'అది ప్రతి సాయంత్రం లాంటిదే. కొంతమంది కస్టమర్లు వేచి ఉండగా అకస్మాత్తుగా పెద్ద పేలుడు సంభవించింది. శబ్దం చాలా బలంగా ఉంది, నాకు కొన్ని సెకన్ల పాటు ఏమీ వినబడలేదు. గాజు ముక్కలు మాపై పడ్డాయి, దట్టమైన పొగ మొత్తం అలుముకుంది' అని ప్రతాప్ చెప్పారు.'జనం నేలపై పడి ఉన్నారు, కొంతమంది రక్తమోడుతున్నారు. మరికొందరు అస్సలు కదలడం లేదు. రక్తం ప్రతిచోటా పడింది. నా చేతికి రక్తం బాగా కారుతోంది, కానీ నేను ఆ విషయాన్ని గ్రహించలేదు. మేము మరణాన్ని దగ్గరగా చూశాము,' అని ఆయన తన కన్నీళ్లను ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు. ఎమర్జెన్సీ వార్డు బైట ప్రతాప్ బంధువులలో ఒకరు పేలుడు జరిగినప్పుడు కొన్ని మీటర్ల దూరంలో నిలబడి ఉన్న విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఒక మెరుపు, తరువాత మంటలు, తరువాత దట్టమైన నల్లటి పొగ. నేను దిగ్భ్రాంతికి గురయ్యాను. నా సోదరుడు కనపడలేదు' అని అయన చెప్పాడు.ఆ సాయంత్రం, ప్రతాప్ షాపుకు కొన్ని మీటర్ల దూరంలో విజేందర్ యాదవ్ తన నీటి ట్యాంకర్‌ను పార్క్ చేసినప్పుడు పేలుడు సంభవించింది. అంతా చీకటిగా మారింది.

## పెద్ద దిక్కును కోల్పోయాం

ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి జిల్లాకు చెందిన 18 ఏళ్ల నౌమాన్ అన్సారీ తన షాపులో విక్రమించేందుకు అవసరమైన సౌందర్య సాధనాలు కొనడానికి ఢిల్లీలో ఉన్నప్పుడు ఎర్రకోట సమీపంలో జరిగిన శక్తివంతమైన పేలుడులో ప్రాణాలు కోల్పోయాడు. షామ్లిలోని జింఝూన పట్టణానికి చెందిన అన్సారీ ఆయన కుటుంబానికి ఏకైక జీవనాధారం. నౌమాన్ అక్కడికక్కడే మరణించగా, ఆయన బంధువు అమన్ గాయపడి ఢిల్లీలోని లోక్ నాయక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని నౌమాన్ మామ ఫుర్కాన్ పిటిఐకి తెలిపారు. నౌమాన్ భౌతికకాయాన్ని ఖననం చేయడానికి కుటుంబం ఏర్పాట్లు చేస్తోందని ఫుర్కాన్ చెప్పారు. చనిపోయిన వారిలో అమ్రోహా జిల్లాకు చెందిన 34 ఏళ్ల ఆర్‌టిసి కండక్టర్ అశోక్ కుమార్ కూడా ఉన్నారు. మరో మృతుడిని 22 ఏళ్ల పంకజ్ సాహినిగా గుర్తించారు. అతను టాక్సీ నడుపుతుంటాడు. సోమవారం సాయంత్రం జరిగిన పేలుడులో తన సోదరుని కుమారుడు మరణించాడని, ఆ పేలుడులో 12 మంది మరణించారని ఢిల్లీలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ నుండి ఫోన్ కాల్ వచ్చిందని ఆయన బంధువు రాందేవ్ సాహ్ని తెలిపారు.'పంకజ్ మూడు సంవత్సరాలుగా టాక్సీ నడిపాడు. అయన తల వెనుక భాగం ఎగిరిపోయిందని మాకు చెప్పారు. వాగన్ ఆర్ కారు పూర్తిగా దెబ్బతిన్నది' అని సాహ్ని చెప్పారు.




### 13కు చేరిన మృతులు

ఢిల్లీ పోలీసుల ప్రకారం మృతుల సంఖ్య 13 కి పెరిగింది. మంగళవారం మరో నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలతో మరణించారు. ఈ సంఘటనలో మరో 20 మందికి పైగా గాయపడ్డారు.

## ఫరిదాబాద్‌లో ముమ్మరంగా గాలింపు చర్యలు

**ఫరిదాబాద్ :** జమ్ముకశ్మీర్‌లో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే. హర్యానాలోని ఫరీదాబాద్‌లో కశ్మీర్‌కు చెందిన ఓ డాక్టర్ నివాసముంటున్న అద్దె ఇంట్లో 2,900 కిలోల పేలుడు పదార్థాలు, మండే పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే మంగళవారం ఫరిదాబాద్‌లో విస్తృతమైన కూంబింగ్, సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన పేలుడులో 12 మంది మరణించిన ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో ఫరీదాబాద్‌లో బయటపడిన ఉగ్రవాద మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నాయని తేలింది. కాశ్మీరీ వైద్యుడు గత మూడున్నర సంవత్సరాలుగా నివసించిన అల్ ఫలా విశ్వవిద్యాలయంలో అక్కడి సిబ్బంది, వైద్యులను ప్రశ్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీ నుండి 45 కి.మీ దూరంలో ఉన్న హర్యానా ఫరీదాబాద్ జిల్లాలోని ధౌజ్‌లోని అల్ ఫలా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) గుర్తింపు పొందిన ప్రైవేట్ సంస్థ. ధౌజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో అనేక మంది పోలీసు సిబ్బంది సోదాలు నిర్వహిస్తున్నారు.రాష్ట్రంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని, పోలీసులు, ఇతర ఏజెన్సీలు ఉప్రమత్తంగా ఉన్నారని, పుకార్లు వ్యాప్తి చేయవద్దు, వాటిని నమ్మవద్దు అని హర్యానా పోలీసు చీఫ్ ఒపి సింగ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే ఫరీదాబాద్‌లో కొత్తగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఫరీదాబాద్‌లో దీపావళి క్రాకర్లు స్వాధీనం చేసుకున్నారని, అవి లుడు పదార్థాలు కావన్నారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తి లేదా వస్తువును గుర్తిస్తే అత్యవసర హెల్ప్‌లైన్ 112కు డయల్ చేయడం చేయాలని ప్రజలను కోరారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఒక మతాధికారి తన గదిని ఒక ఆటోరిక్షా డ్రైవర్‌కు అద్దెకు ఇచ్చాడని, ఆ తర్వాత గదిలో లగేజీ ఉంచినందుకు డాక్టర్ ముజమ్మిల్ గనైకి ఇచ్చాడని ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో వెల్లడైంది. ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మందిని సోమవారం అరెస్టు చేసిన విషయం విదితమే. జైషే మహహమ్మద్, అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్‌తో సంబంధం ఉన్న 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌ను వెలికితీయడంతో 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. హర్యానాలో హెచ్చరికలను పెంచడంలో భాగంగా సోమవారం సాయంత్రం నుండి పోలీసులు రాష్ట్ర సరిహద్దులలో, అలాగే అన్ని ప్రజా రవాణా, పార్కింగ్ ప్రాంతాలు, హోటళ్ళు, ధర్మశాలలలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు, అదే సమయంలో రద్దీగా ఉండే ప్రదేశాలు, ముఖ్యమైన సంస్థాపనల వద్ద నిఘా పెంచబడింది. రైల్వే స్టేషన్లలో కూడా భద్రతను పెంచారు. తనిఖీలు ముమ్మరం చేశారు.



## అమెరికా, చైనా సహా పేలుడును ఖండించిన ప్రపంచ దేశాలు



**బీజింగ్ / వాషింగ్టన్ :** ఢిల్లీ పేలుడులో ప్రాణనష్టంతో పాటు పలువురు గాయపడిన ఘటన పట్ల అమెరికా, చైనా, జపాన్, ఇజ్రాయెల్ సహ ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాధినేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'న్యూఢిల్లీలో జరిగిన భయంకరమైన పేలుడు బాధితులతో మా మనస్సులు ఉన్నాయి. పరిస్థితిని మేము నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నాము. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు మా హృదయపూర్వక సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాము' అని విదేశాంగ శాఖ దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల బ్యూరో సోమవారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో తెలిపింది. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడుపై చైనా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'ఈ సంఘటనతో మేము దిగ్భ్రాంతి చెందాము' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. బాధితులకు ఆయన సంతాపం తెలిపారు, మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి హృదయపూర్వక సానుభూతి తెలిపారు. జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి తన సోషల్ మీడియా ఖాతాలో 'పేలుడులో అనేక విలువైన ప్రాణాలు కోల్పోయారని తెలిసి తాను తీవ్ర విచారంలో ఉన్నాన'ని పోస్ట్ చేశారు. బాధితులకు,వారి కుటుంబ సభ్యులకు ఆమె తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన పేలుడు వార్తతో తాను బాధపడ్డానని, భారత ప్రజలకు శ్రీలంక సంఘీభావంగా నిలుస్తుందనిఅని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకే సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు.

భూటాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండు రోజుల అధికారిక పర్యటనను కొనసాగిస్తున్న తరుణంలో థింపులో బాధితుల కోసం రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ నేతృత్వంలో మృతులకు సంతాప సూచకంగా వేలాది మందితో ప్రార్థన సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో 'విషాదకరమైన ప్రాణనష్టం తనను తీవ్రంగా బాధపెట్టిందని' మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజు అన్నారు.ఈ క్లిష్ట సమయంలో మాల్దీవులు భారత ప్రజలకు, ప్రభుత్వానికి సంఘీభావంగా నిలుస్తున్నాయి అని ఆయన తన'ఎక్స్' ఖాతాలో అన్నారు.

ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ భారత ప్రజలకు, ము ఖ్యంగా పేలుడులో మరణించిన అమాయక బాధితుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్ భారతదేశంతో నిలుస్తుంది అని ఆయన 'ఎక్స్' లో పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా తన పార్టీ అవామీ లీగ్ సోషల్ మీడియాలో ఈ పేలుడును ఖండిస్తూ పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో, న్యూఢిల్లీలో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. పాకిస్తాన్‌లో పాతుకుపోయిన ఉగ్రవాద గ్రూపులు, బంగ్లాదేశ్ సహా దేశాలలోని నెట్‌వర్క్‌లోకి చొరబడి, ప్రాంతీయ శాంతి మరియు స్థిరత్వాన్ని దెబ్బతీసేందుకు భారతదేశంలో దాడులు చేస్తున్నాయని ఆమె అన్నారు.

నేపాల్ తాత్కాలిక ప్రధాన మంత్రి సుశీలా కార్కి మృతులకు, వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ దుఃఖ సమయంలో నేపాల్ భారతదేశానికి సంఘీభావంగా నిలుస్తోంది అని ఆమె అన్నారు.

ఢిల్లీలో జరిగిన ఈ దారుణ పేలుడు తనను తీవ్రంగా బాధపెట్టిందని ఐర్లాండ్ ఉప ప్రధాన మంత్రి సైమన్ హారిస్ అన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారందరికీ, గాయపడిన వారికి మరియు వారి కుటుంబాలకు మా మనస్సులు ఉన్నాయి. ఈ క్లిష్ట సమయంలో భారత ప్రజలకు మరియు ప్రభుత్వానికి తాము మా పూర్తి మద్దతు సంఘీభావాన్ని అందిస్తున్నాము అని ఆయన అన్నారు.

## బిహార్‌కు 'ఫలితం' అవసరం

జుమ్లాలు కాదు : తేజస్వీ యాదవ్



**పాట్నా :** బీహార్ ఎన్నికల మొదటి దశలో జరిగిన రికార్డ్ ఓటింగ్ ద్వారా ప్రజలు తమకు 'ఫలితం' కావాలని, 'జుమ్లా' (బోలు వాక్చాతుర్యం) కాదని ప్రత్యక్ష సందేశం ఇచ్చారని ఆర్‌జెడి నాయకుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ అన్నారు. మంగళవారం తుది విడత పోలింగ్ నేపథ్యంలో తేజస్వీ స్పందిస్తూ అనేక చోట్ల అధికారులు ఎన్నికల వేగాన్ని చాలా నెమ్మదింపజేస్తున్నారని, అయినా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఓటింగ్ క్యూల నుండి వెనక్కి తగ్గవద్దని ఆయన కోరారు. ఎన్‌డిఎ ప్రభుత్వం నుండి ప్రజలు పొందినదంతా హామీలు, నినాదాలు, వాక్చాతుర్యం, ఖాళీ వాగ్దానాలు మాత్రమేనని, బిహార్ ప్రజలు ఇకపై ఒక్క క్షణం కూడా వీటిని భరించలేరన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బిహార్ కోసం అభివృద్ధి విధానాన్ని రూపొందించడానికి ఇండియా కూటమి కృషి చేసిందని, ఇది స్వభావంతో కలుపుకొని, ప్రతి తరగతి, కులం, మతం, సమాజానికి అనుగుణంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పజలు తమను తప్పుదారి పట్టించడానికి ఉద్దేశించిన ఎన్‌డిఎ దుష్ట ఉపాయాలను తిప్పికొట్టరని భారత కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి యాదవ్ అన్నారు. 'నా కల మీ కల లాంటిదే. మీ బాధ నా బాధ లాంటిదే. మా లక్ష్యాలు ఒకటే, బిహార్ బయటి వ్యక్తులు నీటిని అర్థం చేసుకోలేరు' అని ఆయన అన్నారు. గత 20 ఏళ్లలో అధికారులు నిజమైన అభివృద్ధిని సాధించడంలో విఫలమయ్యారని, ఇప్పటికే చాలా ఆలస్యం అయిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోయిందని, నేరాలను తగ్గించలేకపోయిందని, నాణ్యమైన విద్యను నిర్ధారించలేకపోయిందని, సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణ కోసం మంచి ఆసుపత్రులను నిర్మించలేకపోయిందన్నారు. రైతులు వరదలతో సతమతమవుతున్నారని, వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటున్నారని, ప్రజలు ఇప్పటికీ ద్రవ్యోల్బణం గుప్పిట్లో ఉన్నారని తేజస్వీ ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన స్వేచ్ఛ నిరుద్యోగం, లంచం, అవినీతి, ద్రవ్యోల్బణం, అణచివేత, అన్యాయం, దోపిడీ, అసమానత వంటి సమస్యల నుండి విముక్తి పొందడమేనని ఆర్‌జెడి నాయకుడు నొక్కిచెప్పారు.

## ఢిల్లీలో వాయు కాలుష్యం...
## అమల్లోకి డేంజర్‌బెల్స్ ఆంక్షలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ లో వాయు కాలుష్యం డేంజర్‌బెల్స్ మోగిస్తోంది. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోం ది. మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. ఎక్యూఐ లెవెల్స్ 425కుపైనే నమోదయ్యాయి. వాయు కా లుష్యం క్షీణించడంతో ప్రభు త్వం అప్రమత్తమైంది. ఈ మేరకు ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాం తంలో జిఆర్‌ఎపి స్టేజ్3 ఆంక్షలు విధించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకా రం.. ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాంతంలో సోమవారం ఉదయం 362గా ఉన్న ఎక్యూఐ లెవెల్స్.. మంగళవారం ఉదయానికి 425గా నమోదయ్యాయి. దీం తో రాజధానిలో ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది. అనవసరమైన నిర్మాణాలు, కూల్చివేత ప నులపై నిషేధం విధించింది. వాహన కాలుష్యాన్ని అరికట్టడంలో సహాయపడటానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ కింద మూడో దశ ఆంక్షలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాంతంలో పెట్రోల్‌తో నడిచే బిఎస్3, బిఎస్4 డీజిల్ వాహనాలపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు విద్యా సంస్థలకు కూడా ప్రభుత్వం కీలక విజ్ఞప్తి చేసింది. హైబ్రిడ్ పద్ధతిని అవలంభించాలని సూచించింది. ఐదవత తరగతి వరకూ పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించింది.



ప్రజాపక్షం
బుధవారం, 12 నవంబరు

# దొంగ దెబ్బ తీశారు!

గాయపడిన విషజంతువు ఊరకే ఉండదన్న చందంగా భారతసైన్యం ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న ఉగ్రవాదులు ఢిల్లీలో దొంగదెబ్బ తీశారు. సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఎర్రకోట ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారులో ప్రేలుడు సర్వసాధారణ ప్రమాదం కాదని, టెర్రరిస్టు చర్య అనే నిర్ధారణకు మన ప్రభుత్వం వస్తోంది. ఈ కేసు దర్యాప్తును హోంమంత్రిత్వ శాఖ టెర్రరిస్టు నేరాల దర్యాప్తుకు ప్రత్యేకించిన నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజన్సీ(ఎన్ఐఎ)కి అప్పగించటం దీన్ని ధృవీకరిస్తుంది. హోంమంత్రి అమిత్‌షా మంగళవారం ఒకటికి రెండుసార్లు జాతీయ రాజధానిలో భద్రత పరిస్థితిని ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం రెడ్‌ఫోర్ట్ వద్ద కారు పేలుడు ఘటనపై దర్యాప్తును ఎన్ఐఎకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

సోమవారంనాటి ప్రేలుడు రాజధానినే కాదు – యావద్దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సంవత్సరం ఏప్రిల్ 22న జమ్మూ–కశ్మీర్‌లోని పహెల్‌గాంలో టెర్రరిస్టులు టూరిస్టులపై దాడిచేసి 26మంది అమాయక ప్రాణాలు బలిగొన్న ఘటన భారతీయుల హృదయాలను రగిలించిన తదుపరి, భారత సైన్యం మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ భూభాగంలో, దాని ఆక్రమిత కశ్మీర్‌లో ఆకస్మిక వైమానిక దాడులు చేసి టెర్రరిస్టుల మౌలిక వసతులు కొన్నింటిని ధ్వంసం చేయటం తెలిసిందే. ఆనాటినుంచి భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఆరోపణల పర్వం కొనసాగుతున్నా సీమాంతర ఉగ్రవాద చర్యలు – కశ్మీర్‌లో కొన్ని రొటీన్ ఘటనలు మినహా – దాదాపుగా లేవు. అయితే సీమాంతర ఉగ్రవాద సంస్థలు భారత్ నిఘాను ఆదమరిపించేందుకు స్థబ్దుగా ఉన్నట్లు కనిపించాయని, కాని లోలోపల ప్రతీకార దాడులకు వ్యూహాలు పన్నుతూనే ఉన్నాయని ఢిల్లీ ఘటన విదితం చేస్తున్నది. ట్రాఫిక్ గ్రీన్ సిగ్నల్ పడిన తదుపరి మోటారు వాహనాలు నెమ్మదిగా కదులుతుండగా భయంకరమైన ప్రేలుడు సంభవించింది. అనేక కార్లు, దుకాణాలు ధ్వంసమైనాయి. మరణించిన 12మంది మానవ దేహాలు ముక్కలై చెల్లాచెదురుగా పడ్డాయి. అనూహ్యమైన ఈ భయంకర విధ్వంసంతో బిత్తరపోయిన భద్రతా బలగాలు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలతోపాటు ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించాయి. ప్రేలుడు జరిగిన కారులో డ్రైవర్ సీటులో ఒక మృతదేహం ఛిద్రమై ఉన్నందున ఇది ఆత్మహత్యాపూర్వక ప్రేలేడు అని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఎవరా వ్యక్తి?

హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఒక కశ్మీరీ డాక్టర్ అద్దెకు తీసుకున్న గది నుంచి సోమవారం 2900 కిలోల ప్రేలుడు పదార్థాలు, ఇతర జ్వలిత పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు మంగళవారం విస్తృతంగా నిర్వహించిన సోదాల్లో ఒక వైట్‌కాలర్ టెర్రరిస్టుల మాడ్యూల్ గుట్టును బయటకు లాగారు. ముగ్గురు డాక్టర్లు సహా 8 మందిని అరెస్టు చేశారు. ఈ మాడ్యూల్‌కు ఎర్రకోట ఘటనకు సంబంధం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఫరీదాబాద్‌లో రెండు గదులు అద్దెకు తీసుకున్న డాక్టర్ ముజామ్మిల్ గవాయి (కశ్మీర్), డాక్టర్ షహీన్ (లక్నో)లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిరువురూ ఫరీదాబాద్‌లోని ప్రైవేటు యూనివర్శిటీ అల్ పాలహాలో పనిచేస్తున్నారు. శ్రీమతి షహీన్ జైష్–ఎ–అహ్మద్ మహిళా విభాగం జమాత్–ఉల్–మొమినత్‌కు నాయకత్వం వహిస్తూ మహిళలను రిక్రూట్ చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఆత్మాహుతితో కారు ప్రేలుడుకు కారణమైన వ్యక్తి డాక్టర్ ఉమర్ నబీ. ఇతనికి ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతనిది పుల్వామా(కశ్మీర్).

జైష్–ఎ–మొహమ్మద్, అన్సార్ ఘజ్వత్ – ఉల్ – హింద్‌లతో సంబంధం కలిగిన ఈ టెర్రర్ మాడ్యూల్ కశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లకు విస్తరించి ఉంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధక)చట్టం, ప్రేలుడు పదార్థాల చట్టం కింద పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. ఉమర్‌కు ఐ20 కారు ఇచ్చిన పుల్వామా జిల్లా వాసి తారిఖ్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.

కారణం ఏదైనా, ప్రభుత్వం ఇప్పటికిప్పుడు దీన్ని టెర్రరిస్టు చర్య అనకపోయినా, ఎన్ఐఎ దర్యాప్తును ఆదేశించటం ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నది. దేశ రాజధానిలో, భద్రత ఉన్నత స్థాయిలో ఉండే ఎర్రకోట ప్రాంతంలో ఈ విధ్వంసం సంభవించటం మోదీ ప్రభుత్వానికి, ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా కు అవమానకరం. దోషులను పట్టి చట్టప్రకారం శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో టెర్రరిస్టు చర్యలకు అంతంలేదని, తమ కఠిన వైఖరి కారణంగా టెర్రరిస్టులు అందుకు సాహసించటం లేదని గంభీర ప్రకటనలు చేసే ప్రభుత్వ నాయక ద్వయం ఇప్పుడు సంజాయిషీ ఇచ్చుకోవాలి. సీమాంతర ఉగ్రవాదానికి మూలమైన సమస్యల పరిష్కారానికి కృషిచేసినప్పుడే భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఎప్పటికైనా శాంతి నెలకొంటుంది. ఏ పక్షం నుండైనా ఆధిపత్య ప్రకటనలు, చర్యలు ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తూనే ఉంటాయని గమనించగలరు.

# ప్రైవేటు చేతుల్లోకి విద్యుత్

## విద్యుత్ (సవరణ) బిల్లు – 2025ను వ్యతిరేకిస్తున్న సకల వర్గాలు


జగ్‌మోహన్ థాకెన్

రైతు, వినియోగదారుల, ఉద్యోగ వ్యతిరేక బిల్లుగా పేర్కొంటున్న విద్యుత్ (సవరణ) బిల్లు–2025కు వ్యతిరేకంగా నిరసన గొంతులు పెద్ద ఎత్తున వెలువడటం ప్రారంభించాయి. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు, రైతులు, వినియోగదారులు దీనిని వ్యతిరేకించడానికి ఒకే దగ్గరకు రావడం ప్రారంభించారు.

నవంబర్ 3న ముంబైలో జరిగిన విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఒఇఇఇ) సమావేశంలో భారత ప్రభుత్వం తమ గొంతు వినకపోతే, దేశవ్యాప్తంగా 27 లక్షల విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ఉద్దేశించిన ఈ విద్యుత్ (సవరణ) బిల్లు 2025కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని నిర్ణయించారు.

విద్యుత్ (సవరణ) బిల్లు– 2025 కు వ్యతిరేకం గా దేశవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం చేసిన వ్యూహం ప్రకారం, విద్యుత్ ఉద్యోగులు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కార్మిక సంఘాలు, సాధారణ వినియోగదారుల నాయకులతో ఐక్య ఫ్రంట్ ఏర్పాటు అవుతుంది.

ప్రైవేటీకరణ, విద్యుత్ (సవరణ) బిల్లు –2025 కు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఇంజనీర్లను సమీకరించడానికి ఎన్‌సిసిఒఇఇఇ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉమ్మడి సమావేశాలు నవంబర్, డిసెంబర్ , జనవరి నెలల్లో అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తారు. 2026 జనవరి 30న 'చలో ఢిల్లీ'కి పిలుపు ఇస్తారు.

జాతీయ కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఆల్ హర్యానా పవర్ కార్పొరేషన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో నవంబర్ 5 న రోహ్‌తాక్‌లో విద్యుత్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. విద్యుత్ కార్పొరేషన్ యాజమాన్యం ఉద్యోగుల డిమాండ్లను విస్మరించి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తూ, నవంబర్ 26 న పంచ్‌కుల ప్రధాన కార్యాలయం ఎసిఎస్ పవర్ వద్ద నిరసన తెలియజేస్తామని ప్రకటించింది.

బిల్లును ఎన్‌సిసిఒఇఇఇ ఎందుకు వ్యతిరేకిస్తోంది? ఈ బిల్లు ప్రస్తుత పరిస్థితిని ఎలా ప్రభావితం చేస్తుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తాయి.

కన్వీనర్ సుదీప్ దత్తా నవంబర్ 4న విడుదల చేసిన ఒక ప్రకటనలో విద్యుత్ (సవరణ) బిల్లు 2025 దుష్ప్రభావాలను వివరిస్తూ , దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశంలోని మొత్తం ఇంధన రంగాన్ని ప్రైవేటీకరించాలని కోరుకుంటుందని ఎన్‌సిసిఒఇఇఇ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారని ఉటంకించారు. ప్రైవేటీకరణ తర్వాత, విద్యుత్ ధరలు భారీగా పెరిగి రైతులకు, సాధారణ వినియోగదారులకు అందుబాటులో ఉండవు.

ఎన్‌సిసిఒఇఇఇ నాయకులు శైలేంద్ర దుబే, మోహన్ శర్మ, కన్వీనర్ సుదీప్ దత్తా, కృష్ణ భోయార్, రత్నాకర్ రావు, సంజయ్ ఠాకూర్, లక్ష్మ ణ్ రాథోడ్ హాజరైన విలేకరుల సమావేశంలో బిల్లు ఎలా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందో వివరించారు.

సవరణ బిల్లులోని సెక్షన్లు 14, 42 , 43 ద్వారా విద్యుత్ సరఫరా చేయడానికి ప్రైవేట్ కంపెనీలకు ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకునే హక్కు ఇవ్వబడుతోంది. ప్రతిగా, వారు ప్రభుత్వ డిస్కామ్‌లకు నామమాత్రపు వీలింగ్ ఛార్జీలను మాత్రమే చెల్లిస్తారు. ఇది ప్రభుత్వ రంగంలో విద్యుత్ పంపిణీ ముగింపుకు నాంది పలుకుతుంది అని ఎన్‌సిసిఒఇఇఇ ఆందోళన చెందుతోంది.

ఈ నెట్‌వర్క్ నిర్వహణ, బలోపేతం పూర్తి బాధ్యత ప్రభుత్వ పంపిణీ సంస్థలదేనని కమిటీ వివరించింది. దీని ఆర్థిక భారం ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలపైనే పడుతుంది. అయితే ప్రైవేట్



కంపెనీలకు ఈ నెట్‌వర్క్ ద్వారా డబ్బు సంపాదించే స్వేచ్ఛ ఇవ్వబడుతుంది.

ఈ సవరణ బిల్లు ప్రకారం, ప్రైవేట్ కంపెనీలకు నిరంతర విద్యుత్ సరఫరా బాధ్యత ఉండదు. దీని ప్రతికూల పరిణామం ఏమిటంటే, ప్రైవేట్ కంపెనీలు లాభదాయకమైన పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వ కంపెనీ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తాయి. అయితే రైతులకు,పేద గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలదే. ఫలితంగా, ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థలు దివాళా తీస్తాయి. వాటి వద్ద విద్యుత్ కొనుగోలు చేయడానికి లేదా వారి ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా డబ్బు ఉండదు.

రాబోయే ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని తొలగించడానికి సవరణ బిల్లు సెక్షన్ 61(జి)ని సవరించాలని ప్రతిపాదిస్తున్నట్లు ఎన్‌సిసిఒఇఇఇ పేర్కొంది. దీనితో పాటు, విద్యుత్ ఛార్జీలు ఖర్చును ప్రతిబింబించేలా ఉండాలని బిల్లు ప్రతిపాదిస్తుంది. అంటే ఏ వినియోగదారునికి ఖర్చు కంటే తక్కువ ధరకు విద్యుత్ సరఫరా చేయకూడదు. అనగా, వ్యవసాయానికి 6.5 హార్స్‌పవర్ పంపు రోజుకు ఆరు గంటలు పనిచేస్తే రైతుకు నెలకు రూ.12,000 విద్యుత్ బిల్లు వస్తుంది. అలాగే, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వినియోగదారులకు విద్యుత్ ఛార్జి యూనిట్‌కు కనీసం రూ. 10–రూ.12గా పెరుగుతాయి. ఇంకా, వర్చువల్ పవర్ మార్కెట్లు , మార్కెట్ ఆధారిత వాణిజ్య వ్యవస్థలను ప్రోత్సహించాలని బిల్లు ప్రతిపాదిస్తుంది. ఇది దీర్ఘకాలిక ఒప్పందాలను అస్థిరపరుస్తుంది, విద్యుత్ ఖర్చును మరింత అస్థిరంగా మారుస్తుంది.

ఈ బిల్లు దేశ సమాఖ్య నిర్మాణానికి విరుద్ధమా? ప్రస్తుతం విద్యుత్తు రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో ఉమ్మడి జాబితాలో ఉందని, అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యుత్ విషయాలలో సమాన హక్కులు ఉన్నాయని ఎన్‌సిసిఒఇఇఇ హెచ్చరిస్తోంది. కానీ ఈ సవరణ బిల్లు ద్వారా, కేంద్ర ప్రభుత్వం విద్యుత్ విషయాలలో రాష్ట్రాల హక్కులను లాక్కుంటోంది. విద్యుత్ పంపిణీ, టారిఫ్ నిర్ణయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష జోక్యం చేసుకుంటుంది. ఇది సమాఖ్య నిర్మాణం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

రైతు సంఘాలు కూడా రంగంలోకి దిగాయి. హర్యానాలోని రోహతాక్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ ఇందర్‌జీత్ సింగ్ మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తారని ప్రకటించారు.

భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా దకొండ, పంజాబ్ కూడా విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. కిసాన్ యూనియన్ సమావేశంలో, కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ విద్యుత్ సవరణ బిల్లు–2025ను తీసుకువస్తోందని, ఇది విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణను అమలు చేయడానికి ఒక కుట్ర అని తీర్మానాన్ని ఆమోదించినట్లు రాష్ట్ర ప్రెస్ సెక్రటరీ అంగ్రేజ్ సింగ్ భదౌర్ మా ప్రతినిధికి తెలియజేశారు. కాబట్టి విద్యుత్ సవరణ బిల్లు 2025ను పూర్తి శక్తితో వ్యతిరేకిస్తామని తెలిపారు

సంయుక్త కిసాన్ మోర్చా నవంబర్ 26న చండీగఢ్ వైపు కవాతు చేయనుందని, ఈ ప్రదర్శన కోసం నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించడానికి నవంబర్ 17న చండీగఢ్‌లోని కిసాన్ భవన్‌లో సమావేశం నిర్వహించబడుతుందని భదౌర్ పేర్కొన్నారు. ఆ మార్చ్ ప్రధాన డిమాండ్లలో విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలనే డిమాండ్ ఉంటుంది.

ఇటువంటి సున్నితమైన అంశాలపై నిర్ణయం తీసుకునే సమయంలో ప్రభుత్వం మొండిగా, కఠినంగా వ్యవహరించకూడదు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు రైతులు చేసిన ఆందోళనలో 700 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారని,చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చిందని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి.

(ఐపిఎ సర్వీస్)

# 'జి శాట్–7ఆర్'తో నావికాదళానికి కొత్త శక్తి

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చరిత్రలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 2025 నవంబర్ 2వ తేదీన, దేశీయంగా అభివృద్ధి చేసిన శక్తివంతమైన లాంచ్ వెహికల్ మార్క్3 రాకెట్ ద్వారా, భారత నావికాదళానికి చెందిన అత్యంత అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్7ఆర్ (సిఎంఎస్ 03) విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టబడింది. ఈ విజయం ఇస్రోకు గొప్ప సాంకేతిక మైలురాయి మాత్రమే కాదు, దేశ రక్షణ సామర్థ్యాలను ఇది గణనీయంగా పెంపొందించింది. అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది తిరుగులేని నిదర్శనం.

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి సాయంత్రం 5:26 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన ఎల్.వి.ఎం.3 రాకెట్కు 'బాహుబలి' అనే పేరు ఉంది. సుమారు 4,400 కిలోల బరువున్న జీశాట్7ఆర్ ఉపగ్రహాన్ని ఈ రాకెట్ జియోసింక్రనస్ బదిలీ కక్ష్యలోకి (జిటిఒ) విజయవంతంగా చేర్చింది. భారత్ గడ్డపై నుంచి ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాల్లో ఇంత బరువైనది ఇదే మొదటిసారి. నిజానికి నాలుగు టన్నుల కంటే ఎక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించడానికి గతంలో విదేశీ సంస్థలపై ఆధారపడవలసి వచ్చేది. ఇప్పుడు ఎల్.వి.ఎం.3 విజయం ద్వారా ఆ సాంకేతిక అవరోధాన్ని ఇస్రో పూర్తిగా తొలగించింది.

ఈ మిషన్‌లో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాక, అంతకు మించిన ఒక ముఖ్యమైన సాంకేతిక ప్రయోగం కూడా జరిగింది. జీశాట్7ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత, ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్లోని సి25 క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ఇంజిన్ను అంతరిక్షంలో మళ్లీ మండించి చూపారు. ఈ సామర్థ్యం రాకెట్ యొక్క కార్యాచరణ సౌలభ్యాన్ని అసాధారణంగా పెంచుతుంది. భవిష్యత్తులో ఈ రాకెట్ ఒకేసారి అనేక ఉపగ్రహాలను వేర్వేరు కక్ష్యల్లోకి ఖచ్చితంగా చేర్చడానికి, అలాగే గగన్యాన్ వంటి మానవ అంతరిక్ష యాత్రలకు అవసరమైన సంక్లిష్టమైన విన్యాసాలను నిర్వహించడానికి ఈ సాంకేతికత పునాదిగా నిలుస్తుంది.

**నావికాదళానికి 'వ్యూహాత్మక వరం'**

జీశాట్7ఆర్ ఉపగ్రహం భారత నావికాదళానికి ఒక వ్యూహాత్మక వరం. ఇది 2013 నుంచి సేవలందిస్తున్న పాత జీశాట్7 (రుక్మిణి) ఉపగ్రహం స్థానాన్ని భర్తీ చేస్తుంది. పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసి, అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం, నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, తీర ప్రాంత కమాండ్ కేంద్రాల మధ్య నిరంతరాయంగా, సురక్షితమైన కమ్యూనికేషన్ అనుసంధానాన్ని అందిస్తుంది. ఇది వాయిస్, డేటా, మరియు రియల్‌టైమ్ వీడియోలను సైతం అత్యధిక వేగంతో పంపగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.



శత్రు దేశాల నుండి వచ్చే ఎలక్ట్రానిక్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జీశాట్7 ఆర్ అత్యాధునిక రక్షణ లక్షణాలను కలిగి ఉంది. ఇందులో ప్రధానంగా జామింగ్ను నిరోధించే సామర్థ్యాలు మరియు ఫ్రీక్వెన్సీ హాపింగ్ సాంకేతికత ఉన్నాయి. ఈ ప్రత్యేకతలు యుద్ధ వాతావరణంలో సైతం నావికాదళ కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా, భద్రంగా ఉండేలా చూస్తాయి. ఈ ఉపగ్రహం యూహెచ్ఎఫ్, ఎస్, సి, కేయూ, కేఏ వంటి బహుళబ్యాండ్లలో పనిచేస్తుంది.

**హిందూ మహాసముద్రంలో పటిష్టమైన పర్యవేక్షణ**

ఈ ఉపగ్రహం హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా పటిష్టమైన టెలికమ్యూనికేషన్ కవరేజీని అందిస్తుంది. ఈ కవరేజీ ఆగ్నేయాసియా వైపు మరియు తూర్పు ఆఫ్రికా తీరం వైపు కూడా విస్తరించి, తీరం నుండి 2,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న నావికాదళ ఆస్తులకు సైతం సేవలందిస్తుంది. జీశాట్7ఆర్ అంది ంచే ఈ మెరుగైన కమ్యూనికేషన్ అనుసంధానం ద్వారా, నావికాదళం యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, గగనతల నిఘా పరికరాలన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌లోకి తీసుకురాగలదు. ఫలితంగా, నిజ సమయ పరిస్థితులపై అవగాహన పెరిగి వ్యూహాత్మకంగా కీలకమైన ఇండోపసిఫిక్ జలాల్లో నావికాదళం సమన్వయంతో కూడిన కార్యకలాపాలను వేగంగా నిర్వహించడానికి వీలవుతుంది. అందుకే ఈ ఉపగ్రహాన్ని నావికాదళానికి శక్తి గుణకం అని వ్యవహరిస్తున్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, సంక్లిష్టమైన భద్రతా సవాళ్ల మధ్య, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ సముద్ర ప్రయోజనాలను కాపాడాలనే భారత నావికాదళ సంకల్పాన్ని జీశాట్7ఆర్ ప్రతిబింబిస్తోంది. ఈ ఉపగ్రహం పూర్తిగా దేశీయంగా తయారవ్వడం మరియు దేశీయ రాకెట్ ద్వారా ప్రయోగించడం వలన, అత్యవసర సమయాల్లో విదేశీ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడాల్సిన అవసరం తప్పింది. ఇది భారత సార్వభౌమత్వానికి, భద్రతకు అత్యంత కీలకమైన అంశం.

డి.జె.మోహన రావు
8247045230

# డిజిటల్ మోసాలకు.. అప్రమత్తతే ఆయుధం




'సైబర్ నేరాలు రూపాంతరం చెంది 'డిజిటల్ అరెస్ట్' పేరుతో దోపిడీ పతాక స్థాయికి చేరింది. ఎంతగా అంటే? ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, చివరికి బ్యాంకు అధికారులు సైతం వారి వలలో పడి డబ్బులు కోల్పోయి విలవిలాడుతున్నారు.

నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, మానసికంగా బెదిరిస్తూ బురిడీ కొడుతున్నారు. ఈ విధంగా డిజిటల్ అరెస్టుల ఘటనలు నానాటికి పెరుగుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో సైబర్ నేరాలపై ప్రజాచైతన్యం, అవగాహన పెరగాలి. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్స్‌తో అరెస్టులు చేయరని, డబ్బులు బదిలీ చేయమని బెదిరించరని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపాలి.అప్రమత్తతే ప్రజా ఆయుధం. మన దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలు డిజిటల్ అరెస్టుల మోసాల తీవ్రత పరిశీలిద్దాం..ఆధునిక టెక్నాలజీ మూలంగా డిజిటల్ యుగం మన జీవితంలో సౌలభ్యాన్ని తెచ్చింది. కానీ అదే సాంకేతికత ఇప్పుడు మోసాలకు, ఆర్థిక నష్టాలకు కారణమవుతోంది. వాస్తవంగా ఆధునిక టెక్నాలజీ సామాన్యుడి ప్రగతికి, జీవన విధానం మెరుగుదలకు తోడ్పడితేనే దానికి సార్థకత. ప్రస్తుతం దీనికి విరుద్ధంగా టెక్నాలజీని వాడుకొంటూ నేరాలకు పాల్పడుతున్నారు. అలా సైబర్ నేరాల కొత్త రూపమే డిజిటల్ అరెస్టులు.మనసులనూ, మనీని కూడా కబళిస్తోంది. ఇలాంటి మోసాలనుంచి మనం రక్షించుకునే ఆయుధం ఒక్కటే...అప్రమత్తత.

**మోసాల రూపం, విస్తృతి, ప్రభావం.**

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు భయానక స్థాయికి చేరాయి. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఖాకీ బట్టలు వేసుకొని వీడియో కాల్స్ చేస్తూ, మీరు ఉగ్రవాదులతో సంబంధం కలిగి ఉన్నారు, మాదకద్రవ్యాల కేసులో పేరు వచ్చింది, మనీలాండరింగ్లో పాలుపంచుకున్నారు అంటూ భయపెట్టే ముఠాలు పౌరుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టులకు డిజిటల్ అరెస్టులపై 2022లో డిజిటల్ అరెస్ట్ మోసాలపై 39,925 ఫిర్యాదులు నమోదైతే, 2024లో అలాంటివి 1.23 లక్షలకు పెరిగాయి. బాధితులు కోల్పోయిన సొమ్ము విలువ రెండు సంవత్సరాల్లో 21 రెట్లు పెరిగింది. ఈ ఏడాది మొదటి రెండు నెలల్లోనే 17,718 కేసులు నమోదవడం చూస్తుంటే, నేరగాళ్ల ఎంతగా చెలరేగి పోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బ్యాంక్ అధికారులు కూడా ఈ వలలో చిక్కుతున్నారు. నకిలీ గుర్తింపులు, ఫోర్జరీ పత్రాలు, వాయిస్ క్లోనింగ్, సాంకేతిక నైపుణ్యంతో ఈ ముఠాలు నేరాలను కొత్త రూపంలో తీవ్ర స్థాయికి తీసుకెళ్తున్నాయి. బాధితులు ఆర్థిక నష్టంతో పాటు మానసికంగా కూడా కృంగిపోతున్నారు.

ప్రత్యేకించి పెన్షనర్లు పెద్దగా ప్రభావితమవుతున్నారు. లైఫ్ సర్టిఫికెట్, పింఛన్ వెరిఫికేషన్ పేరిట వివరాలు సేకరించి మోసాలు చేస్తున్నారు. టెక్నాలజీ అవగాహన తక్కువగా ఉండటంతో వారు సులభంగా వలలో పడుతున్నారు.

**అవగాహనే ఆయుధం, కట్టడే కర్తవ్యం**

ఈ డిజిటల్ మోసాలపై ప్రధాన ఆయుధం అప్రమత్తత. ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు ముగ్గురి సమన్వయం ద్వారానే మూలాలు గుర్తించి దీన్ని సమూలంగా అరికట్టవచ్చు.

టివి, రేడియో, సోషల్ మీడియా ద్వారా డిజిటల్ అరెస్టులు చట్టంలో లేవు అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్, వీడియో కాల్స్, OTPలు, ఆధార్ వివరాలు పంచకూడదు. బ్యాంకులు మరియు ప్రభుత్వాల సమన్వయంతో బ్యాంకులు తమ వినియోగదారులకు కాలానుగుణంగా సైబర్ సేఫ్టీ అలర్ట్స్ పంపాలి. ప్రభుత్వ సంస్థలు ప్రజా స్థాయిలో సైబర్ అవగాహన శిబిరాలు నిర్వహించాలి.

**చట్టపరమైన చర్యలు..**

సైబర్ మోసగాళ్లపై కఠినమైన శిక్షలు విధిస్తూ, వారి ఆర్థిక లావాదేవీలను తక్షణం ఫ్రీజ్ చేసే చట్టపరమైన విధానాలు రూపొందించాలి. సిబిఐ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు కలిసి విభిన్న రాష్ట్రాల్లో జరిగిన కేసులను సమగ్రంగా దర్యాప్తు చేయాలి. పౌరులు మోసానికి గురైన వెంటనే డయల్ 1930 లేదా 100 కు సమాచారం ఇవ్వాలి. గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయకూడదు. వాట్సాప్ లేదా మెయిల్ ద్వారా వచ్చిన APK ఫైళ్లను తెరవకూడదు. సాంకేతిక సదుపాయా లు ఎంత పెరిగినా, మన జాగ్రత్తే చివరి రక్షాకవచం. డిజిటల్ అప్రమత్తత అనే ఈ సంస్కృతి ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి.

సైబర్ నేరాలు యుద్ధం మాదిరిగా మారుతున్నాయి. కానీ ఆయుధం అవసరం లేదు. అవగాహన, అప్రమత్తత, ధైర్యం చాలు.

ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం కాపాడుకుంటే, ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తే, ఈ మోసాలు ముగుస్తాయి.

డిజిటల్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ.

మేకిరి దామోదర్
9573666650

# మానవ ఆరోగ్య రక్షణ – టీకాల పాత్ర

ఇమ్యూనైజేషన్ అనేది శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంపొందించే శాస్త్రీయ విధానం. టీకాలు మానవ ఆరోగ్యానికి రక్షణ కల్పించే అత్యంత కీలకమైన వైద్య ఆవిష్కరణలు. ఇవి కోట్లాది ప్రాణాలను రక్షించడమే కాకుండా, ప్రపంచ వ్యాధి భారాన్ని గణనీయంగా తగ్గించాయి.

1796లో ఎడ్వర్డ్ జెన్నర్ స్మాల్ పాక్స్ టీకా ఆవిష్కరణతో వైద్య చరిత్ర కొత్త దశను ప్రారంభించింది. ఆ తర్వాత లూయీ పాశ్చర్ రేబీస్ టీకా, జోనస్ సాల్క్ పోలియో టీకా రూపొందించడం ద్వారా టీకా శాస్త్రం వేగంగా అభివృద్ధి చెందింది.

1974లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రారంభించిన ప్రోగ్రాం ఆన్ ఇమ్యూనైజేషన్ (EPI) ప్రపంచంలోని ప్రతి శిశువుకూ ఉచిత టీకా అందేలా మార్గం సుగమం చేసింది. ఈ శాస్త్రీయ విప్లవంవల్ల స్మాల్ పాక్స్ (మశూచి) ప్రపంచం నుండి పూర్తిగా నిర్మూలించబడింది, పోలియో దాదాపు అంతరించి పోయింది. ఇవి మానవజాతి సాధించిన అద్భుత విజయాలు.

2020లో ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్19 మహమ్మారి టీకాల పరిశోధనలో అత్యంత వేగవంతమైన మార్పును తెచ్చింది. కేవలం ఒక సంవత్సరంలోనే ఫైజర్, మోడరన్, ఆస్ట్రేజన్కా, భారత్ బయోటెక్ వంటి సంస్థలు సురక్షితమైన టీకాలను అభివృద్ధి చేశాయి. టీకాలు ప్రధానంగా టాక్సాయిడ్, వైరల్ వెక్టార్, కాంజు గేటెడ్, ప్రోటీన్ ఆధారితమైనవి. ముఖ్యంగా ఎమ్మార్ఎన్ ఏ (MRNA) టెక్నాలజీ ఆధారంగా తయారైన టీకాలు వైద్య శాస్త్రంలో కొత్త యుగానికి నాంది పలికాయి.

WHO, GAVI, COVAX వంటి అంతర్జాతీయ సంస్థలు పేద దేశాలకు టీకాలు అందించడంలో కీలక పాత్ర పోషించాయి. కోట్లాదిమంది ప్రాణాలు రక్షించబడ్డాయి. అయితే టీకా పంపిణీలో ధనిక దేశాలు ముందంజలో ఉండగా పేద దేశాలు వెనుకబడ్డాయి. ఈ అసమానత ప్రపంచ ఆరోగ్య సమానత్వం అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

టీకా తయారీ ఒక క్రమబద్ధమైన శాస్త్రీయ ప్రక్రియ. మొదట వైరస్ లేదా బ్యాక్టీరియా భాగాన్ని (యాంటిజెన్) గుర్తించి, ప్రయోగశాలలో నమూనాలు తయారు చేస్తారు. ప్రీ క్లినికల్ దశలో జంతువులపై పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత మానవులపై మూడు క్లినికల్ దశలు (ఫేజ్ I, II, III) నిర్వహిస్తారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నప్పుడు ప్రభుత్వ అనుమతి తో టీకా విడుదల అవుతుంది.

టీకా శరీరంలోకి చేరినప్పుడు అది వ్యాధికారకాన్ని అనుకరించేలా పనిచేస్తుంది. ఇమ్యూన్ సిస్టమ్ దానిని విదేశీ పదార్థంగా గుర్తించి ప్రతిరక్ష కణాలు (ఏంటిబాడీస్) తయారు చేస్తుంది.

బి కణాలు, టి కణాలు, మెమరీ సెల్స్ కలిసి భవిష్యత్తులో అదే వైరస్ దాడి చేసినప్పుడు శరీరాన్ని వేగంగా రక్షిస్తాయి.

ఫలితంగా వ్యాధి రాకముందే నిరోధక శక్తి ఏర్పడుతుంది. కొన్ని టీకాలు దీర్ఘకాల రక్షణ ఇస్తే, కొన్ని నిర్దిష్ట కాలానికి బూస్టర్ మోతాదులు అవసరం అవుతాయి

**సవాళ్లు**

ప్రస్తుతం డెంగ్యూ, నిపా, జికా, మంకీపాక్స్ వంటి వైరల్ వ్యాధులు మళ్లీ ముప్పుగా మారుతున్నాయి. వాతావరణ మార్పులు, కాలుష్యం, మరియు గ్లోబల్ మైగ్రేషన్ కారణంగా కొత్త వైరస్లు సులభంగా వ్యాపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 మిలియన్‌ల మంది గాలి కాలుష్యం వల్ల మరణిస్తున్నారు, ఇది రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తోంది.

ఈ నేపథ్యంలో టీకాలు, పర్యావరణ సంరక్షణ రెండూ మానవ ఆరోగ్యానికి అత్యంత కీలకం. ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి తగిన నిధులు కేటాయించి, పేద ప్రజలకు ఉచిత టీకాలు అందించాలి.

శాస్త్రవేత్తలు AI ఆధారిత వైరస్ గుర్తింపు, నూతన టీకా సాంకేతికతలు అభివృద్ధి చేయాలి.

ప్రతి పౌరుడు సమయానికి టీకాలు తీసుకోవడం, ఆరోగ్య నియమాలు పాటించడం, ప్రజా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజ ఆరోగ్య రక్షణలో భాగస్వామి కావాలి.

విజ్ఞాన శాస్త్రం మనకు ఆయుధం వంటిది. టీకాలు కేవలం వైద్య ఆవిష్కరణలు కావు; అవి మానవజాతి రక్షణకు శాస్త్రం అందించిన శాశ్వత కవచం.

శాస్త్రవేత్తల కృషి, ప్రభుత్వ విధానాలు, మరియు ప్రజల అవగాహన, సహకారం కలిసినప్పుడే ప్రపంచం ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయగలదు.

గిలకత్తుల వెంకటరమణ
9866878769

## సూర్యాపేటలో కల్లుగీత కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభ

ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈ నెల 28,29,30వ తేదీలలో సూర్యాపేట పట్టణంలో జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడుగ్రామంలో గల సంఘం కార్యాలయంలో ముఖ్యమైన సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4వేలు, ఎక్స్గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్గ్రేషియా రూ.12కోట్ల60లక్షలు వెంటనే విడుదల చేయాలన్నారు. చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి 560 జీవో ప్రకారం 5ఎకరాల భూమితో పాటు పల్లె గీత కార్మికులందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన డిఇఒ చైతన్య జైని

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా విద్యాశాఖాధికారిణిగా నియామకమైన చైతన్య జైని బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం చైతన్య జైని బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఈవోకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ఠ నిఘా

తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ఠ నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నెల వారి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి అవి పనిచేస్తున్నాయా లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్ట్‌ల వారి వివరాల గురించి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. నిరంతర నిఘాతో పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి అంతస్తు ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చేపడుతున్న పనులను పరిశీలించారు. డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎంఎ రాజు, ఎన్నికల డిటి అన్సారీ, ఆర్‌అండ్‌బి ఏఈ లలిత, అధికారులు పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీగా తరలి రావాలి

సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి




**ప్రజాపక్షం/చింతకాని:** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు ప్రతి ఒక్కరూ తరలి రావాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు కోరారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ప్రచారంలో భాగంగా మంగళవారం చింతకాని మండలంలోని మత్కేపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో వాల్ పెయింటింగ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో జరగటం చాలా అదృష్టం అన్నారు. గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని ఈ సభకు వచ్చే విధంగా ఉత్తేజపరచాలన్నారు. కవాతు దళాలను, మహిళలను, రెడ్ షర్ట్ వాలంటర్లను చింతకాని మండలం నుంచి భారీగా తరలించాలన్నారు. పార్టీ వందేళ్ల పండుగను ప్రతి ఇంటి పండుగగా భావించి , గ్రామాల్లో వాల్‌రైటింగ్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. చింతకాని మండలం నుంచి 5వేలకు తగ్గకుండా తరలి వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శాఖ కార్యదర్శి బండి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మౌలానా అబుల్ కలా ఆజాద్ జయంతి వేడుకలను ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా లు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని మేయర్ తెలిపారు. సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు బిజి క్లైమెంట్, రాపర్తి శరత్, ఏసిపి వసుంధర, ఉద్యానవన అధికారిణి రాధిక, ఇటికాల భాస్కర్, సుజాత, ప్రసన్నకృష్ణ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు వెంకటసాయి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** అండర్19 రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి, జా తీయ స్థాయి పోటీలకు బోదులబండ కు చెందిన గండారపు వెంకటసాయి ఎంపికైయ్యారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామానికి చెందిన గండారపు వెంకటసాయి అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయి లో జరిగిన పోటీలలో ప్రతిభ చూపారు. ఆరు కిలోమీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో రెండు రజిత పథకాలను గెలుచుకున్నాడు. హర్యానా రాష్ట్రంలో, జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు స్థానికులు గుండు మహేష్, అనంతు రవి, కాసాని విగ్నేష్, చింతలపాటి లెనిన్ .తదితరులు అభినందించారు.

## ఘనంగా యువజన ఉత్సవాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్ రెడ్డి తెలిపారు. 29వ జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీభక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించారు. జానపద నృత్యం, గ్రూప్ ఫోక్ డ్యాన్స్, జానపద గేయాలు, గ్రూప్ ఫోక్ సాంగ్, వ్యాసరచన, పోస్టర్ తయారీ, వక్తృత్వ పోటీలు, కవిత్వం, ఇన్నోవేషన్ మొదలగు అంశాలలో ప్రదర్శనలు, పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయి కళాకారులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలలో 850 మంది యువ కళాకారులు పాల్గొన్నారన్నారుఅసిస్టెంట్ మేనేజర్ ఆర్. ఉదయ్‌కుమార్, న్యాయ నిర్ణేతలు జాన్ మాలతి నాయుడు, ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ లెక్చరర్లు కె. రవికుమార్, మధు,వీరన్న, యువజన సంఘాల సమితి అధ్యక్షులు ఉమాశంకర్, అధికారులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం తమను రెన్యువల్ చేయాలని అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబుకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపకులు మోత్కూరి రామకృష్ణ మాట్లాడుతూ 494 మంది అతిథి అధ్యాపక పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతిచ్చిందని ఈ పోస్టులకు గతంలో పనిచేసిన అతిథి అధ్యాపకులను సీనియారిటీ ప్రకారం నియమించాలని కోరారు. రాబోయే వార్షిక పరీక్షల నేపథ్యంలో పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే అతిథి అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రజని, వెంకటకృష్ణ, ప్రమీల, సన, స్నేహమాల ఉన్నారు.

# మెరుగైన వైద్య సేవలకు ఆధునీకరణ అవసరం

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

అందుతున్న సేవలపై సంతృప్తి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఇంకా మంచి వైద్య సే వలు రోగులకు అందాలంటే ఆధునీకరణ ఎం తైనా అవసరం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పా టిల్ అభిప్రాయపడ్డారు. మంగళవారం భద్రాచ లం ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆధునీకరణ చర్యల ద్వారా రోగులకు మరిన్ని మేలైన సేవలు అందించే అవకాశం ఉం దని గుర్తించిన ఆయన సాంకేతిక పరిజ్ఞానం, వై ద్య పరికరాల అవసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు ఆపరేషన్ థియేటర్ భాగాన్ని పరిశీలి ంచిన ఆయన బలోపేతానికి, సౌకర్యాలపై ఆ స్పత్రి సూపరింటెండెంట్ డా. రామకృష్ణ, ఆస్పత్రి వై ద్యులు ,సిబ్బందితో చర్చించారు. మరమ్మత్తులు వెంటనే చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్ర సూతి ఆస్పత్రి విభాగం, శిశు సంరక్షణ వి భా గం, అత్యవసర వైద్యవిభాగం వార్డుల్లోకలియ తి రిగారు. పరిశుభ్రత,వైద్య సదుపాయాలు, రోగుల సేవా ప్రమాణాలను పరిశీలించిన ఆయన స ంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ ఆ స్పత్రి ఆవరణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, పారిశుధ్య కార్మికులు తప్పకుండా యూ నిఫాం ధరించాలని, అవసరమైన వారికి యూనిఫామ్‌లు అందిస్తామని చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వైద్య సిబ్బంది కొరతను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జిల్లా ప్రధాన ఆస్పత్రి నుండి తాత్కాలిక నర్సులను నియమించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖాళీగా ఉన్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల సిఎంఆర్ బృందం ఆస్పత్రిని సందర్శించి సేవలను ప్రశంసించారని, ఇందుకోసం సిబ్బంది కృషి చేయడం అభినందనీయం అన్నారు. ఏరియా ఆస్పత్రి ఆదర్శంగా నిలవాలని, అన్నివిభాగాలు సమన్వయంతో ఆధునీకరణ దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. డిసిహెచ్ఎస్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ, వైద్యులు, నర్సింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ మట్టి వాసనకు ప్రతిబింబం అందెశ్రీ కవిత్వం

టియుడబ్ల్యూజె (ఐజెయు) ప్రధాన కార్యదర్శి రాంనారాయణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ మట్టి వాసనకు ప్రతిభింభం అందెశ్రీ కవిత్వమని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రచయిత, కాలమిస్ట్ అందెశ్రీ సంతాప సభ మంగళవారం నిర్వహించారు. అందెశ్రీ చిత్ర పటానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో రాంనారాయణ మాట్లాడుతూ నిరుపేద, నిరాక్షరాస్యుడైన అందెశ్రీ గొర్రెల కాపరి నుండి ప్రజాకవిగా ఎదిగారన్నారు. తన పాటలతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాంక్షను రగిల్చి లక్షలాది మం దిని ఉద్యమ చైతన్యం వైపు మళ్లించారన్నారు. ఆయన రాసిన జయ జయహే తెలంగాణ గీతం రాష్ట్ర గీతమైందన్నారు. జీవితం, సాహిత్యం అందరికీ ఆదర్శనీయమన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్, నగర కోశాధికారి ఏలూరి వేణు, ప్రెస్ క్లబ్ కోశాధికారి కళ్యాణ్, ఉపాధ్యక్షులు గండారపు రామారావు, సహాయ కార్యదర్శి శివాజీ, నాయకులు వెంకటేశ్వర్లు, అశోక్ పాల్గొన్నారు.

## సిపిఐ(ఎం) నుండి సిపిఐలోకి 35 కుటుంబాలు చేరిక

కండువా కప్పి ఆహ్వానించిన కల్లూరి

**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని సిపిఐఎం పార్టీకి చెందిన 35 కుటుంబాల వారు బుధవారం సిపిఐ పార్టీలో చేరారు. చేరిన వారికి సిపిఐ డివిజన్ కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు ఎర్రకుండువాలు కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన పెద్ద ఎత్తున 35 కుటుంబాల వారు సిపిఎం నుండి సిపిఐలో చేరడం అభినందనీయం అన్నారు. ఖమ్మంలో 5 లక్షల మందితో ఘనంగా జరుగనున్నాయని, 40 దేశాల నుండి ప్రతినిధులు వస్తున్నారని చెప్పారు. డిసెంబర్ 26న జరిగే ఉత్సవాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాల రావు, చల్లా లక్ష్మీ నారాయణ, పార్టీలో వానరాశిసారయ్య, జంపయ్య, ఆధ్వర్యంలో సమ్మక్క, భద్రమ్మ, వెంకన్న, రాంబాయమ్మ, బాబు, సారమ్మ, ధనలక్ష్మి , వెంకటయ్య, సమ్మక్క, రాంబాబు, పద్మ, పెద్దిరాజు, సుశీల, సాయిలు, పోచ మ్మ,రాజు, లక్ష్మి , బాబు రచిత, సమ్మక్క, నర్సింహా, భా గ్యలక్ష్మి , కృష్ణ, రమేష్, అనూష, అచ్చయ్య, ముత్యాలు, మల్లేష్, వీరబాబు, జ్యోతి, రాములు, ఎల్లమ్మ, రవి, సరిత, నాగేష్, కళ్యాణి, మణెమ్మ, సాయమ్మ,శివాజీ, సమ్మయ్య తదితరులు చేరారు.

# పత్తికొనుగోలు వేగవంతం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రభుత్వ ఆదేశాల కనుగనంగా పత్తికొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి,పొన్నెకల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ ఎంట్రీ, గేట్ ఎంట్రీపాస్, పంట నమోదును పరిశీలించారు. అలాగే రైతులు తెచ్చిన పత్తి తేమ శాతంను యంత్రంతో పరిశీలించి,రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు...రైతుల మద్దతు ధరకు పత్తి అమ్ముకునేలా చర్యలు తీసుకున్నామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. చలిమంచు దృష్ట్యా తేమశాతం కొంతమేర వెసులుబాటు ఇవ్వాలని, అకాల వర్షాల వలన కొంత పంట దెబ్బతిన్నందున గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పత్తి పంటను ఆరబెట్టుకుని 12శాతం నిర్ణీత తేమశాతం వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువెళ్ళాలన్నారు. తెచ్చుకున్న పంటను అదేరోజు కొనుగోలు చేసి రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రధానంగా పత్తి రైతులు కపాస్..కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పత్తి అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు. తహశీల్దార్ పిలి రాంప్రసాద్, మార్కెట్ కార్యదర్శి వీరాంజనేయులు, వరప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు పాల్వంచలో సిపిఐ జిల్లా స్థాయి సమావేశం

జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం పాల్వంచలోని కేఎల్ఆర్ డిగ్రీ కాలేజీ రోడ్‌లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. జిల్లా నిర్మాణ బాధ్యులు,పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు హాజరవుతున్నట్లు చెప్పారు. సిపిఐ వందేళ్ల వేడుకలు, రాష్ట్ర, జిల్లా ప్రచార జాతాలు, పైలాన్ల ఏర్పాటు, జ న సమీకర ణ, జన సేవాదళ్ క్యాంపుల నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సభ్యత్వం పునరుద్దరణపై చర్చించనున్నట్లు తెలిపారు. సకాలంలో హాజరు కావాలని పాషా కోరారు.



## కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండలంలో కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్నటువంటి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనంతోగు గ్రామ పంచాయితీ, తిర్లాపురం గ్రామం నుండి పాయం సూరయ్య ఆధ్వర్యంలో 70 కుటుంబాలు, రామానుజగూడెం పంచాయితీ, రామానుజగూడెం గ్రామం, ఇప్పనపల్లి గ్రామం తునికిబండ గ్రామాల నుండి మోకల శేఖర్ ఆధ్వర్యంలో 80 కుటుంబాలు పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో మొత్తం 150 వివిధ పార్టీలకు చెందిన కుటుంబాల చేరిక కార్యక్రమంలో పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్నటువంటి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 150 కుటుంబాలు చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాయం రామనర్సయ్య, ప్రచార కమి టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్, కాం గ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు మోకాల శేఖర్, ఎస్సీ సె ల్ అధ్యక్షులు నులకతాటి శ్రీనివాస్, ఎంపీపీ పెండెకట్ల పా పారావు, ఎండి హతర్, బుర్ర వెంకన్న, బూ త్ కమిటీ సభ్యులు కరకపల్లి సుధాకర్, జీ వసంతరావు, తాళ్లపల్లి వెం కన్న, ఏ అగ్ని చం ద, రాంబాబు, కొరస నాగేశ్వరరావు, పాయం సూరయ్య, గొగ్గేల కాంత్, మైనార్టీ సెల్ ఎస్ డి సాబీర్, బీసీ సెల్ అధ్యక్షు లు తాళ్లపల్లి చి రంజీవి, జీ భాస్కర్, యూత్ నాయకులు సు తారి కృష్ణ, ఉల్లాజ్ భరత్, ఎం ప్రశాంత్, నల్లమాస చంద్రబా బు, మంద సాయి, వ నప్తి నాని, ముప్పారు రాము, తోట రాజేష్, బొబ్బిలి రామ నరసయ్య, పడిగా రామారా వు, కాంగ్రెస్ మహిళ నాయకురాలు వాసం సుశీల, ప్రవీణ, గలిగ సమ్మక్క, కుమారి, సుగుణ పాల్గొన్నారు.

## ఆమె వస్తే... మేము డ్యూటీ చేయం

విధులు బహిష్కరించిన అబ్కారీ సిబ్బంది

విచారణ నివేదికపై అధికారులకు పంపాం : జానయ్య

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆ అధికారి వేదింపులు మేము తాళలేము తాను విధులకు వస్తే మేము డ్యూటీ చేయలంటే అంటూ ఎక్సైజ్ సిబ్బంది విధులు బహిష్కరించిన ఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. గత కొద్దిరోజుల క్రితం ఎక్సైజ్ సిఐ వేదింపులు తాళలేక ఓ మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్ నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంగతి విధితమే. కాగా ఎక్సైజ్ సిఐ సిబ్బందిని తీవ్రంగా వేదిస్తుంటుందని, విధులు పట్ల ఎంక అంకిత భావంతో ఉన్నా సూటి పోటి మాటలంటూ కించపరిచే విధంగా ప్రవరిస్తారని ఆ నాడు సిబ్బంది మహిళా కానిస్టేబుల్‌కు మద్దతు తెలిపారు. తీరుపై ఎక్సైజ్ ఉన్నతాధికారి విచారణ చేపట్టి నివేదికను సిద్ధం చేసి కమీషనర్‌కు పంపించారు. ఇం త వరకు బాగానే ఉన్నప్పటికీ సంఘటన జరిగిన నాటి నుండి సోమవారం వ రకు విధులకు రాని సిఐ మంగళవారం విధుల్లోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకుంటామని మాటిచ్చారని, కానీ ఆమె విధుల్లోకి రావడంతో ఇచ్చిన మాట తప్పారని, కాబట్టి తాము ఆ అధికారి వద్ద పని చేయలేమంటూ విధులు బహిష్కరించారు. కాగా కలుగ జేసుకున్న ఉన్నతాధికారులు సిబ్బందికి సర్ధి చెప్పి విధుల్లోకి వెళ్లేలా చేశారు. అబ్కారీ సూపరింటెండెంట్ జానయ్యను వివరణ కోరగా సిబ్బంది విధులు బహిష్కరించిన విషయం తనదాకా రాలేదని, అయినా జరిగిన ఘటనపై విచారణ చేపట్టి కమీషనర్‌కు నివేదించామని, ఆ నివేదిక ఆధారంగా వచ్చే ఆదేశాలను బట్టి నడుచుకుంటామని అన్నారు.

# ఈ సారైనా ఏర్పాటయ్యేనా ?

భద్రాచలం ట్రస్ట్‌బోర్డు నియామకానికి కసరత్తు

రెండో సారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం

ఆశా వహుల్లో మరోసారి ఉత్సాహం

కీలక సమయాల్లో ఎంతో అవసరం

**ప్రజాపక్షం/భద్రాచలం :** అదిగో మేక.. ఇదిగో పులి అన్న చందంగా తయారైంది భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థాన పాలక మండలి నియామకం. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ట్రస్ట్‌బోర్డు వ్యవహారాన్ని ప్రక్కకు పెట్టింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండో సారి పాలకమండలి నియామకం ఉత్తజెండా ఉపడంతో ఈ సారైనా పాలక మండలి నియామకం జరిగేనా ఆనే అనుమానాలను రామ భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

**రెండోసారి :** 2010 నవంబర్ 26 నుండి 2012 నవంబర్ 25వ తేది వరకు రామాలయంలో 13వ పాలకమండలి విధులు కొనసాగించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పాలక మండలి నియామకం 10 ఏళ్లపాటు కాకపోవడంతో కొత్తగా అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు అవుతుందని భక్తులు భావించారు. అయితే భక్తుల మనోభావాలను గౌరవిస్తూ గత ఏడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పలు ఆలయాలతో పాటు భద్రాచలం రామాలయం ట్రస్టుబోర్డు ఏర్పాటుకు మొదటి సారిగా 2024 డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. అయినప్పటికీ పలు కారణాల చేత ఆగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం గత మూడు రోజుల క్రితం మరో సారి నోటిఫికేషన్ ఇచ్చేందుకు పచ్చజెండా ఊపడంతో త్వరలో దేవాదాయా ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.



**మరో సారి ఉత్సాహం :** రామాలయం ట్రస్టుబోర్డులో పనిచేయాలని స్థానికులతో పాటు రాష్ట్రంలో ఉన్న అనేక మంది ఆశపడుతున్నారు. ఇందులో భాగంగా గడ ఏ డాది డిసెంబర్లో మొదటి సారి నోటిఫికేషన్ విడుదల కావడంతో సుమారు 60 మంది వరకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో నిరాశకు గురైన వారంతా రెండో సారి నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో మరోసారి ఉ త్సాహం నిండుకుంది. ఇందులో భాగంగా ఇప్పట్నుంచే వారంతా పావులు కదుపుతూ పైరవీలు, ప్రదిక్షణలు, ప్రసన్నతల కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

**ముఖ్య సమయాల్లో అవసరం :** భద్రాచలం రామాలయం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రం. దీనిని దక్షిణ అయోధ్యగా కూడా పిలుచుకుంటారు. నిత్యం వేలాది మంది భక్తులు రాముల వారి దర్శనం కోసం విచ్చేస్తుంటారు. సెలవులు సమయాల్లో ఇసుకేస్తే రాలని భక్తులు ఉంటారు. ఈ ఏడాది ముక్కోటి నాటికైనా ట్రస్టు బోర్డు నియామకం జరిగితే కార్యక్రమాల నిర్వహణలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా 2027 లో గోదావరి పుష్కరాలు జరిగనున్న నేపథ్యంలో పాలకమండలి అవసరం ఎంతైనా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చొరవచూపాలని రామభక్తులు కోరుతున్నారు.

**ఆ ముగ్గురు మంత్రులకు తొలనొప్పిగా:** భద్రాచలం పాలక మండలి వ్యవహారం ఉమ్మడి జిల్లాకు చెందినమంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డికి తలనొప్పిగా మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలో ఎవరి వర్గం వారికి బలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. పాలకమండలి చైర్మన్ పదవి ఏ వర్గానికి చెందిన వారిని వరిస్తోందో, ఎవరి మెడలో వరమాల పడుతుందో అనే చర్చ తీవ్రంగా సాగుతోంది. మరో ప్రక్త దేవాదాయధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ సైతం భద్రాచలం కేంద్రంగా తన వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్లు వినికిడి. ఈ మధ్య కాలంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖల మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో భద్రాచలం పాలక మండలి వ్యహారంలో వీరిద్దరి వర్గాల మధ్య పోటీ సహజంగానే ఏర్పడే అవకాశం ఉంది. ఆ యన వర్గానికి చెందిన పలువురు పాలకమండలిలో పా వులు కదిపేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఇక రాష్ట్ర ఉప ము ఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్కకు కూడా ప్రత్యేక వర్గం ఉండనే ఉంది. ఇదిలా ఉండగా స్థానికంగా ఉన్న భద్రాచలం ఎంఎల్ఏ డా. తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య రెండు వర్గాలుగా పనిచేస్తుండగా, డా.తెల్లం వెంకట్రావు తన రాజకీయ గురువైన పొంగులేటి వర్గానికి, పొదెం వర్గం భట్టి వర్గం వైపు మొ గ్గు చూపనున్నారు. దీంతో భద్రాచలం పాలక మండలి వ్యవాహారం ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులకు తలనొప్పిగా మారింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి : కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ టౌన్: క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్, కరుణాపురం బాలుర పాఠశాలలో నిర్వహించిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025 ఆరంభ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని ఆటలు, క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించి వారి లక్ష్యాలను చేరవడంలో వారి మానసిక స్థితిని మెరుగుపరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల మహాత్మ జ్యోతిబాపూలే ప్రాంతీయ సమన్వయ కర్త రాజకుమార్, మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య, ప్రిన్సిపల్, పీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పేలుడు ఘటనపై సిపిఐ దిగ్భ్రాంతి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం / వరంగల్ : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుపై భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు పార్టీ సంతాపాన్ని తెలియజేస్తోందని, గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ సంఘటనపై సమగ్రమైన, పారదర్శకమైన, కాలపరిమితి గల దర్యాప్తు జరగాలని సిపిఐ డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రభుత్వం గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమ మైన వైద్య చికిత్సను అందించాలని, శాంతి, ప్రజా భద్రతను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## బయో కంపోస్ట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురండి

నగర మేయర్ గుండు సుధారాణి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:బయో కంపోస్ట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ పరిధి పోతన నగర్‌లో గల సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సమగ్ర నిర్వహణకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో అన్ని కంటైనర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయో లేదో అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మత్తులకు గురైన కంటైనర్లను కాంట్రాక్టర్ ద్వారా రిపేరింగ్‌లు చేయించేలా చూడాలని, చెత్తను తరలించిన తర్వాత ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న వాటర్ షెడ్డును పరిశీలించి అట్టి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి వాహనాలు శుభ్రం చేసుకోవడానికి వీలుగా ర్యాంప్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఈఈ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధిలో సిపిఐ అలుపెరగని పోరాటం



ప్రజాపక్షం/ములుగు:సిపిఐ జిల్లా సమితి సమావేశంలో జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున రావు మాట్లాడుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఇంటింటికి వెళ్ళి సభ్యత్వాల కోసం ఫండ్ వసూలు చేయాలని జన సమీకరణ 300మందికి ఖర్చుల నిమిత్తం వసూలు చేయాలని జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ అలుపెరగని పోరాటం చేస్తూ పేద కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాల శ్రామిక వర్గాల కోసం ఎంతో శ్రమించి కృషి చేస్తుందని బహిరంగ సభకు సుమారు లక్షల మంది వరకు వస్తారని ఆశిస్తున్నామని దాని జయప్రదం చేయుట కొరకు ప్రతి ఒక్క సిపిఐ కార్యకర్తలు కలిసి మెలిసి గ్రామాలలో ఫండ్ వసూలు చేయాలని ఈ సందర్భంగా కార్యకర్తలను కోరారు. రేపు 20వ తేదీకు ఈ నెల ప్రచార జాత ములుగులో ఒంటిగంటకు ప్రవేశిస్తున్నందున గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి హాజరు అయ్యటువంటి పార్టీ కార్యకర్తలు ఎర్ర ప్యాంట్ ఎర్ర చొక్కాలు ధరించి సభకు రావాలని మహిళా సంఘాలు, అంగన్‌వాడీలు, ఆశాలు, మిడ్‌డే మీల్స్ వర్కర్స్, సెకండ్ ఏఎన్ఎమ్స్, సివిల్ సప్లయి కార్మికులు, స్కావెంజర్స్ హాజరై జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు. అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి కృష్ణకుమార్, టివి కె మీనా కుమారి, వెంకటాపురం మండల కార్యదర్శి కట్ల రాజు, వాజేడు మండల కార్యదర్శి నెల్లుట్ల యున రవీందర్, కొక్కుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయ విద్యా దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజైన నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలామ్ దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేశారు.

## పేద విద్యార్థులకు రవికుమార్ ఫౌండేషన్ అండ

విద్యార్థుల టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ..పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు జి ఆర్ కె ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఈమేరకు వరంగల్‌లోని శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో చదివే 60 మంది టెన్త్‌క్లాస్ విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లిస్తూ ఫౌండేషన్ నుంచి చెక్కును అందించారు. ఈ సందర్భంగా జి ఆర్ కె ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ తమవంతు సాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. అంతేకాదు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల విద్యార్థులకు చేస్తున్న సేవలను ప్రేరణగా తీసుకున్నట్టు వెల్లడించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని గంట రవికుమార్ ఆకాంక్షించారని, చదువుకు పేదరికం అడ్డుకాకూడని, నిరుపేద విద్యార్థుల్ని ఆదుకునేందుకు తనవంతు సహకారం చేస్తానని, జి ఆర్ కె ఫౌండేషన్ కూడా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ రఫీ, కందుకూరి విజయ్ కుమార్, సామల శ్రీనివాస్, పాలకుర్తి విక్రమ్ గౌడ్, కాశీ రాజు పాల్గొన్నారు.

### తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్‌కు అవసరమైన

# భూ సేకరణ ప్రక్రియ పూర్తి

రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్





ప్రజాపక్షం/భూపాలపల్లి :జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల 1 కోల్ బ్లాక్ ఓపెన్‌కాస్ట్ మైన్‌కు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తెలిపారు. మంగళవారం జెన్కో సిఎండి హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, థర్మల్, కోల్ డైరెక్టర్లతో కలిసి తాడిచర్ల1 కోల్ బ్లాక్ ఓపెన్‌కాస్ట్ మైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మైనింగ్ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ చర్యలు వంటి అంశాలను పరిశీలించారు. మైనింగ్ ప్రాంతం నుండి తాడిచర్ల గ్రామాన్ని, వాహన ప్రాంగణం, యంత్రాలను, ఫీడర్ బ్రేకర్ పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన పరిహారం పంపిణీ, పునరావాస చర్యలు వంటి విషయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎంఆర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. భూసేకరణ, పునరావాస చర్యలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా, వేగంగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం తాడిచర్ల నుండి కెటిపిపి వరకు కన్వేయర్ బెల్ట్ నిర్మాణం, రవాణామార్గం, దూరాభారాల పై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్కో సి.ఎం.డి హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మగారు పాల్గొన్నారు.అధికారులు కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, రహదారి మార్గం, భద్రతా చర్యలు మరియు అవసరమైన నిర్వహణ ప్రక్రియపై వివరాలు అందించారు. కన్వేయర్ బెల్ట్ నిర్మాణం పూర్తయితే రహదారి రవాణాపై భారం తగ్గి సమర్థవంతంగా బొగ్గు పంపిణీ జరుగుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా రానున్న రోజుల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా జరగాలని ఆయన సూచించారు. కెటిపిపిలో 28 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, కోల్ డైరెక్టర్ రాగ్యా, విద్యుత్ శాఖ ఈడి లక్ష్మయ్య, కెటిపిపి సిఇ శ్రీ ప్రకాష్, ఎస్ఇ ముత్యాల రావు, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హార్ నాయక్, తహసీల్దార్ రవి కుమార్, ఏఎంఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా కవి, రచయిత అందెశ్రీకి జోహార్లు

జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి

ప్రజాపక్షం /జనగామ :ప్రముఖ కవి, రచయిత, తన చిన్ననాటి మిత్రుడు అందెశ్రీకి జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి విప్లవ జోహార్లు అర్పించారు. అందెశ్రీ మరణం పట్ల దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ అందె ఎల్లయ్య అలియాస్ అందెశ్రీ మద్దూర్ మండలంలోని రేబర్తి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించాడన్నారు. విప్లవ పాటలు రాస్తూ ప్రజానాట్యమండలి కళాకారుడిగా చేర్యాల ప్రాంతంలో తమకు ఎంతో సుపరిచితుడుగా ఉండేవాడన్నారు. చదువు తక్కువగా ఉన్నా జీవితం, సమాజ పరిస్థితులు, ప్రజల కష్టాలను అధ్యయనం చేసిన వ్యక్తి అన్నారు. సంకలో సంచి ఒక తాపి గుండ దారం ఎల్లప్పుడు తన దగ్గర ఉండేదని, పనిపాటలకి పనిచేస్తూ కూడా తిరిగి మళ్ళీ పాటలు మీ దనే ధ్యాస ఉండేదన్నారు. ప్రజల సమస్యల మీద ధ్యాసతో మాతో ఎప్పుడు చర్చించేవాడని, దానికి అనుగుణంగా వెంటనే నోటి నుండి ఒక పాట రూపంలో రావడం, ఇతరుల చేత రాయించడం అలవాటు పడ్డాడన్నారు. ఆ విధంగా ప్రజల కష్టాలతో సమాజ పరిస్థితుల్లో అధ్యయనం చేసి డాక్టరేట్ సాధించాడని, తెలంగాణ రాష్ట్ర గీతం రాసేంత ఉన్నత స్థాయికి ఎదిగాడన్నారు. ప్రపంచ దేశాలలో ఉన్న నదుల గురించి అధ్యయనం చేస్తూ వందకు పైగా దేశాలలో పర్యటించడం ఆయనకు మాత్రమే సాధ్యమైందని, తన అనుభవాలను తనతో చాలా సార్లు పంచుకున్నాడన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా తాను అనుకున్న లక్ష్య సాధన మాత్రం ఏనాడు జవదాటలేదని, ఎప్పుడు ఏ విషయం వచ్చిన తన ఆశయ లక్ష్య సాధనలో రాజీ పడలేదన్నారు. అటువంటి మహానీయుడిగా పరిచయం ఉన్న వ్యక్తిగా ,భారత కమ్యూనిస్టు పార్టీ పరంగా విప్లవ అభినందనలు తెలిపారు.

# ప్రజా కవి అందెశ్రీకి నివాళి

ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



ప్రజాపక్షం/హనుమకొండ : పీడిత ప్రజల విముక్తి కోసం, మానవీయ విలువల సమాజ నిర్మాణం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం రచించి పాడిన మహా కవి అందెశ్రీ అకాల మరణం కొనసాగించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో మంగళవారం జరిగిన ప్రజా కవి అందెశ్రీ నివాళి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పసితనంలోనే పశువుల కాపరిగా ఎన్నో కష్టాలు పడిన అందెశ్రీ తన కష్టాలతో పాటు, సమాజ కష్టాలపై నిరంతరం ఆలోచించిన అందెశ్రీ సహజ కవిగా, ప్రజా కవిగా ఎన్నో గీతాలను వ్రాసి పాడి ప్రజలను చైతన్యం చేసిన ఘనత వారికి దక్కింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ ఇండియా ఓబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బిసి మహాసేన రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, టిజెఎస్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది చిల్ల రాజేంద్రప్రసాద్, రాజ్ మహ్మద్, కొంగ వీరాస్వామిలు మాట్లాడుతూ పలుసార్లు దోపిడీ పాలనను అంతమొందించేందుకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అందెశ్రీ కెసిఆర్ దుష్ట పాలన అంతం కోసం కూడా అంతే పోరాటం చేశాడని, ప్రజల పక్షాన నిజాయితీగా నిలబడి కలబడిన ధిక్కార స్వర నేతిశరం యుసతకు, ఉద్యమకారులకు ఆదర్శం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతికుమార్, చిల్ల రాజేంద్రప్రసాద్, కొంగ వీరాస్వామి, రాజ్ మహ్మద్, నేదునూరి రాజమౌళి, చుంచు రాజేందర్, సంఘాని మల్లేశ్వర్, నలిగింటి చంద్రమౌళి, చాపర్తి కుమార్ గాడ్గే, మంద వీరస్వామి, సూరం నిరంజన్ పటేల్, కత్తెరపల్లి దామోదర్, జక్కుల కృష్ణమూర్తి యాదవ్, డేవిడ్, బక్కీ యాదగిరి, అనిశెట్టి సాయితేజ, సి వి చారి, ఎం రమేష్, నల బోల అమరేందర్, కొండి కృష్ణ గౌడ్, మామిడి రాజ్, జె రవీందర్, బి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చట్టం ఆమోదానికి సిఎం కృషి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు విజ్ఞప్తి



ప్రజాపక్షం/ వరంగల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేరుస్తూ బిల్లు ఆమోదించే విధంగా రేవంత్ రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపచేసే బాధ్యత రాష్ట్ర బిజెపి పార్టీయే తీసుకోవాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకటరాములు అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవన్ లో పలుకోసం వెంకన్న అధ్యక్షతన జరిగిన బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నగర్ లో నిర్వహించగా ముఖ్యఅతిథిగా వెంకటరాములు హాజరై మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టానికి బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చినందున మోదీ ప్రభుత్వంతో మాట్లాడి ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్పించడానికి రాష్ట్ర బిజెపి చొరవ చూపి రాష్ట్రంలో బిసిల ఎడల తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టి సకల రంగాలలో బిసిలవాటా బిసిలకు ఉన్నదానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేసే విధంగా బిసి హక్కుల సాధన సమితి ఉద్యమిస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకోసం బిసిల వెన్నంటి సిపిఐ ఉంటుందన్నారు. చ దేశాల నుండి 40 దేశాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. బిసిల హక్కుల కోసం చేసే పోరాటంలోనైనా ఎటువంటి త్యాగాలకైనా సిపిఐ వెన్నంటి ఉంటుందని ఎటువంటి నాయకులు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల చట్టాన్ని చేసిన ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి అన్ని రాజకీయ పార్టీలను బిసి సంఘాలను కలుపుకొని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరిని ప్రధానమంత్రి దగ్గరికి తీసుకొని వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు ప్రకాష్, బొట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కమ్మల వెంకన్న, కడియాల క్రాంతి కుమార్ జిల్లా నాయకులు దివ్య ,కోల లింగయ్య,గుండె బోయిన రాజన్న,నల్లతీగల సారంగం,చెలుకల రాజు, యార మల్లారెడ్డి,జగదీష్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం / వరంగల్ : మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారి జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జడ్పీ సిఇఓ, డిఆర్‌ఓ ఇన్‌చార్జి పిడి రామ్ రెడ్డితో పాటు వివిధ జిల్లా అధికారులు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, భారత దేశ మొదటి విద్యా శాఖా మంత్రిగా పని చేశారు. వారు మక్కాలో జన్మించారని వారి జన్మస్థలం మక్కా లో జన్మించడం లోనే వారు మహోన్నతమైన వ్యక్తిగా కీర్తించబడ్డారని ఈ సందర్భంగా వారిని కొనియాడారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి గ్రామాల నా అబ్దుల్ కలాం ఆజాద్ చేసిన సంస్కరణలు మనం ఈరోజు అనుభవిస్తున్నామని ఒకప్పుడు ప్రజలు బలపం పట్టి చదివిన ప్రతి విద్యార్థిని విద్యావంతులుగా చూడగలిగా నేడు కానీ ప్రస్తుతం టెక్నాలజీ డెవలప్మెంట్ డిజిటల్ ద్వారా బోర్డుపై విద్యాభోధన చేయడమన్నారు. అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ వారు భారత దేశ అభివృద్ధికి వెలలేని సేవ చేశారని వారి సేవలను మనం ఇప్పుడు అనుభవిస్తున్నామని విద్య కు ప్రాముఖ్యత ఇచ్చి 17 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరు నిర్బంధ విద్య చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి నీరజ, డిబిసిడిఓ పుష్పలత, జెడి హార్టికల్చర్ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ విశ్వప్రసాద్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘాట్ నిర్మాణ పనులపై ఆగ్రహం

దేవదాయ శాఖ కమిషనర్



ప్రజాపక్షం/భూపాలపల్లి :కాళేశ్వరం గోదావరి మెయిన్ ఘాట్ వద్ద జరుగుతు న్న ఆర్చి నిర్మాణంలో జాప్యం పట్ల దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన పనుల్లో ఇంత అలసత్వమా చర్యలు తప్పవని హెచ్చరించారు. మళ్లీ తాను డిసెంబర్ లో వస్తానని అప్పటి వరకు పనులు పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయ ఆధ్వర్యం లో జరుగుతున్న అభివృద్ధి పనులపై షెడ్యూల్ త యారు చేయాలని సూచించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా చేపట్టిన ఆర్చి నిర్మాణం ఇంతవరకు పూర్తి చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశా రు. ఆలయ అభివృద్ధి పనులు ప్రతిష్ఠాత్మకమైనవని, భక్తుల నమ్మకానికి భంగం కలగకుండా అత్యుత్తమ నాణ్యత పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. పనుల్లో వేగం, పారదర్శకత తప్పనిసరి ఉండాలని నిర్లక్ష్యం చూపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. అంతకు ముందు రాష్ట్ర ఇం ధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ హరీష్, జిల్లా కలెక్టర్ రా హుల్ శర్మ, థర్మల్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి సరస్వతి ఘాటును సందర్శించారు.

# సిఎంఆర్ రాబట్టడంలో మీనమేషాలు..

మిల్లర్లను వెనకేసుకొస్తున్న అధికారులు

మిల్లర్ల వద్దే 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

ప్రభుత్వానికి చేరని కస్టమ్ మిల్లింగ్ రైస్



ప్రజాపక్షం/హనుమకొండ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రాబట్టడంలో జిల్లాల పౌరసరఫరాల అధికారులు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.దీనిని పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాల శాఖలోని ఇద్దరు డీఎంలు, ఇద్దరు డిఎస్ఓల తీరు వివాదాస్పదంగా మారింది. దీంతో కీలక శాఖల్లో ఉన్నతాధికారులుగా పనిచేస్తున్న కొందరి కక్కుర్తి సర్కారు ఖజానాకు గండి పెడు తోంది. అవినీతికి మరిగిన కొందరు అధికారులు ప్రభుత్వ సొమ్మును అక్రమమార్గం పట్టిస్తున్నారు. అవినీతి నిరోధక శాఖ తరచూ దాడులు నిర్వహిస్తున్నా వారి వైఖరి మారడం లేదు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారుల వైఖరి ప్రభుత్వ సొమ్మును వ్యాపారులకు ధారాదత్తం చేస్తోంది. రైతులను నుంచి సేకరించిన రూ.కోట్ల విలువ చేసే ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కింద సరఫరా చేస్తూ.. తిరిగి రాబట్టుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా సర్కారు ధాన్యాన్ని బయట అమ్ముకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్న కొందరు మిల్లర్ల నుంచి ఏసీకే (290 క్వింటాళ్లకు ఒక ఏసీకే)కు రూ.25 వేల వరకు వసూలు చేస్తూ మిన్న కుంటున్నారు. ఇదే క్రమంలో ఇటీవల కుమ్మక్కైన ఆసిఫాబాద్ జిల్లాలో మూడు ఏసీకేల బియ్యం ఎగ వేసిన ఓ వ్యాపారి నుంచి రూ.75 వేల లంచం తీసుకుంటూ సివిల్ సప్లయిస్ డీఎం జివి నర్సింహారావు ఏసీబీకి చిక్కడం కలకలం రేపుతోంది. 31 మంది రైస్ మిల్లర్ల నుంచి రూ.217 కోట్ల సీఎంఆర్ ధాన్యం రాబట్టాల్సిన అధికారులు.. వాటి జోలికెళ్లడం లేదు. గత సీజన్ లో అక్కడక్కడా ఆ చివ్వారికే మళ్లీ సీఎంఆర్ ఇచ్చినట్లు ఫిర్యాదు లున్నాయి. పౌరసరఫరాల శాఖ కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్లకు వరకూ వెళ్లినా విచారణ స్థాయి దాటలేదు. దీంతో సీఎంఆర్ పాత బకాయిల మాట పక్కన పెడితే.. కొత్తగా తీసుకునే వాళ్లు సైతం చాలా వరకు మొండికేస్తున్నారు.

**గడువు దాటినా సిఎంఆర్ రాబట్టలేదు**

2022—23లోని సిఎంఆర్ గడువు దాటినా.. హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచి బియ్యం ప్రభుత్వానికి చేరలేదు. ఇదిలా ఉంటే బకాయిదారుల నుంచి బియ్యం, ధాన్యం రాబట్టాల్సిన ఉన్నతాధికారులు... ధాన్యం ఎగవేతదారులతో సంప్రదింపులు జరిపి ఏసీకేకు రూ.25 వేల చొప్పున కొందరి వద్ద ఇటీవల వసూలు చేసినట్లు తెలిసింది. వరంగల్ కు చెందిన ఇద్దరు రైస్ మిల్లర్ల బాడావేలీలు నిలిపివేసి పిలిపించిన పౌరసరఫరాల శాఖ అధికారి ఒకరు. వారం రోజులకే మిల్లును తెరిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో మూడు రైస్ మిల్లులకు నోటీసులు ఇచ్చి.. ఐదు రోజుల వ్యవధిలోనే లావాదేవీలకు అనుమతి ఇవ్వడం అప్పట్లో ఆ శాఖలోనే చర్చనీయాంశమైంది. ఈ సిఎంఆర్ దందాలో హస్తలాఘవం చూపుతున్న ఇద్దరు డిఎంలు, ముగ్గురు డిడిఎస్‌లపై ఏసిబి అడిషనల్ డిజిపి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కు తాజాగా ఫిర్యాదు దులు వెళ్లడం కలకలం రేపుతోంది. ఇదే సమయంలో సిఎంఆర్‌లో అక్రమాలపైన వైపు ఏసిబి మరో వైపు విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ రంగంలోకి దిగి ఆరా తీస్తుండడం ఆ శాఖ అధికారుల్లో చర్చనీయాంశమవుతోంది.

**పిల్లి గడుస్తున్నా ఉదాసీనత..**పెళ్లి గడుస్తున్నా సిఎంఆర్ రాబట్టడంలో కొందరు పౌరసరఫరాల శాఖ అధికారులు మా మూలుగా తీసుకుంటున్నారు. సిఎంఆర్ దందాపై పత్రికల్లో వచ్చినప్పుడు.. లేదా ఉన్న తాధికారుల వరకు ఫిర్యాదులు వెళ్లినప్పుడో స్పందిస్తున్న పౌరసరఫరాల శాఖ నోటీసులు ఇచ్చి చేతు లు దులుపుకుంటోంది. ఇదే క్రమంలో సిఎంఆర్ ఉన్న ని మిల్లుల్లో ఉండే ధాన్యాన్ని 2022—23లో టెండర్ల నిర్వహించారు. ఆ ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని మిల్లు ల్లో 2,92,585 మెట్రిక్ టన్నుల ధాన్యానికి టెం డర్లు వేసిన వ్యాపారులు తెచ్చుకునేందుకు మిల్లులకు వెళ్లగా అక్కడ ఉండ ధాన్యం మాయమైంది. దీనిపై ను మారు ఏదాది పాటు ధాన్యం మాయమైన మిల్లుల యజమానులపై ఒత్తిడి తెచ్చిన అధికారులు 1,83,985 మెట్రిక్ టన్నులు రాబట్టారు. ఇదే సమయంలో రూ .217 కోట్ల విలువ చేసే ధాన్యం 31 మంది రైస్ మిల్లర్ల వద్ద ఉండని పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తేల్చినప్పటికీ ఇప్పటికీ రాబట్టలేదు. ధాన్యం మాయం చేసిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ, పీడీ యాక్టు లు పెట్టి వసూలు చేసే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 8 మిల్లులపై మొక్కుబడిగా 6ఏ కేసులు తో సరిపెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి.

# క్రీడ

## భారత్, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్..



### టాస్ కోసం ప్రత్యేక నాణెం

భారత్, దక్షిణాఫ్రికా మధ్య నవంబర్ 14 నుంచి రెండు టెస్టుల సిరీస్ మొదలుకానుంది. తొలి మ్యాచ్ కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో, రెండో మ్యాచ్ నవంబర్ 22 నుంచి గువాహటిలో జరగనుంది. ఈ సిరీస్‌లో టాస్ కోసం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రత్యేక బంగారు నాణెంను తయారు చేయించింది. ఈ గోల్డ్ కాయిన్‌కు ఒక వైపు భారత జాతిపిత మహాత్మా గాంధీ, మరో వైపు జాతి వివక్ష వ్యతిరేకంగా పోరాటం చేసిన నల్లజాతి సూరీడు, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చిత్రం ముద్రించారు. శాంతి, స్వేచ్ఛ, అహింస మార్గంలో నడిచిన ఈ మహనీయుల గౌరవార్థం ఈ స్పెషల్ కాయిన్ రూపొందించారు. ఈ ప్రత్యేక నాణెంను సిరీస్‌లోని రెండు మ్యాచ్‌ల్లో టాస్ సందర్భంగా ఉపయోగించనున్నట్లు క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ తెలిపారు. 2015 నుంచి ఇరుజట్ల మధ్య జరిగే టెస్టు సిరీస్‌ను మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా గౌరవార్థం ఫ్రీడమ్ ట్రోఫీగా పిలుస్తున్న సంగతి తెలిసిందే.



ఆరేళ్ల తర్వాత ఈడెన్ గార్డెన్స్‌లో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. దీంతో మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. మొదటి మూడు రోజుల టికెట్లు దాదాపుగా అమ్ముడైనట్లు క్యాబ్ ట్రెజరర్ సంజయ్ దాస్ పేర్కొన్నారు. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌ను తయారు చేయాలని టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ కోరలేదని క్యాబ్ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ వెల్లడించాడు. దీంతో ఇటు బ్యాటర్లకు, అటు బౌలర్లకు అనుకూలించేలా సమతూకపు పిచ్ ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం భారీ పేలుడు సంభవించడంతో ఈడెన్ గార్డెన్స్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆటగాళ్లు, ప్రేక్షకుల భద్రత కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

### సవాల్‌కు సిద్ధం: సిరాజ్



డిఫెండింగ్ వరల్డ్ టెస్ట్ చాంపియన్ దక్షిణాఫ్రికాపై మెరుగైన ప్రదర్శన చేయాలని టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ భావిస్తున్నాడు. సిరాజ్ భారత బౌలింగ్ లైనప్‌కు నాయకత్వం వహించనున్నాడు. టాప్ టెస్ట్ ర్యాంకర్ జస్‌ప్రీత్ బుమ్రాతో కలిసి బౌలింగ్ భారం మోయబోతున్నాడు. 2025–27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్ అత్యధిక వికెట్లు తీసిన ఈ హైదరాబాద్ బౌలర్ స్వదేశంలో జరుగనున్న టెస్ట్ సిరీస్‌లో తనదైన ముద్రవేయాలని భావిస్తున్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు మూడోస్థానంలో ఉంది. ఇంగ్లాండ్‌పై రాణించడంతోపాటు వెస్టిండీస్ సిరీస్‌ను గెలిచామని సిరాజ్ జియోస్టార్‌తో చెప్పుకొచ్చారు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లోనూ సిరాజ్ అద్భుతంగా రాణించాడు. 23 వికెట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్‌పై సైతం అద్భుతమైన ఫామ్ కొనసాగించాడు. రెండు మ్యాచుల్లో పది వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని.. సవాల్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిరాజ్ తెలిపాడు.

## 65 ఏళ్లలో ఢిల్లీపై తొలి విజయం!



రంజీ ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌదరి ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీతో రికార్డు నెలకొల్పగా.. దేశవాళీలో పెద్ద జట్టైన ఢిల్లీపై జమ్ము కశ్మీర్ జయభేరి మోగించింది. 65 ఏళ్లలో మాజీ ఛాంపియన్‌పై ఆ జట్టుకు ఇదే తొలి విజయం. కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్), అకీబ్ నబీ(5–35), వన్షాజ్ శర్మ(6–68) బంతితో చెలరేగడంతో దశాబ్దాల కలను సాకారం చేసుకుంది. చిరస్మరణ విజయంతో జమ్ము టీమ్ ఎలైట్ గ్రూప్ డీలో రెండో స్థానానికి ఎగబాకింది. రంజీ ట్రోఫీలో ఆల్‌రౌండ షోతో అదరగొట్టిన జమ్ము కశ్మీర్ జట్టు ఢిల్లీకి ఊహించని షాకిచ్చింది. పటిష్టమైన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ జమ్ము బౌలర్లు తక్కువకే కట్టడి చేశారు. అకీబ్ నబీ(5–35), వన్షాజ్ శర్మ(6–68)లు విజృంభించి విజయానికి బాటలు వేశారు. అనంతరం 179 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ ఓపెనర్ ఖమ్రాన్ ఇక్బాల్ (133 నాటౌట్) శతకంతో కదం తొక్కాడు. క్రీజులో పాతుకుపోయిన కమ్రాన్‌ను ఔట్ చేసేందుకు ఢిల్లీ బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది.


**నబీ దెబ్బకొట్టినా..** తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని అకీబ్ నబీ కోలుకోలేని దెబ్బ తీశాడు. టాపార్డర్ విఫలమైనా కెప్టెన్ అయుష్ బదొని(64), ఆయుష్ దొసెజా(65), సుమిత్ మథూర్(55) అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో అకీబ్ ముష్తాక్(2–30) తిప్పేయగా ఢిల్లీ 211కే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన జమ్ము కశ్మీర్ సారథి పరాస్ డోగ్రా(106), అబ్దుల్ సమద్(85)ల మెరుపులతో మూడొందలు కొట్టింది.

రెండో ఇన్నింగ్స్‌లోనైనా పెద్ద స్కోర్ చేయాలనుకున్న ఢిల్లీ బ్యాటర్లను వన్షాజ్ శర్మ(6–68) వికెట్ వేటతో హడలెత్తించాడు. ఆయుశ్ బదొని(72), ఆయుశ్ దొసెజ్(65)లు పోరాడినా.. మిడిలార్డర్, టెయిలెండర్లను వన్షాజ్ పెవిలియన్ పంపగా 277కే ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది. ప్రత్యర్థి నిర్దేశించిన ఛేదనలో జమ్ము ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్(133 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. 20 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

# మహిళ

ఫోకస్

## డిమెన్షియాను తగ్గించే వ్యాయామం



పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా వ్యాయామం అందరికీ అవసరమే. అయితే, పలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్న మహిళలకు వ్యాయామం తప్పనిసరి. మధ్య వయస్సులో కార్డియోవాస్కులర్ వ్యాయామం చేసే మహిళల్లో డిమెన్షియా (మెదడు మరచిపోవడం, జ్ఞాపక విలయమవడం వంటి రోగం) వచ్చే అవకాశం 90 శాతం తగ్గిపోతుందని ప్రముఖ అధ్యయనం వెల్లడించింది. పరిశోధనా విశ్లేషణశాస్త్రవేత్తలు వందలాది మహిళలను అనేక దశాబ్దాల పాటు పరీక్షించి, ఫలితాలను విశ్లేషించిన సమర్పించిన నివేదికను అనుసరించి, మహిళల్లో వ్యాయామ అలవాట్లు, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని గుర్తించారు. రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి శక్తివంతమైన కార్డియో వ్యాయామం చేయని లేదా తక్కువగా చేసే మహిళలతో పోలిస్తే, తరచు ఈ వ్యాయామం చేసే వారిలో డిమెన్షియా ప్రమాదం చాలా తక్కువగా కనిపించింది. కార్డియో వ్యాయామం మెదడులో రక్త ప్రసరణను పెంచుతుంది, మెదడు కణాలకు ఆక్సిజన్, పోషకాలు సమృద్ధిగా అందుతాయి. అలాగే, జ్ఞాపకశక్తికి, నేర్చుకోగలిగే ప్రాంతాలకు కొత్త న్యూరాన్స్ పెరుగుతాయి. బిపి తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఇవన్నీ డిమెన్షియా అవకాశాన్ని తగ్గించే ప్రధానాంశాలు. యువతులు టీనేజ్ నుంచే ఈ వ్యాయాన్నిమొదలు పెట్టవచ్చు. కనీసం మధ్య వయసులోనైనా తప్పక అనుసరించాలి. 40, 50 ఏళ్ల వయస్సులో కూడా వ్యాయామం మొదలు పెడితే, అతి తక్కువ సమయంలోనే మెదడు ఆరోగ్యం మెరుగుపడుతుదని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం ప్రమాదం పొంచి ఉంటుందనేది అందరికీ తెలిసిందే. ఆ సమస్య నుంచి బయట పడాలంటే, తప్పనిసరిగా వ్యాయామం మొదలు పెట్టాలి. ముఖ్యంగా కార్డియో ఎక్సర్‌సైజ్ అనివార్యంగా చేయాలి. డిమెన్షియా జన్యుపరిమాణాల వల్ల మాత్రమే రాదు. జీవనశైలి ప్రభావం బలంగా ఉంటోంది అని స్పష్టమైంది. క్రమం తప్పకుండా కార్డియో వ్యాయామం చేయడం మెదడు ఆరోగ్యానికి అత్యంత శక్తివంతమైన రక్షణ చర్యలలో ఒకటిగా నిరూపితమైంది. మహిళలు మధ్య వయస్సులో కార్డియో వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వడం, జీవితాంతం మెదడు ఆరోగ్యానికి గొప్ప పెట్టుబడిగా చెప్పుకోవచ్చు.

## వాల్‌నట్స్‌లో ఔషధ విలువలు



డ్రై ఫ్రూట్స్‌లో వాల్‌నట్స్ (అక్రోట్స్)కు విశిష్ట స్థానం ఉంది. అయితే అందులో కొన్ని విశిష్ట ఔషధ విలువలు ఉన్నాయని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. తాజా నివేదిక ప్రకారం వాల్‌నట్స్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల మహిళల్లో రొమ్ము కేన్సర్ కారక కణాలు మరణిస్తాయి. మార్షల్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రయోగంలో మహిళలు రోజుకు రెండు ఔన్సులు (సుమారు 56 గ్రాములు) చొప్పున రెండు వారాలు వాల్‌నట్స్ తినడంతో కేన్సర్ కణాలు తగ్గుముఖం పట్టినట్టు గుర్తించారు. అంతేగాక, కేన్సర్ కణాల వృద్ధి గణనీయంగా తగ్గిందని రుజువైంది. బ్రెస్ట్ కేన్సర్‌ను వాల్‌నట్స్ సంపూర్ణంగా తొలగిస్తాయని గానీ, ప్రస్తుత వైద్య విధానాలకు ప్రత్యామ్నాయంగా పనిచేస్తాయనిగానీ అనుకోవడానికి వీల్లేదు. అయితే, వీటి వాడకం వల్ల సమస్య ఉధృతి తగ్గుతుంది. వాల్‌నట్స్‌ను బ్రెస్ట్ కేన్సర్ చికిత్సలో ఏ విధంగా విస్తృత పరిధిలో ఉపయోగించుకోవచ్చనే విషయంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఫలితాలు ఎలా వున్నా, వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల ప్రత్యేక లాభాలు లేకపోయినా నష్టం మాత్రం ఉండదు. కాబట్టి, ప్రయత్నం చేయడంలో తప్పులేదు.

## తల్లి నుంచే పిల్లలకు మేధస్సు!



మానవ మేధస్సు ఎంత వరకు జన్యుపరమైనది? అది తల్లిదండ్రులలో ఎవరి నుంచి ఎక్కువగా వారసత్వంగా వస్తుంది? అనే ప్రశ్నలకు చాలా కాలం నుంచి శాస్త్రవేత్తలు సమాధానం వెతికే ప్రయత్నం చేస్తున్నారు. అయితే తాజా పరిశోధనలను అనుసరించి, పిల్లల మేధస్సులో ఎక్కువ శాతం, కొన్ని సందర్భాల్లో దాదాపు మొత్తం కూడా తల్లిద్వారానే వారసత్వంగా వస్తుంది. ఇది జన్యు శాస్త్రంపై ఆధారపడి రూపొందించిన సిద్ధాంతం. అందుకేనేమో, ప్రతి బిడ్డకూ తల్లి మొదటి గురువు అవుతుంది. మేధో సామర్థ్యాలకు సంబంధించి ఉన్న జీన్స్ ప్రధానంగా 'ఎక్స్' క్రోమొసోమ్‌లో ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రతి సంతానానికి తల్లి ఒక 'ఎక్స్' క్రోమొసోమ్‌ను ఇస్తుంది, కానీ తండ్రి మాత్రం లింగాన్ని నిర్ణయించే 'ఎక్స్' లేదా 'వై' క్రోమొసోమ్‌లలో ఏదో ఒకదాన్ని ఇస్తాడు. అందువల్ల, పిల్లల మేధస్సుపై తల్లి యొక్క జన్యు ప్రభావం తండ్రితో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అంటే, జ్ఞాపకశక్తి, సమస్య పరిష్కార సామర్థ్యం, నేర్చుకోవడం, తార్కికత వంటి మేధో లక్షణాలను నిర్దేశించే జన్యుకారకాలు ఎక్కువగా తల్లి నుంచి వస్తాయి. జనగణన ఆధారిత పరిశోధనలు, కవలలు మీద చేసిన అధ్యయనాలు కూడా ఈ సిద్ధాంతాన్ని బలపరిచాయి. ఈ పరిశోధనల్లో పిల్లల 'ఐక్యూ' స్కోర్లు తల్లుల జన్యువులతో ఎక్కువ సంబంధం చూపించగా, తండ్రి వైపు ప్రభావం తక్కువగా ఉందని తేలింది. తల్లి నుంచి వచ్చే జన్యు ఆధారం పిల్లల బుద్ధి సామర్థ్యానికి బయాలజికల్ ఫౌండేషన్‌ను అందిస్తుంది... కానీ ఆ సామర్థ్యం ఎలా వ్యక్తీకరించబడుతుందనేది పరిసరాలు, అక్కడి ప్రభావాలు నిర్ణయిస్తాయి. కాగా, తాజా పరిశోధన శాస్త్రీయంగానే కాక సామాజికంగానూ గణనీయమైన ప్రాధాన్యతను సంతరించుకుంది. గర్భధారణ సమయంలో తల్లి ఆరోగ్యం, పోషకాహారం, మానసిక స్థితి బిడ్డ మేధో అభివృద్ధిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని ఇది సూచిస్తుంది. పిల్లలు వారసత్వంగా పొందిన మేధస్సును పూర్తిగా వికసింపజేయడం కోసం బాల్యంలో మంచి సంరక్షణ, విద్యావాతావరణం, భావోద్వేగ సహకారం కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, మేధస్సు పూర్తిగా జన్యుపరమైనదే అని చెప్పడం సరైంది కాదు. వ్యక్తి జీవిత అనుభవాలు, అభ్యాస అవకాశాలు, ఉపాధ్యాయుల ప్రేరణ, కుటుంబ మద్దతు వంటి అంశాలు కూడా మేధస్సు వికాసంలో కీలక పాత్ర పోషిస్తాయి. తల్లి పిల్లల మేధస్సుకు జన్యుపరమైన లక్షణాలను అందించినప్పటికీ, జీవన అనుభవాల ద్వారా అది మార్పు చెందే అవకాశాలు ఎక్కువ.

## 'ఢిల్లీ' దాడికి కేంద్ర హోంమంత్రి నైతిక బాధ్యత వహించాలి : సిపిఐ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన దాడికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహంఎదుట తీవ్రవాద చర్యలకు వ్యతిరేకంగా తీవ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశరాజధాని ఢిల్లీ నగరంలో సోమవారం జరిగిన తీవ్రవాద ముష్కరుల దాడి ఒక పిరికిపంద చర్య అన్నారు. పేలుడు పదార్థాలు అత్యంత రద్దీతో కూడిన ఎర్రకోట సమీపప్రాంతాల్లోకి ఎలా వచ్చాయి అనేది కేంద్రప్రభుత్వం హోంశాఖ సమాధానం చెప్పాలన్నారు. దేశంలో తీవ్రవాద చర్యలు ఆరికడుతున్నామని గొప్పలు చెప్పే అమిత్‌షా ఈ దాడికి నైతిక బాధ్యత వహించి తక్షణమే కేంద్రహోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు శివశంకర్, కృష్ణాజి, కిరణ్‌కుమార్, మధుగౌడ్, ఈర్లభూపేష్, కొత్తరామస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ, శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** కార్మిక హక్కులు, రక్షణ చట్టాల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి ఆదిలాబాద్ పట్టణ నాల్గవ మహాసభలు ఎన్.రాధ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిధిగా విలాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం సాధించిన 44 చట్టాలను తిరిగి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను, రైతు వ్యతిరేక మూడు చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. స్కీం వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశ, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26,000వేతనం, పెన్షన్ ఇవ్వాలన్నారు. అనంతరం ఎఐటియుసి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిర్ర దేవేందర్, అధ్యక్షుడిగా ప్రవీన్‌రెడ్డి, కార్యదర్శిగా గాజంగుల రాజు, కోశాధికారిగా జి.భూషణం, ఉపాధ్యక్షులుగా ఎన్.రాధ, సంగీత, రామ్‌బాయి, బ్రదర్ అఫ్రోజ్, సహాయ కార్యదర్శులుగా మహేందర్, కాసి, కుంటాల రాములు, శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శత వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో తీర్మానించారు.

## గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ :** కల్లు గీత వృత్తిదారుల సమస్యల పరిష్కరించాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరాస్వామి, జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత వృత్తిలో చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలతో పాటు శాశ్వతంగా గాయపడిన వారికి చెల్లించాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిలో చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను 5 నుండి 10లక్షలకు తాత్కాలిక గాయాలతో భాదితులైన వారికి 2 లక్షలకు పెంచాలి. మెడికల్ బోర్డు విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్ పర్యవేక్షనలో తాత్కాలిక శాశ్వత వికలాంగుల నిర్ధాణ పాత పద్ధతిలోనే సర్టిఫికెట్ పద్ధతిని పునరుద్ధరించాన్నారు. షెడ్యూల్ ఏరియాలోని కల్లు గీత వృత్తిలో వున్న గీత వృత్తిదారులకు సహకార సంఘాలు, టిఎఫ్తాలు ఇవ్వాలని, గీత వృత్తిదారులందరికి రక్షణ వృత్తి పరికరాలు అందించాలని, నీర స్కీమ్‌ను కల్లు గీత సహకార సంఘాల ద్వారా అమలు చేయాలని, పెన్షన్ రూ.5వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కల్లుగీత వృత్తిదారులకు 560 జీవో ప్రకారం సొసైటీలకు భూమి, షాపులకు స్థలాలు, వృత్తి అభివృద్ధికి సంక్షేమ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏండ్లు తరబడి



పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా బకాయిల విడుదల చేయాలన్నారు. పెండింగ్ వున్న గీత కార్మికుల పెన్షన్ దరఖాస్తులు, గుర్తింపు కార్డులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి సురిగి చలపతి, సహాయ కార్యదర్శి పల్లె శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతపల్లి పుల్లయ్య, కుంభం జయరాములు, జోగు సురేందర్, కర్నాటి వెంకటేష్, గంట నాగేష్, మారగొని మల్లయ్య, బొడిగె బక్కశెట్టి, వనం వెంకన్న,దోతి పందరి, మిద్దెల రామలింగయ్య, బొడిగె సత్తయ్య, ఉయ్యాల చంద్రయ్య, లెనిన్, కట్కూరి వెంకన్న, బోయపల్లి నరసింహ తదితరులు గీత కార్మికులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం గీత కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతిపత్రం అందజేశారు.

## అందెశ్రీ మరణం కళాకారులకు తీరని నష్టం

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** అందెశ్రీ మరణం కళాకారులకు తీరని నష్టం అని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, యాదాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో అందెశ్రీకి చిత్రపట్నాకి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుషిపాక నరసింహ, చెక్క వెంకటేష్, ఏషాల అశోక్, ఇంజ హేమలత పిట్టల శంకర్, కట్ల యాదగిరి, జాను స్వామి కిరణ్ మనోహరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయరా?

మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో ఎప్పుడు అమలు చేస్తారని మహిళా సమాఖ్య యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మహిళా సమాఖ్య యాదగిరిగుట్ట మండల కౌన్సిల్ సమావేశం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆరె పుష్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై బండి జంగమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2500 ఇస్తానన్న హామీని ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. అదేవిధంగా ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని మాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తక్షణమే మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా భారత కమ్యూనిస్టు పార్టీకి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శత వార్షిక ఉత్సవాల బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్య లో పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మునుకుంట్ల నరసమ్మ, ప్రధాన కార్యదర్శి ఆరె పుష్ప, మద్దూరు భాగ్యమ్మ, నాతకాని కిష్టమ్మ, ఉపేంద్ర, గోద సువర్ణ లక్ష్మి , యాదమ్మ, పద్మ పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

కలెక్టరేట్ కార్యాలయంలో సిపిఐ వినతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైస్ మిల్లర్ల దోపిడిని అరికట్టాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఇంచార్జ్ ఎఒ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్ల జిల్లాలో కొనుగోలు సెంటర్ నుండి రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తున్న ధాన్యం ఒక్క సంచి మీద అదనంగా ఐదు కిలోల నుండి 8 కిలోల వరకు తాలు, తరుగు, తేమ పేరున రైస్ మిల్లర్లు రైతులపై నిలువు దోపిడీ చేస్తున్నారని ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. వర్షాల మూలంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రోజుల తరబడి రైతాంగం శ్రమ చేస్తున్నప్పటికీ తేమ ఉందని కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు రూ.15600కే రైతులు అమ్ముకొని నష్టపోతున్నారని తెలిపారు. సెంటర్ నిర్వాహకులను ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్లర కఠిన చర్యల్లో భాగంగా రైస్ మిల్లర్ రిజిస్ట్రేషన్ లను రద్దు చేయాలని కోరారు. సెంటర్‌కు సంబంధం లేకుండా నేరుగా తక్కువ ధరకు రైతు నుండి కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్ పై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి గన్ని సంచులు తిరిగి ఇవ్వకుండా కోట్లల్లో సొమ్ము చేసుకుంటున్న రైస్ మిల్లర్ పైన జిల్లా కలెక్టర్ తనిఖీ నిర్వహించి వాటిని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గత సీజన్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 44 వేల రైతుల నుండి కొనుగోలు చేసిన రైతులకు చెల్లించాల్సిన 500 రూపాయల బోనస్ తో కలుపుకుంటే నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలు రైతాంగానికి బోనస్ డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సోమ నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మంత్రి చంద్రయ్య, రాజేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో పాల్గొనాలి

సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు

**ప్రజాపక్షం/ములుగు:** ఖమ్మంలో నిర్వహించే సిపిఐ శత వసంత ఉత్సవాల విజయవంతానికి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున రావు పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయాలని కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ అలుపెరగని పోరాటం చేస్తూ పేద కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాలు శ్రామిక వర్గాల కోసం కృషి చేస్తుందన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్యాకర్తలు, అభిమానులు తరలివెళ్లేలా కృషి చేయాలన్నారు. ప్రతి సిపిఐ కార్యకర్త గ్రామాలలో ఫండ్ వసూలు చేయాలని ఈ సందర్భంగా కార్యకర్తలను కోరారు. రేపు 20వ తేదీకు ఈ నెల ప్రచార జాత ములుగులో ఒంటిగంటకు ప్రవేశిస్తున్నందున గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సభకు హాజరు అవ్వబోయే పార్టీ కార్యకర్తలు ఎర్ర ప్యాంట్, ఎర్ర చొక్కాలు ధరించి రావాలని, మహిళా సంఘాలు, అంగన్‌వాడీలు, ఆశాలు, మిడ్‌డే మీల్స్ వర్కర్స్, సెకండ్ ఐఎన్ఎమ్స్, సివిల్ సప్లయి కార్మికులు, స్కావెంజర్స్ హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి కృష్ణకుమారి, టివి కే మీనా కుమారి, వెంకటాపురం మండల కార్యదర్శి కట్ల రాజు, వాజేడు మండల కార్యదర్శి నెల్లబోయిన రవీందర్, కొక్కుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అందెశ్రీ మరణం తీరని లోటు

**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ టౌన్ :** సహజ కవి అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూపునార్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో అందెశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వాసనలో నుంచి అక్షరాలను పుట్టించిన ప్రజా కవి అందెశ్రీ అని కొనియాడారు. 'మాయమైపోతున్నడమ్మో...' పాటతో మనసున్న మనుషుల కోసం వెతికారని అన్నారు. మనిషిలోని మానవత్వం కోసం ఆవేదనతో ఆ పాట రాశారని అన్నారు. "జయ జయహే తెలంగాణ" అని తెలంగాణ చరిత్రను ప్రపంచానికి తెలిపిన అందెశ్రీని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరిచిపోదని రమేష్ అన్నారు.
ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు కోట వెంకన్న, వైరాగడే మారుతీ పటేల్, ఆవిడపు ప్రణయ్, సిరికొండ సాయి కృష్ణ, శెండే నాందేవ్, నీకోడే హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## సిగ రవీందర్‌కు.. హిందుస్థాన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** టియు సారంగాపూర్ బిఇడి కళాశాలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సిగ రవీందర్‌కు 'హిందుస్థాన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గుర్తింపునిచ్చింది కోవిడ్ 2019 కాలంలో (కోవిడ్19) అభ్యసనం, విద్యాశ్రేష్టతకు వారు చేసిన అంకితభావానికి గుర్తింపుగా అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ వెబినార్లు, కాన్ఫరెన్స్‌లు ఈ క్విజ్ పోటీలలో పాల్గొనడం మూలం 140పై ఈసర్టిఫికెట్లను పొందటం ద్వారా వారు ఒక అద్భుతమైన మైలురాయిని సాధించారని, జ్ఞానం పట్ల వారికి ఉన్న మక్కువ, వృత్తిపరమైన ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ గౌరవం అత్యుత్తమ ప్రయత్నాలు అద్భుతమైన శ్రేష్టతకు ప్రతీకగా 'హిందుస్థాన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' అదికృత సంస్థ ద్వారా ధృవీకరించబడిందన్నారు. నవంబర్ 11న మంగళవారం ఈ గుర్తింపును ఇచ్చినట్లు తెలిపారు. తనకు హిందుస్థాన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన ప్రతిభకు గుర్తింపు రావటం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఈ గుర్తింపు తనకు వ్యక్తిగతంగానే కాకుండా తెలంగాణ విశ్వవిద్యాలయానికి తెలంగాణ రాష్ట్రానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. హిందుస్థాన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తనకు స్థానం లభించడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలు, డాక్టర్ మహేందర్‌రెడ్డి,ప్రొఫెసర్ కైసర్ మహ్మద్, తెవివి ప్రొఫెసర్లు సహచర అధ్యాపకులు డాక్టర్ ఆర్.కరుణాకర్, వి.శ్రీనివాస్, పోలపల్లి శ్రీకాంత్, డాక్టర్ రామలింగం, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ ప్రవీన్‌కుమార్, టిపిఎ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ ప్రవీన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



## విధులతో పాటు క్రీడలు కూడా...

### జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి ఉద్యోగులు సంస్థపరమైన విధులతో పాటు క్రీడలలో కూడా రాణించాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డిజిఎం (ప) ఎస్.అనిల్ కుమార్ అధ్యక్షతన ప్రగతి మైదానంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో సింగరేణి కబడ్డీ జట్టు క్రీడాకారులకు నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంప్‌ను ముఖ్య అతిథిగా హాజరై జనరల్ మేనేజర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులతో పాటు క్రీడారంగంలోనూ ప్రతిభ కనబరచడం గర్వకారణమని కొనియాడారు. సంస్థ తరఫున క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికవడం అభివృద్ధి సూచికమన్నారు. శిక్షణ శిబిరం 15 రోజుల వరకు నిర్వహించబడుతుందని, క్రీడాకారులకు మెరుగైన మెలకువలను, నైపుణ్యాలను నేర్చుకునే అద్భుత అవకాశంగా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, స్పోర్ట్స్ హానరరీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ పాల్గొన్నారు.



## వృద్ధాప్య పింఛన్ హామీ అమలులో జాప్యంపై 'ఆప్' ఆగ్రహం

### నిర్మల్‌లో రాస్తారోకో,పెద్ద ఎత్తున నిరసన

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వృద్ధాప్య పింఛన్ 4,000కి పెంచుతామన్న హామీని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేతలు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ, ఆప్ కార్యకర్తలు మంగళవారం నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించి,పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అనంతరం వారు ఆర్డీఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దిద్ది సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా,ఈ ప్రధాన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర ఎక్స్ కన్వీనర్ రామ గౌడ్,పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హదర్,నిర్మల్ జిల్లా జనరల్ సెక్రెటరీ సిహెచ్ వినోద్ కుమార్,జిల్లా ట్రెజరర్ అబ్దుల్ సాదిక్,షారు,ఇతర పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### జిఎం విజయభాస్కర్ రెడ్డి



**ప్రజాపక్షం/రెబ్బెన :** గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సింగరేణి ఉన్నత పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు మరో నాలుగు నెలల్లో ఉన్నందున విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సాధన చేయాలన్నారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. భారత విద్యా వ్యవస్థలో కలాం తీసుకువచ్చిన సంస్కరణలను గుర్తు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల తో కలిసి పాఠశాల ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. గంట పాటు శ్రమ దానం చేసి గడ్డి ముళ్ళ పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒటు జిఎం రాజమల్లు, డిజిఎం (సివిల్) ఎస్‌కె. మదీనా బాషా, కరస్పాండెంట్ మండల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రవితేజ, వ్యాయామ ఉపాధ్యాయుడు కె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** విద్యార్థులంతా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం చించోలి(బి) సమీపంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌కు విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి, బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సమరయోధులలో ముందువరసలో నిలిచి,దేశ స్వాతంత్రం కోసం ప్రాణం పణంగా పెట్టారని పేర్కొన్నారు. ఆయన జయంతిని మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా కూడా జరుపుకుంటామని తెలిపారు.స్వాతంత్రం అనంతరం భారత తొలి విద్యశాఖ మంత్రిగా పని చేసి,విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్య కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉన్న కాలంలో, మౌలానా ఆజాద్ దేశంలో విద్య, వ్యాప్తి, సమాన అవకాశాల కోసం నిరంతర కృషి చేశారని కలెక్టర్ వివరించారు.మైనార్టీ వర్గాల ఉన్నతికి, సమాజ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన గొప్పతనాన్ని తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని, ముఖ్యంగా బాలికలు విద్యను మధ్యలో ఆపివేయకుండా, మంచి ఉద్యోగాలను సాధించి సమసమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు బాలికల విద్యాభివృద్ధికి విస్తృత ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, తొలి విద్యాశాఖ మంత్రి అయిన ఆయన జీవితకాలం ప్రతి ఒక్కరికీ విద్య అనే లక్ష్య సాధనకు కృషి చేశారని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మైనార్టీ శాఖ ఉద్యోగులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై ఉపన్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్, తహసీల్దార్ రాజు, కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్ రహత్ నాజ్నిమ్,సుజాతా రాథోడ్, ఇతర అధికారులు, మైనార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణింపు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణిస్తూ సామాజిక దృక్పథం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల మైదానంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని, చదువులో ఏకాగ్రతను పెంచుతాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పౌష్టిక ఆహారం వంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పోటీలలో గుడిపేట బాలుర జట్టు ప్రథమ, నిర్మల్ జిల్లా బాలుర జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందాయని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ఎఐ బోధనతో విద్యార్థులలో మార్పుకు కృషి : అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** విద్యా విధానంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) విద్యా బోధన ద్వారా విద్యార్థులలో మార్పు తీసుకొచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎఐ బోధన, విద్యార్థుల హాజరు శాతం పెంపుదల, నాణ్యమైన విద్య బోధన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా అందిస్తున్న బోధనలో విద్యార్థులు పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులను పర్యవేక్షించాలని, విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆజాద్ కృషి చిరస్మరణీయం

### అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళవారం అబుల్ కలాం ఆజాద్ 127 వ జయంతి, మైనారిటీ సంక్షేమ దినోత్సవం జాతీయ విద్యా దినోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, మైనారిటీ ప్రతినిధులతో కలిసి దీపక్ తివారి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని, విద్యారంగంలో అమలు చేసిన సంస్కరణలతో భారతరత్న పొందారని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఆజాద్ హయాంలో ఎన్నో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలు, విశ్వవిద్యాలయాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని విద్యాలయాలు ఏర్పాటు చేశారని, బాలిక విద్యను ప్రోత్సహించి బాలికలు విద్యారంగంలో రాణించాలని ఆకాంక్షించారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, ఆసిఫాబాద్ తహసీల్దార్ రియాజ్ అలీ, మైనారిటీ సంఘాల ప్రతినిధులు ఫయాజ్, రహమాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ మండలం చిన్న మావంది గ్రామంలో ఏర్పాటు చేసిన సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు.
సోయాబిన్ పంట నాణ్యత, తేమ శాతంను వారు పరిశీలించి, ఇప్పటి వరకు సేకరించిన పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పంట ఉత్పుతులు తెచ్చిన వెంటనే 12శాతానికి లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు.సేకరించిన పంటను జాగ్రత్తగా సిడబ్ల్యూసి గోడౌన్‌లకు తరలించాలని అన్నారు. రైతులకు నిర్ధిష్ట గడువు లోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొక్కజొన్న, సోయాబిన్ సేకరణకు సంబంధించి పట్టా రైతు బయోమెట్రిక్ వేలి ముద్రను తప్పనిసరిగా తీసుకోవాలనే నిబంధనను అమలు చేస్తుండటం వల్ల తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు కౌలు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.
దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సడలింపు ఇవ్వాల్సిందిగా రైతుల పక్షాన మరోమారు కోరతామని అన్నారు. కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్, వ్యవసాయ శాఖ అధికారి సంతోష్, స్థానిక అధికారులు ఉన్నారు.

## అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ప్రతి సంవత్సరం జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకుంటూ, స్వాతంత్రం అనంతరం భారత తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి నిరంతరం శ్రమించి,అనేక సంస్కరణలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. మైనారిటీల విద్యా అభివృద్ధి, మహిళా విద్యా ప్రోత్సాహానికి ఆయన చూపిన కృషి ఎంతో విలువైనదని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహనీయుల జీవిత చరిత్ర ప్రతి ఒకరికీ స్ఫూర్తిదాయకమని, యువత ఆయన ఆలోచనలను, విలువలను అనుసరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్,ఆర్డీవో రత్నకల్యాణి, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మైనార్టీ సంఘాల నాయకులు,ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

### భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, తహసీల్దార్ దత్తాత్రి, ఇతర సిబ్బందితో భూ భారతి, స్పెషల్ ఇంటెన్సివ్ అమలు తీరుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

**భూ భారతి దరఖాస్తులపై కలెక్టర్ కీలక ఆదేశాలు...**

భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఆయా మాడ్యుల్స్ లో పెండింగ్‌లో ఉన్న అర్జీల వివరాలు, పరిష్కార ప్రక్రియ, నోటీసులు జారీ చేసిన సంఖ్య, క్షేత్రస్థాయి పరిశీలన వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు అన్నీ భూభారతి దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను స్పష్టంగా వివరంగా పేర్కొనాలని సూచించారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు రోజువారిగా దరఖాస్తులను పరిశీలనను పర్యవేక్షించాలని తహసీల్దార్‌కు సూచించారు.

**ఎస్ఐఆర్ పకడ్బందీ అమలు...**

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా కేటగిరిల వారిగా మ్యాపింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు.

**జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం, సోయాబిన్ కొనుగోళ్లు...**

సమీక్ష అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పురోగతిని వివరించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు జిల్లాలో 3.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. సోయాబిన్ కొనుగోళ్ల కోసం జిల్లాలో 9సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని సెంటర్లలో కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయని పేర్కొన్నారు. వీటిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో కలిసి వీక్షించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాత్రి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి

### డిఇఒ భోజన్నకు టిజిపిఇఎటిఎ వినతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు క్రీడల పట్ల మరింత ఆసక్తిని పెంచాలని టిజిపిఇఎటిఎ (TGPEATA) సంఘం ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ) దర్శనం భోజన్న ని మర్యాదపూర్వకంగా కలిశారు. టిజిపిఇఎటిఎ (Telangana Government Physical Education Teachers Association) నాయకులు డిఇఒతో మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని సూచించారు.అనంతరం కెజిబివిలు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పైన డీఈవోతో చర్చించారు.
ఈసమస్యల పరిష్కారం కోసం డిఇఒ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే సానుకూలంగా స్పందిస్తూ,త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిపిఇఎటిఎ అధ్యక్షుడు నరాల సత్తయ్య, కార్యదర్శి వన్నెల భూమన్న, కోశాధికారి నచ్చేందర్‌తో పాటు భూక్య రమేష్, భోజన్న, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్,వ్యాయామ ఉపాధ్యాయులు వంశీ, సంధ్య, సంజీవ్, బుచ్చి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక మేటలను పరిశీలించిన మైన్స్ ఎడి

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మాంజీరా నదిలో ఇసుక మేటలు వేసిన విషయాన్ని ఆయా దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలకు జిల్లా మైనింగ్ శాఖ ఏడీ నగేష్, నిజాంసాగర్ ఆర్ఐ సాయిలు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాంజీరాలోకి వెళ్ళేందుకు మాగి గ్రామస్థులు మట్టి, పైపులు వేసి దారి అసంపూర్తిగా వేయడంతో రైతుల తీరుపై ఆయన ఆగ్రహించారు. రైతులు సమాధానమిస్తూ తమ గ్రామానికి సంబంధించిన రైతులు, వ్యవసాయదారులు తమ పంటపొలాల్లో వ్యవసాయ పంపు మోటార్లు మాంజీరా నదిలో మునిగి పోయాయని, వాటిపై ఇసుక మేటలు పెట్టి చెడిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అట్టి మోటార్లను తీసుకువచ్చి మరమ్మతులు చేయించేందుకు గాను రహదారి ప్రొక్లెయిన్, జేసీబీ వెళ్ళడం కొరకు తాము సిమెంట్ పైపులు వేశామని, ఇసుక అక్రమ తరలింపు కొరకు కాదన్నారు. సావదానంగా విన్న ఏడీ రైతులతో మాట్లాడుతూ మోటార్లు తెచ్చుకునేందుకు అనుమతిస్తున్నాం కాని అక్రమంగా ఇసుక రవాణా చేస్తే సహించేది లేదని రైతులను హెచ్చరించారు.

## ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

### కామారెడ్డి జిల్లా ఎస్పి రాజేష్‌చంద్ర

**ప్రజాపక్షం/పిట్లం :** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ప్రతీ పోలీసు జవాబుదారి తతనంతో పనిచేయాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర సూచించారు. ఆయన మంగళవారం పిట్లం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆఖస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, లాక్‌అప్ గది, రెస్ట్ రూం, పార్కింగ్ ప్రదేశాలను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించి తగు శోదనలు చేశారు. విధి నిర్వహణలో పోలీసుల వ్యవహారశైలి ఏవి ధంగా ఉండాలో సూచించారు. ప్రతీ పోలీసు భాధ్యతాయుతంగా వ్యవహబూరించి డయల్ 100 కాల్స్ బ్లూకోల్ట్ సిబ్బంది తక్షణమే స్పందించాలని, పెట్రోలింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పక్కాగా చేపట్టాలని సూచించారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి సమాచారం సేకరించి ప్రజలకు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాల, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు తదితర వాటిపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డీఎస్పీ బి.విఠల్‌రెడ్డి, రూరల్ సీఐ తిరుపతయ్య, పిట్లం ఎస్సై వెంకట్‌రావ్‌పాటిల్, సిబ్బంది ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## డ్రంకన్ డ్రైవ్‌లో 77 మందికి జరిమానా

**సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదని సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ హెచ్చరించారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 77 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పట్టణ పోలీసులు మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా 77 మంది మందు బాబులకు జరిమానాలు విధిస్తు మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ వివరాలు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన వారికి పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు.

## మౌలానా సేవలు అపూర్వం



**ప్రజాపక్షం/కరీంనగర్:** మొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం ఆయన జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వారి సేవలకు గుర్తుగా ఆయన జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఆధునిక విద్యావ్యవస్థకు పునాది వేశారన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలు ఏర్పాటు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మైనార్టీ సంక్షేమ అధికారి, డిఆర్‌వో బి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## గీతపనివారల సంఘం నూతన కమిటీ

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగింది. జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర కో కన్వీనర్ బొమ్మగాని నాగభూషణం గౌడ్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా నేరెళ్ల సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా న్యాలపట్ల రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా బండారి తిరుపతి గౌడ్, ఆకుల రాజయ్య గౌడ్, తాళ్లపల్లి చంద్రయ్య గౌడ్, సహాయ కార్యదర్శులుగా బుర్ర అశోక్ గౌడ్, బండారిపల్లి వెంకటేశం గౌడ్, రంగు శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా బుర్ర మల్లయ్యగౌడ్‌లతో పాటు 17 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని నాగభూషణం గౌడ్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నేరెళ్ల సదానందం, న్యాలపట్ల రాజులు మాట్లాడుతూ జిల్లాలో గీత పనివారల సంఘం బలోపేతానికై అన్ని గ్రామాల్లో, మండలాల్లో సభ్యత్వం చేర్పించి గీత కార్మికుల సమస్యలు తెలుసుకుని భవిష్యత్తు పోరాటాలకు గీత కార్మికులను సన్నద్ధం చేస్తామని తెలిపారు.

## అందెశ్రీ అస్తమయం కవులకు తీరనిలోటు

**ప్రజాపక్షం/కరీంనగర్:** అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి, బహుజన దళిత కవులు కళాకారులకు తీరని లోటు అని దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్ పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన గేయ రచన జయ జయహే తెలంగాణ కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో తెలంగాణ ప్రభుత్వం రూపకల్పన చేసిందని, ఇంతలోనే ఉదయం గుండెపోటుతో మరణించడం తెలంగాణ సమాజానికి తీరని లోటు అన్నారు. కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. అనేక సాహితీ అవార్డులు తీసుకున్నారని, ఆయన మరణం సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

## క్రీడాకారులకు అభినందన

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ స్థాయిలో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్ పోటీలు విజయవంతంగా నిర్వహించారు. పాఠశాల వ్యాయామ విభాగాధిపతి సుంకరి మురళీధర్ సమన్వయంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్ 14, 17 బాల బాలికల విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్, అండర్ 19 బాల బాలికల విభాగాల్లో లాన్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్ పోటీలు జరిగాయి. కోచ్ కృష్ణమోహన్ నిష్పక్షపాతంగా ఎంపిక ప్రక్రియను నిర్వహించగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ కార్యదర్శి బి.వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘంఉపాధ్యక్షుడుకె.కృష్ణ, జి.శ్రీనివాస్ (పిడి), చిరంజీవి(పిడి), బి.మహేష్ (పిఈటి), బి.రాజశేఖర్(పిడి), వై.రవీందర్(పిడి) తదితరులు పాల్గొన్నారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ డా.భబితా విశ్వనాథన్, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డిలు అభినందిస్తూ భవిష్యత్తులో మరెన్నో క్రీడా పోటీలు నిర్వహించడానికి తాము సిద్దంగా ఉన్నామని తెలిపారు.

## జర్నలిస్టుల రైల్వేపాసులు పునరుద్ధరించాలి

**ఎంపిని కోరిన టియుడబ్ల్యుజె నాయకులు**



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జర్నలిస్టుల రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరుతూ టియుడబ్ల్యుజె (ఐజేయు) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంపీ ధర్మపురి అరవింద్ కు వినతి పత్రం అంద చేశారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్లో నిర్వహించిన దిశ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చీటి శ్రీనివాసరావు, బెజ్జంకి సంపూర్ణ చారి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని సౌకర్యాలు కల్పించాయన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో రాయితీతో కూడిన ప్రయాణానికి జర్నలిస్టులకు బస్సు పాసులు అందజేస్తుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు రాయితీతో కూడిన రైల్వే పాసులను అందజేసేదని వాటిని గత 3 సంవత్సరాల క్రితం రద్దు చేశారన్నారు. వివిధ కారణాలతో రద్దుచేసిన జర్నలిస్టు రైల్వే పాసులను పునరుద్ధరించేందుకు కృషి చేయాలని ఎంపీ ని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ అరవింద్ రైల్వే పాసుల పునరుద్ధరణ విషయం రైల్వే మంత్రి, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టులు రాజేందర్ రెడ్డి, ఆనంద్, వంశీకృష్ణ, చింత లక్ష్మ ణ్ తదితరులు ఉన్నారు.

## ఇళ్ల లబ్ధిదారుల వివరాల సేకరణ

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్, కోజన్ కొత్తూరులలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అర్హత వివరాలను క్లస్టర్ అధికారి రాజ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులు, వ్యవసాయ భూముల వివరాలు, ఇంటి నిర్మాణనైకి అవసరమైన స్థలం ధ్రువ పత్రాలు, నిర్మణానికి లబ్ధిదారులు సంసిద్దత పరిశీలించారు. పంచాయతీకార్యదర్శులు రాణి, రాకేష్, దరఖాస్తుదారులున్నారు.

# ‘స్నేహిత’తోనే బాలికలకు భరోసా

**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** బాలికల్లో ధైర్యం, భరోసా నింపేందుకేస్నేహిత కార్యక్రమం, మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకే శుక్రవారం సభకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి ప్రభుత్వ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో విద్యార్థులకు స్నేహిత 2 అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల పెట్టె తాళం చెవి నోడల్ ఆఫీసర్, షీటీం సిబ్బంది వద్ద ఉంటుందని, విద్యార్థినులు తమకు జరిగిన ఇబ్బందులను పేపర్‌పై రాసి ఇందులో వేస్తే అధికారులే విచారించి కారకులపై చర్యలు తీసుకుంటారని వివరించారు. ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100 కు సమాచారం ఇవ్వాలని బాలికలకు సూచించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడుగమనించాలని, వారితో స్నేహంగా ఉంటూ అన్ని విషయాలు తెలుసుకోవాలని సూచించారు. ఏబిసి ఆఫ్ లైఫ్ రూమ్‌లో భాగస్వాములైన ఘర్షకుర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతోకలెక్టర్ ముచ్చటించారు. ఈ సంధర్భంగా విద్యార్థులు వేదికపై విలువలు తెలిపే ప్లకార్డులు ప్రదర్శించారు. లక్నోలో జాతీయస్థాయి ఉపాధ్యాయుల సదస్సులో ఈ పాటను ప్రదర్శించారు.





**పరిష్కార వేదికగా శుక్రవారం సభ**

వివిధ రకాల సమస్యలకు పరిష్కార వేదికగా శుక్రవారం సభ నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలకు ఆరోగ్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు, చిన్నారులకు పోషకాహారం, తదితరాంశాలు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య మహిళ కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 54 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణిలుకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సిడబ్ల్యూసి చైర్మన్ ధనలక్ష్మి మాట్లాడుతూ అనాథలు, బాల్యవివాహాలు, సంరక్షన కొరవడిన పిల్లల గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని, బాధ్యతలు చూస్తామని పేర్కొన్నారు. షీటీమ్ సిఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియాను ప్రజా ప్రయోజనానికి మాత్రమే ఉపయోగించాలన్నారు. అపరిచితులతో ఎలాంటి వివరాలు పంచుకోవద్దని బాలికలకు సూచించారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, వైద్యశాఖ ప్రోగ్రాం ఆపీసర్ సనా, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి తదితరులున్నారు.

## జమ్మికుంట పట్టణంలో పోలీసుల తనిఖీలు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ సిపి గౌస్ ఆలం ఆదేశాల మేరకు మంగళవారం జమ్మికుంటపట్టణంలోకరీంనగర్ నార్కోటిక్ సిఐ పుల్లయ్య, జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్ ఆద్వర్యంలో డాగ్ స్క్వాడ్, పోలీసుల బృందం బస్టాండ్, రైల్వే స్టేషన్, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా సిఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు కనబడినా, ఏమైనా బ్యాగులు కనబడినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జమ్మికుంట ఎస్సైలు సతీష్, నాగరాజులు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులున్నారు.

## హుజురాబాద్‌లో విస్తృత తనిఖీలు

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు హుజురాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృతంగాతనిఖీలుచేపట్టారు.ముఖ్యంగా బస్టాండ్, కొరియర్ సెంటర్స్, ట్రాన్స్‌పోర్ట్‌లలో తనిఖీలు చేశారు. తనిఖీలలో పేలుడు సామాగ్రితో పాటు మత్తు, మాదక ద్రవ్యాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఏసిపి మాధవి మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఎక్కడైనా మూటలు, బ్యాగులు వదిలిపెడితే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అన్నారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య, ఎస్ఐ యూనస్ అహ్మద్ అలీ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యతోనే పేదరికం నుంచి శాశ్వతంగా విముక్తి

**పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్య ద్వారానే పేదరికం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్ట మొదటి నెహ్రూ నాయకత్వంలోని క్యాబినెట్ లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. హిందీ అరబిక్ బెంగాలీ ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పని చేశారని,



దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కులమత బేధాలు లేకుండా పని చేశారని అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందన్నారు. పేదరికం విద్యతో మాత్రమే దూరమవుతుందని భావించి ప్రతి పేదవాడికి విద్య అందే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా మైనార్టీ శాఖ అధికారి రంగారెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అక్బర్ ఆలీ, మైనార్టీ నాయకులు సయ్యద్ మస్రత్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి శిక్షణ సద్వినియోగం**

**పెద్దపల్లిరూరల్:**గ్రామీణ నిరుద్యోగ యువత ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలనికలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా యూనియన్ బ్యాంక్‌ఆధ్వర్యంలో రంగంపల్లిలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి సంస్థ ద్వారా వివిధ కోర్సులలో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న యువకులు దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ అపర్ణ రెడ్డి, రీసెట్ డైరెక్టర్ రాకేష్ ,లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం భోజనం వల్లే విద్యార్థులకు ఇబ్బంది

**తహసీల్దార్ వెంకట్‌రెడ్డి**

**బాలికల పాఠశాలలో విచారణ చేపట్టిన అధికారులు**



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట బాలికల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వికటించి విద్యార్థుల అస్వస్థతకు గురైన సంఘటనపై తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, సిఐ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్, ఫుడ్ఇన్స్‌పెక్టర్లు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సంఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం నాసిరకంగా ఉందని, కోడిగుడ్లు కాలం చెల్లినవి కావడంతో విద్యార్థులకు వాంతులు, విరోచనాలకు గురయ్యారని విచారణలో తేలిందన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులు డిశ్చార్జ్ అయిన తర్వాత మంగళవారం సైతం పాఠశాలకు వచ్చారని తెలిపారు. ఈ సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులను సొంతపిల్లలుగా భావించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను తమ సొంత పిల్లలుగా చూసుకుంటూ అత్యుత్తమ సేవలు అందించాలని కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలోభాగంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు.చిన్నారుల బరువు, రిజిస్టర్లను పరిశీలించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఆద్వర్యంలో జిల్లాలోని అం గన్‌వాడీ కేంద్రాలు పనితీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.విద్యారంగంలో అంగన్‌వాడీ కేం ద్రాలే తొలిమెట్టు అని, ఇవి బాగా పనిచేస్తాయని, పాఠశాలలుఅభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా వారికి నేర్పిస్తున్న విద్యాబోధనలు, రైమ్స్ అదనపు కలెక్టర్ ఆలకించారు. పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలుతీసుకోవాలనిఅధికారులకు సూచించారు. అధికారులు, తదితరులున్నారు.

## బిసి జెఎసి జిల్లా వైస్ చైర్మన్‌గా కొండి సతీష్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మన్‌గా జిల్లా కేంద్రం రంగంపల్లికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, సామాజిక ఉద్యమ కారుడు కొండి సతీష్‌ను నియమించినట్లు జిల్లా చైర్మన్ దాసరి ఉష తెలిపారు. మంగళవారం సతీష్ కు ఉష నియామక పత్రం అందజేశారు. బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగ బద్దంగా 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లాలోని వివిధ బీసీ సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలను కలుపుకొని సమిష్టిగా పోరాడుతామన్నారు. బీసీలు రాజ్యాధికారం చేపట్టే విధంగా ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష తప్పనిసరి

**ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై ఎంపీడీవోలు ప్రతి రోజు సమీక్ష చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై జిల్లాలోని జడ్పీ సీఈవో, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, పీడీ హౌసింగ్ తో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఇండ్లు కట్టుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాల సభ్యులకు డీఆర్డీఓ, మెప్మా నుంచి ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఇసుక ఇబ్బందులు ఉంటే తహసీల్దార్లతో ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మాట్లాడాలని ఆదేశించారు. తమ పరిధిలోని రీచ్ ల నుంచి ఇసుక తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై రోజు టెలీ కాన్ఫరెన్స్ చేయాలని సూచించారు. పీడీ హౌసింగ్, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు తమ మండలాల్లో ఇండ్ల నిర్మాణాల పురోగతి పరిశీలించాలని ఆదేశించారు. హౌసింగ్, ఇతర అధికారులు తమ పరిధిలో ఇండ్ల ఫోటోలు తీసి ఆన్లైన్లో అప్ లోడ్ చేయాలని, పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకునేలా అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీల సభ్యులు ప్రోత్సహించాలని సూచించారు.

# వంటిమామిడిలో మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం

**ఒకే కూర వండటంపై కలెక్టర్ హైమావతి మండిపాటు**



**ప్రజాపక్షం/ సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీర సాగర్ గ్రా మంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ హైమావతి మంగళవారం తనిఖీ చేశారు. వంట గదికి వెళ్లి మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. మెనుప్రకారం రుచికరంగా ఉండాలని, వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు చదువు, భోజన విషయంలో కొరత లేకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల ప్రాంగణం శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతి గదికి వెళ్లి కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్ట్ ్స పైన పట్టు సాధించాలన్నారు. కఠిన సబ్జెక్టులపై మరింత ఫోకస్ పెట్టి ఎక్కువ సార్లు చదివితే పట్టు సాధించవచ్చునన్నారు. .



**వంటిమామిడిలో ఒక్కకూర!**

ములుగు మండలం వంటిమామిడి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలనుజిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించారు. మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెనుప్రకారం కాకుండ కేవలం అన్నం, ఒక కూర మాత్రమే వండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంబారు లేకుండ ఒక్క కూర విద్యార్థులకు సరిపోతుందా అని కలెక్టర్ మండిపడ్డారు. తప్పనిసరిగా మెను పాటించాలని లేని యెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

## పిఆర్‌సి అమలు కోసం డిమాండ్

**టిఆర్‌టిఎఫ్ ముస్తాబాద్ మండల అధ్యక్షునిగా మహేషుని లక్ష్మీనారాయణ**

**టిఆర్‌టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్**

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ముస్తాబాద్ మండల శాఖ ఎన్నికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్తాబాద్ లో నిర్వహించారు. మండల కమిటీని టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలోఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, పరిశీలకులుగా రాష్ట్ర బాధ్యులు పోతుగంటి రమేష్ వ్యవహరించారు. ముస్తాబాద్ మండల అధ్యక్షుడుగా మహేషుని లక్ష్మి నారాయణ ను, ప్రధాన కార్యదర్శిగా ఓరగంటి భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా బెజుగామ పావనశ్రీ జిల్లా కౌన్సిలర్లుగా శనిగరం భాస్కర్, శాస్త్రుల శ్యామ్ సుందర్ శర్మలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గం టిఆర్ టిఎఫ్ జిల్లా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, బోయన్న గారి నారాయణ మాట్లాడారు. త్వరగా ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణ నివేదికను తెప్పించుకుని పి.ఆర్.సిని అమలు చేయాలన్నారు.శనిగరంభాస్కర్,పేరుకవెంకటేశ్వరరావు,గుగులోత్ రమేష్ నాయక్, పులి ప్రవీణ్ కుమార్, కోల వినయ్‌కుమార్,గాజెంగివిష్ణు, మామిడాల రమేష్, సుల్తాన్ రాజు, గోలి రాధకిషన్,సామల రాములు ఉన్నారు.

# రీల్

## ఆ హీరోకు థ్యాంక్స్: నిర్మాతలు



కిరణ్ అబ్బవరం నటించిన 'కె ర్యాంప్'లో రాజశేఖర్ హీరోగా నటించిన ఆయుధం సినిమాలోని ఇదేమిట్ట మాయా మాయా మైకం కమ్మింది పాటను ఉపయోగించారు. హీరో ఇంట్రడక్షన్ సమయంలో ఉపయోగించిన ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఎంతోమంది ఈ పాటకు రీల్స్, షార్ట్స్ చేశారు. ఇలా 'కె ర్యాంప్' సక్సెస్‌లో ఈ పాట కూడా ఒక భాగమైంది. ఈ నేపథ్యంలో ఆయుధం సినిమా హీరో రాజశేఖర్, నిర్మాతలు వజ్ర శ్రీనివాసరావు, ఎన్.అంజన్ బాబు, దర్శకుడు ఎన్ శంకర్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌లకు 'కే ర్యాంప్' నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు థ్యాంక్స్ చెప్పారు నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు మాట్లాడుతూ మా సినిమాలో డాక్టర్ రాజశేఖర్ హీరోగా నటించిన ఆయుధం సినిమాలోని ఇదేమిట్ట మాయా మాయా పాటను పిక్ చేసుకున్నాం. ఇంతమంచి బ్లాక్ బస్టర్ సాంగ్ అందించారు వందేమాతరం శ్రీనివాస్ నిర్మాతలు వజ్ర శ్రీనివాసరావు, ఎన్.అంజన్ బాబుకి, ఇలాంటి బ్లాక్ బస్టర్ సాంగ్ అప్పట్లోనే సెలెక్ట్ చేసుకున్న మా డైరెక్టర్ ఎన్.శంకర్‌కి థ్యాంక్స్. ఆయుధం టీమ్ అందరికీ థ్యాంక్స్ అన్నారు.

## 21న 'పాంచ్ మినార్' రిలీజ్



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై మాధవి, ఎం.ఎస్.ఎం.రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్న ఈ సినిమా నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. రాజ్ తరుణ్, అజయ్ ఘోష్, రాశి సింగ్, శ్రీనివాస్ రెడ్డి ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ ఇంట్రెస్టింగ్ గా వుంది.

## శివలో నాగార్జునను తప్ప మరొకరిని ఊహించుకోలేను

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ

* శివ నా కెరీర్‌లో బెస్ట్ ఫిలిం : నాగార్జున



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో 1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4కే డాల్బీ అట్మాస్‌లో నవంబర్ 14న థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ.. ఒరిజినల్‌లో ఉండే ఫీవర్ పోకుండా ఏఐ టెక్నాలజీని వాడి ఎఫెక్ట్ ఇవ్వడం కోసం వర్క్ చేసాము. అది మీ అందరికీ నచ్చడం హ్యాపీగా ఉంది. శివ మేడ్ ఫర్ వన్ అండ్ ఓన్లీ నాగార్జున. శివ సినిమాలో నాగార్జునను తప్ప మరొకరిని ఊహించుకోలేను. నాగార్జున క్యారెక్టర్ ఒక స్టూడెంట్. తన రౌడీ కాదు. కానీ ఒక సిచువేషన్‌లో తన చేతిలో చెయిన్ ఉండాలనుకున్నప్పుడు, అది నేచురల్ గా ఉండాలి. అలాంటి సమయంలో తన దగ్గరలో ఉండే ఏదైనా ఒక వెపన్ లాంటిది కావాలనుకున్నాం. అలా సైకిల్ చైన్ ఐడియా క్రియేట్ అయింది. సౌండ్ క్వాలిటీ ఇంత పెరిగాక సాంగ్స్ స్లోడౌన్ చేస్తాయని మాకు అనిపించింది. నాగార్జున ఫ్యాన్స్ ఎంజాయ్ చేయొచ్చు. నేను బయట ఒక హిట్ కొట్టిన తర్వాత నాగార్జున గారిని అప్రోచ్ అవుతాను అని రామ్ గోపాల్ వర్మ అన్నారు. హీరో నాగార్జున మాట్లాడుతూ..36ఏళ్ల తర్వాత రీరిలీజ్ లో ఇలా కలుస్తామని నేను కలలో కూడా అనుకోలేదు. శివకి ఇంత ఆదరణ కల్ట్ ఫాలోయింగ్ ఉంటుందని కలలో కూడా అనుకోలేదు. రాము అప్పుడు ఎంత ఇష్టపడి ప్రతిదీ కేర్ తీసుకుని చేశాడో రీ రిలీజ్ కోసం కూడా గత ఆరు నెలల నుంచి అంతే ఇష్టంతో వర్క్ చేశారు. సౌండ్ అద్భుతంగా వినిపిస్తుంది అని అంటున్నారు. ఇదంతా రాము చేసిన ఎఫర్ట్. డాల్బీ అట్మాస్ కి తగ్గట్టుగా ఈ సౌండ్ ని రీ క్రియేట్ చేశారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కూడా సౌండ్ బాగుందనే కాంప్లిమెంట్స్ వచ్చాయి. ఫస్ట్ టైం నేను సౌండ్ బాగుంది అనే టాక్ శివ సినిమాలో విన్నాను. శివ మాకు చాలా పర్సనల్. రాము స్ట్రాంగ్ విజన్, కన్విక్షన్తో వచ్చారు. సినిమాని ఇలా కూడా తీయొచ్చని చూపించారు. నేను కూడా చాలాసార్లు ఎందుకు శివ ఇంత కల్ట్ సినిమా అయిందని ఆలోచిస్తాను. సంథింగ్ మ్యాజిక్ జరిగింది. 'సినిమా చాలా పెద్ద హిట్. చాలా మంచి సినిమా చేశావ్. ఇది ఎక్కడికి వెళ్లి ఆగుతుందో తెలియదు' అని అప్పట్లో మా నాన్న చెప్పారని నాగార్జున అన్నారు.

ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవం. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్‌పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం ఈ నెల 14న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్ కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో, ఉత్తర అమెరికా, కెనడాలో విడుదల చేయనున్నారు. మంగళవారం మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. కింగ్ నాగార్జున ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక ఘనంగా జరిగింది. నాగార్జున మాట్లాడుతూ.. గత వైభవం సినిమా గురించి ఆషికా చెబుతూనే ఉంది. తను ఈవెంట్‌కి రావాలని అడగడం, నేను వచ్చేయడం వెంటనే జరిగిపోయాయి.

## గత జన్మల సినిమాలంటే చాలా ఇష్టం : నాగార్జున



నాకు గత జన్మల సినిమాలంటే చాలా ఇష్టం. నాన్న సినిమా మూగమనసులతో నాకు బాగా పరిచయం. నేను అదే ఇష్టంతో జానకి రాముడు సినిమా చేశాను. రెండు సినిమాలు చాలా సూపర్ హిట్ అయ్యాయి. గత జన్మలు అనేది మన కల్చర్‌లో ఉండిపోయిన ఒక కథ. మనం చిన్నప్పుడు నుంచి వింటుంటాం. గత వైభవం నాలుగు జనరేషన్స్ కథ, ట్రైలర్ చూస్తుంటే ఎంత కష్టపడ్డారో తెలుస్తుంది. దుష్యంత్ స్క్రీన్ మీద ఫెంటాస్టిక్‌గా కనిపిస్తు న్నారు. ఆషికా అద్భుతమైన నటి. ఈ సినిమా కోసం ఇద్దరు చాలా కష్టపడ్డారు. ఈ సినిమా బాగా ఆడాలి. హనుమాన్ లాంటి సినిమాను అందించిన చైతన్య ఈ సినిమాని రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. విజువల్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలని కోరుకుంటున్నానన్నారు.

## 'సిగ్మా' ఫస్ట్ లుక్ రిలీజ్



సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో జాసన్ సంజయ్ దర్శకత్వంలో యాక్షన్అడ్వెంచర్ సిగ్మా చిత్రం 65 రోజుల షూటింగ్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. నాలుగు నెలల పాటు జరిగిన షూటింగ్‌తో దాదాపు తొంబై శాతం పూర్తయింది.ఈ చిత్రానికి సిగ్మా అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో హీరో సందీప్ కిషన్ యాక్షన్ అవతార్ కనిపించారు. బంగారం, నోట్ల కట్టల మధ్య కూర్చొని, తన చేతికి బ్యాండేజ్ కడుతున్నట్లుగా కనిపించిన సందీప్ లుక్ అదిరిపోయింది.సిగ్మా కథ ఒక ధైర్యశాలి, నియమాలకు అతీతమైన వ్యక్తి నేపథ్యంలో వుంటుంది. అతని ప్రయాణం థ్రిల్లింగ్ ట్రెజర్ హంట్, హైస్టేక్స్ క్రిమినల్ హీస్ట్ అంశాలతో కలిపి, యాక్షన్, అడ్వెంచర్ గా వుంటుంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ పూర్తి స్థాయి యాక్షన్ హీరోగా అలరించనున్నారు.

## ఈ సినిమా ఎంతో సంతృప్తి కలిగించింది

మీడియా చిట్ చాట్‌లో అను ఇమ్మాన్యుయేల్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటించిన ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాలో ఈ మూవీలో దుర్గ క్యారెక్టర్‌లో నటించిన మంచి గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్ మీడియాతో చిట్ చాట్ చేశారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా కోసం ఫస్ట్ ప్రొడ్యూసర్ ధీరజ్ నుంచి కాల్ వచ్చింది. ఆ తర్వాత రాహుల్ కలిసి స్క్రిప్ట్ చెప్పారు. స్క్రిప్ట్, నా క్యారెక్టర్ గురించి విన్న తర్వాత తప్పకుండా ఈ మూవీలో నటించాలని అనిపించింది. అమ్మాయిల గురించి ఒక మంచి విషయం చెప్పే మూవీ ఇది. ఈ చిత్రంలో నటించడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ఇది గీతా ఆరట్స్ సినిమా కాబట్టి బాగా చూసుకుంటారనే నమ్మకం ఉంది. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకు వస్తున్న రెస్పాన్స్ హ్యాపీగా ఉంది. అయితే నేను ఏ సినిమా చేసినా ఆ మూవీకి ఎలాంటి ప్రశంసలు వస్తాయని ఆశించను. నేను తెలుగు తమిళంలో స్టార్ హీరోలతో నటించాను. అయితే నా కెరీర్‌లో కొన్ని సినిమాలు చేసి ఉండకూడదు అని ఇప్పుడు రిగ్రెట్ ఫీల్ అవుతున్నా. కొన్ని కమర్షియల్ మూవీస్‌లో నటించడం వల్ల నటిగా నాకు ఎలాంటి సంతృప్తి లభించదు. నాలుగు డ్యాన్స్ స్టెప్స్ వేసి, ఏవో డైలాగ్స్ చెప్పిస్తారు. ఈ రొటీన్ మూవీస్ చేసేప్పుడు నేను రియలైజ్ కాలేదు గానీ ఇకపై అలాంటి మూవీస్ చేయకూడదు అని నిర్ణయించుకున్నా. 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి మూవీస్‌ను మన సంతృప్తి కోసం, ఏదైనా కొత్తగా నేర్చుకునేందుకు చేశాను. ఈ చిత్రంలో దుర్గ క్యారెక్టర్‌లో నటించాను. ఫస్టాఫ్‌లో కొన్ని సీన్స్ చూస్తున్నప్పుడు నా క్యారెక్టర్‌ను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అనే భయంవేసింది. కానీ ఆ తర్వాత డైరెక్టర్ రాహుల్ నా క్యారెక్టర్‌ను తీర్చిదిద్దిన విధానంతో హ్యాపీగా ఫీలయ్యా. రాహుల్ చాలా సెన్సిటివ్ డైరెక్టర్. నా క్యారెక్టర్ ఒక్కటే కాదు, అన్ని పాత్రలను చేయి పట్టి నడిపించారు. యూఎస్ నుంచి ఇండియాకు వచ్చినప్పుడు నా నేటివ్ ప్లేస్ కేరళకు వెళ్లలేదు. డైరెక్ట్‌గా హైదరాబాద్ వచ్చా. అప్పటి నుంచి హైదరాబాద్ వీడలేదు. మలయాళంలో పృథ్వీరాజ్ ఆడుజీవితం సినిమాకు ఆడిషన్ చేశా, కానీ ఆ మూవీ చేయలేకపోయా. మంచి అవకాశం వస్తే మలయాళంలో మూవీ చేస్తా అని చెప్పారు.



## ఉప ముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా 'పితాపురంలో' టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రేయసి రావే' ఫేమ్ మహేష్చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పితాపురంలో'. దీనికి ఉపశీర్షిక 'అలా మొదలైంది'. డా.రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్,మణిచందన, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష తదితరులు ప్రధాన తారాగణం. మహేష్చంద్ర సినిమా టీమ్ పతాకంపై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'ఈ సినిమా కాన్సెప్ట్ గురించి దర్శకులు చెప్పారు. మంచి సందేశాత్మక చిత్రంగా అనిపిస్తోంది. యువతరం కుటుంబ సమేతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ఎలా ఎదగాలనే సందేశం ఈ సినిమాలో ఉంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి' అని చెప్పారు.

డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇవాళ సమాజంలో ఏం జరుగుతుందనే పాయింట్ని దర్శకుడు మహేష్చంద్ర అద్భుతంగా డీల్ చేశాడు. స్టోరీ నచ్చి నేను కూడా ఇష్టంగా ఈ సినిమా చేశాను. 'ఆ నలుగురు', 'మీ శ్రేయోభిలాషి', 'ఓనమాలు' తరహాలోనే సందేశాన్ని అందిస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలున్న సినిమా ఇది అని తెలిపారు. నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఇది మూడు కుటుంబాల కథ. ఈ ఇంటర్నెట్ యుగంలో తల్లిదండ్రులంటే గౌరవం కనబరచని యువతకు కనువిప్పు కలిగించే చిత్రం ఇది అని పేర్కొన్నారు.

దర్శకుడు మహేష్చంద్ర మాట్లాడుతూ.. 'నా తొలి సినిమా 'ప్రేయసి రావే' నాకెంతో గొప్ప పేరు తీసుకొచ్చింది. ఈరోజుకీ ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయి ఉంది. 'పితాపురంలో' సినిమా కూడా అదే స్థాయిలో నిలిచిపోయే సినిమా. నా మనసుకి నచ్చిన కథ ఇది. ముగ్గురు తండ్రుల కథలా అనిపిస్తూనే మూడు జంటల మధ్య నడిచే కథ ఇది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గమైన 'పిఠాపురం' పేరుతోనే ఈ సినిమా తీశాం. ఈ టైటిల్ని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించడం చాలా చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. వచ్చే నెలలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం అని తెలిపారు.

## భారీ ఎన్‌కౌంటర్ (మొదటి పేజీ తరువాయి)

గాయపడ్డ నలుగురు నక్సల్స్‌ను సంఘటనా స్థలంలోనే అరెస్టు చేసినట్లు బీజాపూర్ ఎస్పి జితేంద్ర యాదవ్ పేర్కొన్నారు. సంఘటనా స్థలంలోనే వారికి చికిత్స అందించి.. అంబులెన్స్ ద్వారా బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

### వారు రాజకీయ ద్రోహులు : ప్రజా యుద్ధ పంథాలు కొనసాగిస్తాం

సోను, సతీష్‌లు రాజకీయంగా దిగజారిన ద్రోహులని వారికి మావోయిస్టు పార్టీ పంథాను తప్పు పట్టే హక్కు లేదని పేర్కొంటూ మావోయిస్టులు ఒక లేఖ విడుదల చేశారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో విడుదలైన ఈ లేఖలో సతీష్, సోను లు విచ్ఛిన్నకర వైఖరితో మరి కొందరి క్యాడర్లను మోసగించి ప్రభుత్వాలకు లొంగిపోయారని ఆ లేఖలో పేర్కొన్నారు. దశాబ్దాల తమ రాజకీయ జీవితాన్ని వీరిద్దరు రాజ్యంతో కుమ్మక్కై ముగించుకున్నారని వారు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన కారణంగానే కొద్ది రోజుల పాటు కాల్పుల విరమణ పాటించి లొంగుబాటును సుగమం చేశారన్నారు. మావోయిస్టు పార్టీ దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాను కొనసాగిస్తుందని లేఖలో అభయ్ పేర్కొన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఎదగకపోవడం వల్లనే సోను, సతీష్‌లు తప్పుదారి పట్టారని లేఖలో ఆరోపించారు. పార్టీ రాజకీయ ఎత్తుగడలను అమలు చేయడంలోనూ వారు విఫలమయ్యారని లేఖలో అభయ్ పేర్కొన్నారు. దేశంలో హిందుత్వ ఫాసిస్టు రాజ్యం కారణంగా అంతులేని అన్యాయాలు, హత్యాచారాలు జరుగుతున్నాయని ఇందుకు సంబంధించి ప్రజల్లో తీవ్రమైన నిరసన, ప్రతిఘటన కొనసాగుతున్నాయన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు దేశంలో వ్యవసాయ విప్లవం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసి సమ సమాజ స్థాపన దిశగా ప్రయాణం చేస్తూ ఉంటుందని అభయ్ తెలిపారు.

## రూ.12.99 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు (జిఓఆర్‌టి 66)విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు పంపించిన నివేదికల ప్రకారం 15 జిల్లాలలో 8662 ఇండ్లు దెబ్బతిన్నాయి. ఈ ఇండ్ల బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.12.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. అక్టోబర్ 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వరుసగా నాలుగు రోజులు రాష్ట్రంలోని 16 జిల్లాలలో భారీ వర్షాలు కురిశాయి. వరంగల్, హన్మకొండ, వికారాబాద్, వనపర్తి, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కోతగూడెం, నల్గొండ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని జిల్లా కలెక్టర్లు తమ నివేదికలలో తెలియజేసినట్లు ప్రభుత్వం వివరించింది.

## చిక్కులు లేని ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

2050 సిద్ధం చేసే ప్రక్రియ మొదలైంది. ఈ సిఎంపి ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్–2050లో కీలక భాగంగా ఉంటుంది. సుస్థిరమైన, దీర్ఘకాలిక రవాణా వ్యూహాన్ని రూపొందించడం, అలాగే జాతీయ పట్టణ రవాణా విధానం (ఎన్‌యుటిపి)– 2006/2014, హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసి, హెచ్ఎంఆర్ఎల్ తదితర సంస్థల ప్రణాళికలకు అనుగుణంగా సమర్థవంతమైన పెట్టుబడి మార్గదర్శకాలను గుర్తించడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశం. సిఎంపి తయారీ బాధ్యతను ఎం/ఎస్ లీ అసోసియేట్స్ సౌత్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. ఈ నేపథ్యంలో సిఎంపి – 2050 ముసాయిదా నివేదికపై ముఖ్య భాగస్వామ్య విభాగాల సమావేశం మంగళవారం రసూల్‌పురాలోని హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. లీ అసోసియేట్స్ అందించిన ముసాయిదా నివేదికపై అధికారులు సుదీర్ఘకంగా చర్చించారు. ఈ సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎంయుటిఎ, జిహెచ్ఎంసి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఆర్‌డిసిఎల్), హెచ్‌జిసిఎల్, హెచ్‌ఆర్‌డిసిఎల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డిటిసిపి), టిఎస్‌ఐఐసి, టిజిఎస్ ఆర్‌టిసి, ట్రాఫిక్ పోలీసు (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ), హెచ్ఎండిఎ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని తెలిపారు. సిఎంపి ముసాయిదా నివేదికపై ప్రతి శాఖ సవివరంగా పరిశీలించి, తమ అభిప్రాయాలు, సూచనలు, సిఫారసులు త్వరితగతిన సమర్పించాలని సూచించారు. తద్వారా నివేదికను మెరుగుపరిచి, తుది రూపంలోకి తీసుకువెళ్లవచ్చు అని అన్నారు. సిఎంపి–2050 లక్ష్యం వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చగల, సమర్థవంతమైన, సురక్షితమైన, సుస్థిర రవాణా వ్యవస్థను నెలకొల్పడం ముఖ్య ఉద్దేశమన్నారు. భవిష్యత్ పెట్టుబడులకు మార్గదర్శకత్వం ఇచ్చే సమతుల్య పట్టణాభివృద్ధి దిశగా ఈ ప్రణాళిక దోహదం చేయనుందని చెప్పారు. ఈ సమావేశంలో హెచ్ఎండిఎ డైరెక్టర్ కె.విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉండాలి

నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తప్పవు

కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆయిల్ పామ్ విస్తరణలో నిర్లక్ష్యం వహించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తక్కువ పురోగతిలో ఉన్న వరంగల్, నారాయణపేట, వనపర్తి, రాజన్న సిరిసిల్ల, గద్వాల్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆయా కంపెనీలు లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పని చేయాలని మంత్రి ఆదేశించారు. ఆయిల్ పామ్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషిస్తోందన్నారు. రాష్ట్రంలో 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, ఇందులో 73,696 మంది రైతులు భాగస్వామ్యులయ్యారని వివరించారు. 202122 నుండి ఇప్పటి వరకు 2.28 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 1.25 లక్షల ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటి వరకు 31,158 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని, మార్చి నాటికి మిగిలిన 93,842 ఎకరాలు సాగులోకి రావాల్సి ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్రానికి 6.54 లక్షల ఎకరాల లక్ష్యం కేటాయించగా, కేవలం 2.28 లక్షల ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చిందని వివరించారు.

### కంపెనీలు బాధ్యతతో వ్యవహరించాలి

ఆయిల్ పామ్ సాగు విస్తరణలో కంపెనీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి కంపెనీ తమ పరిధిలోని జిల్లాల్లో సరిపడా సిబ్బందిని నియమించుకుని, రైతులతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండాలని మంత్రి తుమ్మల సూచించారు. తోటల యాజమాన్యంలో నీటి వినియోగం, ఎరువుల పంపిణీ, అంతర పంటలు, కలుపు నివారణ వంటి అంశాలపై పూర్తి దృష్టి సారించాలని చెప్పారు. కొత్త తోటలలో గెలల దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షించడం,విజయవంతమైన రైతుల అనుభవాలను కొత్త రైతుల ప్రోత్సాహానికి వినియోగించడం అవసరమని సూచించారు. రాబోయే ఏడాదికి ఆయిల్ పామ్ మొక్కల డిమాండ్ పెరగనున్నందున ప్రతి కంపెనీ తన లక్ష్యానికి అను గుణంగా నర్సరీలను ఏర్పాటు చేసుకుని నాణ్యమైన మొక్కలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల సందేహాల నివృత్తి కోసం కంపెనీలు తమ పరిధిలో రైతు సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతు వేదికల కార్యక్రమాల్లో కంపెనీ ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొని రైతులతో చర్చించాలని ఆదేశించారు. వచ్చే సంవత్సరానికల్లా ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ స్థాపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

### త్వరలోనే ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల ప్రారంభం

త్వరలోనే రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ప్రారంభంకానున్నాయని తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఈనెలలో నర్మెట్ట (సిద్దిపేట) లో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ (30120 టన్నుల సామర్థ్యం), 2026, జనవరిలో పెద్దపల్లిలోని తిరుమల ఆయిల్ ఫ్యాక్టరీ (15 టన్నుల సామర్థ్యం), ఖమ్మంలో గోద్రేజ్ అగ్రోవెట్ ఫ్యాక్టరీ (1560 టన్నుల సామర్థ్యం) వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వనపర్తిలో ప్రీయూనిక్ ఫ్యాక్టరీ (1530 టన్నుల సామర్థ్యం), జూన్‌లో కల్లూరు గూడెం (ఖమ్మం)లో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ (1560 టన్నుల సామర్థ్యం) బీచుపల్లి (గద్వాల్)లో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ (15 టన్నుల సామర్థ్యం) ఆగస్టు నెలలో ములుగు జిల్లాలో కె.ఎన్ బయో సైన్సెస్ ఫ్యాక్టరీ (10 టన్నుల సామర్థ్యం) ప్రారంభం కానున్నట్లు తుమ్మల వివరించారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో వచ్చి పాల్గొన్నారు. అందెశ్రీ సతీమణి మల్లుబాయి, కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయ పద్ధతిలో కర్మకాండలను నిర్వహించగా, అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. అందెశ్రీ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి ఓదార్చారు. అంతిమ సంస్కార కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. సాహిత్య సమరయోధుడి అంతిమయాత్రలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె.కేశవరావు, టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా తదితర జిల్లా అధికారులు సైతం అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు.

### పద్మశ్రీ ఇవ్వాలని మరోమారు కేంద్రానికి లేఖ రాస్తాం : సిఎం

అందెశ్రీ రాసిన ప్రతీ పాట తెలంగాణలో స్ఫూర్తిని నింపిందని, అందుకే ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చేందుకు, మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుంటామని, అందెశ్రీ పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామని, ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందెశ్రీ అంత్యక్రియలలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశమిస్తూ అందెశ్రీ పాటల సంకలనం నిప్పుల వాగు ఒక భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా తెలంగాణ సమస్యలపై పోరాడే వారికి ఒక మార్గదర్శకంగా ఉపయోగపడుతుందన్నారు. అందుకే 20 వేల పుస్తకాలను ముద్రించి తెలంగాణలోని ప్రతీ లైబ్రరీలో నిప్పుల వాగును అందుబాటులో ఉంచుతామన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని, ఈ ఏడాది కూడా కేంద్రానికి లేఖ రాస్తామని సిఎం వెల్లడించారు. అందెశ్రీకి పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సహకరించాలని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆయనను పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామన్నారు. పశువుల కాపరిగా, తాపీ మేస్త్రీగా, తెలంగాణ ఉద్యమకారుడిగా రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన వ్యక్తి అందెశ్రీని కోల్పోవడం తెలంగాణ సమాజంతో పాటు వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయనను కలిసి తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన పాత్ర ఉండాలని కోరానని, గద్దర్‌తో పాటు అందెశ్రీ కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపాయన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com